నవంబర్ 16-30, 2022

సంపుటి 03, సంచిక 3

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక





భారతీయ పోరాటయోధురాలు...

## రాణి ఝాన్సీ లక్ష్మీబాయి

19 నవంబర్ 1828 - 18 జూన్ 1858



బహునాటక రచయిత, స్వాతంత్ర సమరయోధుడు...

## సోమరాజు రామానుజరావు

**జూన్ 18, 1896 - నవంబర్ 14, 1934**

*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 4th Floor, Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

# విషయ సూచిక




02 కార్పొరేట్ వికృత రూపాన్ని పొదల మాటున మాటువేసిన పులి అంటున్న **కొండి మల్లారెడ్డి** కవిత... **"డేంజర్ బెల్స్"**





17 మోసాన్ని ఎదిరించే పల్లెటూరి నిక్కచ్చితనం చెప్పే **నెల్లుట్ల రమాదేవి** కథ **"మాల్"**





25 **"నా భాషకేమైతది"** అని ధైర్యం తెచ్చుకోగలిగిన తెలుగు మాస్టారు కథ తెలిపిన **కుంతి**





29 గ్రంథాలయాల ఉద్యమాన్ని బలోపేతం చేసే పరిస్థితులను చెప్పిన **డా॥ భీంపల్లి** వ్యాసం **"పాలమూరు జిల్లాలో గ్రంథాలయ ఉద్యమం"**





35 సిరి సంపదలు వచ్చి నా పాత తిండినే ప్రేమించిన ఓ తల్లి కథ తెలిపిన **సంఘీర్ "కోపిన్ బియ్యం"**





13 నిబంధనలు లేని నిజాన్ని పలికించే శ్రీరామ్మూర్తి కవిత్వానికి **'నీహారిణి** వ్యాసరూపం **"నివురు గప్పని నిజం"**





05 మూగ ప్రేమ పరిమళానికి సాంప్రదాయిక జీవితానికి మధ్య జరిగిన యుద్ధం చిత్రించిన నాటి కథ **"టెస్ట్ ట్యూబ్‌లో కన్నీరు"**

45 నాటి భారతనారి శౌర్యప్రతాపాల స్మరిస్తున్న **భాగ్యలక్ష్మి** వ్యాసం... **"ఆదర్శ వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి"**

11 మధుశాల నుంచి వినిపించే మధురవాక్యం **"ఉమర్ మధు మధురకవిత"**కు **రఘువర్మ** స్వేచ్ఛానువాదం..

గడప దాటని కవి కాలాన్ని ఎదిరించిన తీరు చిత్రించిన **సంబరాజు రవి ప్రకాష్** వ్యాసం **"కరోనాపై కోట్ల గడప దాటని యుద్ధం"** ...పేజీ 21

కార్పొరేట్ కాపురాల పట్ల సెటైర్ **బుర్ర మధుసూదన్ రెడ్డి** **ఎగ'తాళి' సంసారాలు** కవిత ...పేజీ 24

కవిత్వం అంటే సామాజిక వైరుధ్యాల అక్షరాయుధం అని తెలిపే **చింతోజు మల్లికార్జున్** కవిత **"కవిత్వాయుధం"** ...పేజీ 34

పల్లె అందాలన్నీ చెరువుకు అద్దాలని **"పూల పరవశాన్ని"** వివరించిన **వకుళ వాసు** కవిత ...పేజీ 04

దీప సందేశాన్ని వినిపించిన **భాను ప్రకాష్** పద్య కవిత **"జయమిమ్ము"**...పేజీ 28

నిర్మల హృదయంలో ఎగసిన బాలకవిత్వపు తరంగాలు **పత్తిపాక మోహన్** కలం నుండి **'కూర చిదంబరం'** వ్యాసం ...పేజీ 41

**ఇంకా...** మరెన్నో కవితలు, సాహితీ శిఖరం, సమాజం, పుస్తక పరిచయం, స్వీకారం.. మొదలైనవి...

కవిత



# డేంజర్ బెల్స్



కొండి మల్లారెడ్డి, 94419 05525

బండెడు కుడుములు
బండి ఎడ్లు
పంటికిందికైనా ఆనని
బకాసురుని ఆకలిదానిది

పచ్చపురుగు
ఆకుల్ని నాకుతున్నట్టు
వేరు పురుగు
మూలాల్ని తొలుస్తున్నట్టు
అది పాదం మోపిననేల
మిడతలు వాలిన పొలం

పండ్లచెట్లు కూలిపోతాయి
పావురాల రెక్కలు తెగుతాయి
పక్షులు ఉచ్చుల్లో
విలవిలలాడుతాయి
గుట్టలూ పుట్టలు
సకల జీవజాతి సమస్తం
కళ్ళెదుటే మట్టిగొట్టుకుపోతాయి

సాలీడు వల అల్లినట్టు
చేపకు ఎరవేసినట్టు
పొదలచాటున పులి మాటువేసినట్టు
కైనీడలో రూపమేదో కదులుతున్నట్టు

కొండవాలు దిగి
వొర్రెలు పర్రెలు దాటుకుంటూ
ఆకు కదలకుండా
అడుగులో అడుగేసుకుంటూ
ముందస్తు వ్యూహంతో
వేటకు దిగుతుంది

దూకుతున్న
సివంగిలా కాకుండా
పాకుతున్న కొండ చిలువలా
చుట్టేసుకోవడంలో నేర్పరి

దక్కనీ గొర్రెపై మనసు పారేసుకుని
దక్షిణాపథం వైపు
క్రమక్రమంగా
విస్తరిస్తున్నదీ కార్పోరేట్ వికృత రూపం....

సంపాదకీయం

తంగేడు

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

16-30 నవంబర్, 2022

సంపుటి 03 సంచిక 03



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గోవర్ధన్ రాజు
అసోసియేట్ ఎడిటర్
9676096614

ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి

# నిరాశ నుండే ఆశావాదం

సృజనకారులు కలలు కంటారు. ఎంత జరిగినా మరింత నూతనత్వం వైపే వాళ్ళ దృష్టి ఉంటుంది. మానవాళికి మంచికాలం రచించే ఆదర్శమే వాళ్ళలో పొంగులు వారుతుంది. తాను కంటున్న కల పట్ల సృజనకారునికి అనుమానం కూడా వెంటవెంటనే వస్తుంది. తాను కలలు కనే అక్షరాలలో ప్రతిఫలించే సమసమాజం ఈ సమాజంలో సాధ్యమౌతుందా? "ధనికస్వామికి దాస్యం చేసే" దైన్యత నిజంగా అంతరిస్తుందా? "ఆగర్భ శ్రీమంతునికి పేదవానికి జరిగే ఈ అనంత సంగ్రామానికి" అంతు ఎక్కడ?

ఆకాశంలో సగం అని గర్జించిన స్త్రీల పరిస్థితి కేవలం రాతలకే పరిమితమా? దళితులు ఆత్మవిశ్వాసంతో నిలబడే రోజు వస్తుందా? కవుల మాటలు "జాతి జనుల గుండెల్లో ఘూర్ణిల్లే గీతాలుగా నిలుస్తాయా?" కోటి నక్షత్రాల మాటలతో వెల్లివిరుస్తాయా? అని సృజనచైతన్యం కలవరపడుతుంటుంది.

కవి అక్షరాలలో వ్యక్తపరిచే స్వప్నం ఒక ధార. అది కొనసాగుతూనే ఉంటుంది. కాని నిజమైన సమాజాన్ని చూస్తే అతని సృజనాదర్శానికి ఏ ఆనవాళ్ళు కనిపించవు. ఈ మాయాజాల వ్యవస్థలో తాను కూడా ఒక భాగమే అని బోధపడుతుంది. తన రాతలన్నీ తన బొంట్లకు సంబంధించిన కలవరింతలు మాత్రమే అని తెలిసివస్తుంది. ఇక అతనికి కలిగే నిరాశ వర్ణనాతీతం. అతని అభివ్యక్తిలో అప్రయత్నంగానే ఒక సంక్లిష్టత చోటు చేసుకుంటుంది. మనుషుల వ్యాపార దృక్పథం మీద ఒక కసి పెరుగుతుంది.

ఆయన నిర్మాణ గతిలోని విపరీత పోకడలు అందరినీ ఆశ్చర్యపరుస్తాయి. ఈ వైరుధ్యం వల్ల, నిరాశ వల్ల ఒక్కోసారి తన రోజువారీ జీవితంలో కూడా అస్తవ్యస్తత వచ్చి చేరుతుంది.

క్రమంగా సృజనకారుడు లోకానుభవంతో లౌకిక సమాజాన్ని తీక్షణంగా దర్శించడంవల్ల నిజానికి చేరువౌతుంటాడు. "జీవించడం మొదలుపెట్టడంతోనే జీవితం అయిపోతుంది" అన్న మాక్సింగోర్కీ గుర్తుకువస్తాడు. తనకున్న సామాజిక జీవన పరిధిలోనే తన కొనసాగవలసిన రీతిని అవగాహన చేసుకుంటాడు."దాటిపోయిన యుగముల నాటి చరిత"ను నెమరువేసుకుంటాడు. సామాజిక లోపాల మీద, తనలోని లోపాలమీద ఏకకాలంలో యుద్ధం ప్రకటిస్తాడు. కాల్పనికత - వాస్తవికత అవిభాజ్యంగా కొనసాగుతాయి. ఒకప్పుడు యౌవనోద్రేకంలో ఎగిసిపడిన అలలకు ఇప్పుడు ఒక నింపాదితనం చేకూరుతుంది. మనిషిలోని ఋగ్మతే తన శత్రువు కాని, మనిషి కాదు అని అర్థమవుతుంది.

ఇంత తాత్విక చింతనతో ఘర్షణ పడే సృజనకారుడు అభివ్యక్తిలో కూడా పాఠకులకు దగ్గరగా వస్తుంటాడు. పద్యాలను అందంగా చెక్కే శిల్పిలాగా తయారౌతాడు.

ఇలాగా అతని ఘర్షణ ఒక సమతుల్యతకు చేరుకుంటుంది. ప్రపంచ మానవ పరిణామాలైన హెచ్చుతగ్గుల పైన అక్షరాస్త్రం సంధించడమే తన పని. తాను తన పనిచేస్తూ పోవడమే కావల్సింది. సాహిత్య భౌతిక జగత్తులోని వివాదాలు, ప్రక్రియా బేధాలు, సిద్ధాంత వైరుధ్యాలు ఏవి వచ్చినా అసమతుల్య సమాజాన్ని ప్రశ్నించడానికే. "పతితులారా... భ్రష్టులార..., ఏడవకండి ఏడవకండి" అని ధైర్యం చెప్పడానికే. నిరాశతో కృంగిపోయే దైన్యమానవునికి ఒక కరదీపిక కావడమే తన సృజన చైతన్యం, కర్తవ్యం కూడా.

ఈ సోయే అతన్ని దు:ఖిత మానవుని వైపు నిలబెడుతుంది. నిరాశ భూమికగానే ఆశావాదం ఉదయిస్తుంది. ఘర్షణతో వచ్చే పరిణతే సృజనకు సరైన గమ్యం నిర్దేశిస్తుంది.

జై తెలంగాణ - జై జాగృతి.

# పూల పరవశం



వకుళ వాసు, 99891 98334

గజ్జె ఘల్లు ఘల్లున మోగుతోంది
బతుకమ్మ ఆటలో చిందేయాలని...

గాజులు గలగలలాడుతున్నాయి
చప్పట్ల మోతలో జిగేలుమనాలని...

పెట్టెలో పట్టుబట్ట పులకరిస్తోంది
సోపతోల్లను గల్శి కొత్త గాలి పీల్చుకోబోతున్నానని...

సొమ్ములన్నీ సొగసులద్దుకుంటున్నాయి
పుత్తడి బొమ్మ ఒంటిపై జేరి ధగధగలాడాల్నని...

పసుపుకుంకాలు  మురిసిపోతున్నాయి
ముదిత మేనుకు మాకన్న మేటిలేరని...

పూలన్నీ విరగబూసి పరవశిస్తున్నాయి
పల్లె అందాలన్నీ చెరువుకు అద్దాల్నని...

ఆడపిల్ల బతుకమ్మై ఆరాటపడ్తుంది
అనుబంధాల కొలనులో దీపమైవెలగాలని...

సద్దుల ముద్దలన్నీ సంబరపడుతున్నాయి
తీపి దోసిట్లెత్తి ప్రేమంతా నోటినిండా నింపాలని...



నాటి కథ

# టెస్ట్‌ట్యూబ్‌లో కన్నీరు

అవ్యక్తమైన ప్రేమతో గిలగిలలాడిన
యువ హృదయం...




ముదిగొండ సాలగ్రామ
99662 16984


*ముదిగొండ సాలగ్రామ్ 1947లో సిద్దిపేటలో జన్మించారు. బిఎస్సీ వరకు విద్యాభ్యాసం సిద్దిపేటలోనే జరిగింది. మొదటిసారి హిందీ నుంచి ఉద్యమాల కథ అనువదించి జాగృతి వార పత్రికలో ప్రచురించారు. ఆ తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు సారస్వత సమితి నిర్వహించిన కథల పోటీలలో ఉత్తమ కథగా పదికుడు అనే కథకు బహుమతి లభించింది. తర్వాత ఇది ఆంధ్రభూమిలో ప్రచురితమైంది. 1964 నుండి 67 వరకు ఆంధ్రభూమి వారపత్రికలో ఐదు కథలు ప్రశ్నింపబడ్డాయి. 1969లో ఎంఎస్సీ భౌతిక శాస్త్రంలో నిజాం కళాశాల నుండి పట్టా పొందారు. ఈ సమయంలోనే నిజాం కళాశాల వెలువరించి విద్యార్థి అని పత్రికకు సంపాదకులుగా వ్యవహరించారు. 1970 నుంచి మహబూబ్‌నగర్ ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్‌గా ఉద్యోగ బాధ్యతను నిర్వహిస్తున్నప్పుడు టెస్ట్ ట్యూబ్ లో కన్నీరు అనే కథను ఆంధ్రజ్యోతి వార పత్రికలో ప్రచురించారు. అదేవిధంగా ఆంధ్రప్రభ మొదలైన పత్రికల్లో కథలు రచించారు. తర్వాత తెలుగు అకాడమీకి అనువాద గ్రంథాలను అందించారు. ఆయన ఎన్నో వచన కవితల్ని ఆంధ్రజ్యోతి భారతి పత్రికల్లో ప్రచురించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్ర ఆచార్యులుగా 2000 సంవత్సరంలో పదవీ విరమణ చేశారు.*

ప్రభావతి మారిపోయిందట. వింతగా ఆశ్చర్యకరంగా మారిందట! ఆమెనిప్పుడు ఒకప్పటి 'రీసెర్చ్ స్కాలర్' అంటే ఎవరూ పోల్చుకోలేరట. అవును మారుతుంది. ఆడది పెళ్ళయిన తరువాత మారక ఏం చేస్తుంది? భారత స్త్రీ అందునా పద హారణాల తెలుగు పడతిలో వివాహం ఆశ్చర్యాన్ని కల్గించే విషయమే. కారణం ప్రభావతి సామాన్య స్త్రీ కాదు. ఉన్నతమైన విద్య,ఆధునిక సంస్కారమూ, అన్నిటినీ మించి గణనీయమైన శాస్త్రీయ విజ్ఞానం, ప్రతిభాపాటవాలూ గల ప్రభావతి ఇలా మారిందంటే ఆమె భవిష్యత్తును గూర్చి ఊహాగానాలు చేసిన ప్రతివారికీ నమ్మశక్యం కాని విషయమే.

తన అసాధారణమైన తెలివితేటలతో భౌతికశాస్త్రానికి ఎంతో సేవ చేస్తుందనుకున్న ప్రభావతి ఎం.ఎస్.సి. రీసెర్చ్ స్కాలర్-గృహిణిగా అంటే వంటమనిషిగా భర్తకు సేవలు చేసే దాసీగా పిల్లల్ని కనే యంత్రంగా... ఛీ...ఛీ... ఆలోచిస్తేనే సిగ్గూ, అసహ్యమూ కలుగుతున్నాయి. ఆమె ఉన్నత విద్యకు భరింపరాని అవమానమిది. ప్రపంచంలోని శాస్త్రీయ ప్రగతికే గొడ్డలిపెట్టు! విజ్ఞాన జగతికే తీరని కళంకం.

ఇకముందు ఆమె భౌతికశాస్త్ర విజ్ఞానము ఇంటలిజెన్స్ ఆ వంటగదిలోని ధూళిలో, ధూమంలో కలిసిపోతుంది. ఆమె శాస్త్ర పరిశోధనా చాకచక్యం పడకదిలోని పరుపుల్లో నలిగిపోతుంది. తరువాత.. తరువాత పిల్లల ఏడ్పుల్లో సాంసారిక సమ స్యల్లో సైంటిస్టు, ఫిజిసిస్టు ప్రభావతి శాశ్వతంగా సమసిపోతుంది. ఆ ప్రభావతి ఇక దొరకదు, ఇక మిగలదు!

రాజేంద్రకు ఆగకుండా దు:ఖం వచ్చింది. లోకంలోని అమూల్యమైన వస్తువేదో అన్యాయమై నశించిపోతోందన్న ఆవేదన.. ఇంతకూ ఇది ప్రభావతికి సమాజం పెట్టిన పరీక్ష ఫలితమా లేక ఆమె తనకు తాను విధించుకున్న శిక్షా?

ప్రభావతి ఇచ్ఛాపూర్వకంగా ఇలా మారిందంటే అంతకంటే అబద్ధం లేదనిపిస్తోంది. ఈ క్రూర సమాజం ఒక అమాయికను, అబలను మీదు మిక్కిలి ఒక శాస్త్రజ్ఞురాలిని నిర్దాక్షిణ్యంగా బూజుపట్టిన సాంప్రదాయాలు, ఆచారాలకు బలికొంది. తన నియమాల ఇరుకు గోడల్లో శాశ్వతంగా బందీని చేసింది.. అయినా ప్రభావతి గొడ్డులా ఎందుకు తలవంచింది? బలమైన వ్యక్తిత్వం ఉన్న ఆమె ధైర్యంగా ఎందుకు ఎదురించలేకపోయింది. అవును! ఎందుకు ఎదిరించలేకపోయింది.

రాజేంద్ర జుత్తు పీక్కున్నాడు. టేబుల్ మీది పేపర్ వెయిట్‌ని చేతుల్లోకి తీసుకుని బలంగా అదిమాడు.

తనసెందుకింత వేధిస్తోంది ఈ సమస్య? ప్రభావతి ఒక మామూలు స్త్రీ అని ఎందుకు తీసేయలేకపోతున్నాడు?

ప్రభావతి మామూలు స్త్రీ....స్త్రీ....స్త్రీ...?

★ ★ ★

యూనివర్సిటీ ఆవరణలో లైబ్రరీ

నాటి కథ

వైపునుండి మైదానంలో చెట్టపట్టాలేసుకుని నడుస్తూ కనిపించారు భార్యాభర్తలు. ప్రభావతి జరీ అంచున్న లేత పసుపుపచ్చ రంగు చీరకట్టుకుంది. అదే రంగు జాకెట్టు వేసుకుందేమో, కన్పించలేదు. నిండుగా కొంగు కప్పుకొంది. నల్లని పొడవాటి జడనిండా తెల్లని మల్లెలు, నయాపైసంత బొట్టూ, కళ్ళకు ఒత్తుగా నల్లని కాటుక, కాళ్ళకు మట్టెలు ఇంకా చూడాలనిపించింది.

ఛ...! ఒక సాధారణ స్త్రీ...తనను, ఒక రీసెర్చ్ స్కాలర్‌ను ఇంతగా ఆకర్షించటమేమిటని అహాన్ని హెచ్చరించుకున్నాడు. కోరికను చంపుకున్నాడు. వారికి కన్పడకుండా మరోవైపుకు దాటుకున్నాడు.

పెళ్ళయిన తర్వాత కూడా అభిరుచిని చంపుకోకుండా పుస్తకాలు చదువుతోందేమో ప్రభావతి కుతూహలం చంపుకోలేక. వెంటనే తనకూ ప్రభావతికి బాగా తెలిసిన లైబ్రరీ అటెండర్‌ని పిలిచి అడిగాడు- "ప్రభావతిగారు పుస్తకాలేమైనా తీసుకెళ్ళారా?"

వాడు అదోరకంగా నవ్వి అన్నాడు..."ఛ...! వారికి ఇంకా పుస్తకాలెందుకండీ? అబ్బ చిలకాగోరింకల్లా అపురూపమైన జంటండీ. కొదువలేని పచ్చని సంసారం. ఆయిగా కాపురం చేసుకుంటుంటే ఇంకా పచ్చి వ్రాతలు, గీతలూ..."

స్టుపిడ్! ఆపు నీ వెధవ్వాగుడు" నిరుత్సాహానికి అవమానం తోడు కాగా, ఉద్రేకంతో దూకుడుగా వెనక్కు తిరిగాడు.

లైబ్రరీ మెట్లు దిగుతుంటే మళ్ళీ ఆలోచన, అయితే ప్రభావతి భర్తతో షికారుగా, కేవలం షికారుగా అటువేపు వచ్చిందన్నమాట. ప్చ్...అంతేనా? అని బలవంతంగా ఆలోచనల నుండి తప్పుకుంటూ చుట్టూ చూశాడు. ఎదురుగా అందమైన రవీంద్ర ఆడిటోరియం, ఇంకోపక్కగా వరుసగా ఆస్ట్రానమీ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ తదితర లేబొరేటరీలు, మరో వైపు ఉన్నతమైన ఆర్ట్స్ కాలేజీ భవనం...అల్లంత దూరాన హాస్టళ్ళు, ఉస్మానియా విశ్వవిద్యాలయం, విజ్ఞాననిలయంగా, శాస్త్రపరిజ్ఞాన నిధిగా, మానవ ప్రగతికి ప్రతీకగా తోచింది. ఆనందోద్వేగాలతో రాజేంద్ర మనసు నిండిపోయింది. తనెంత ధన్యుడు! పూర్ ప్రభావతి. ఇక ప్రభావతి జీవితం క్వయిట్ కామన్.

తృప్తిగా నవ్వుకుని, గబగబా తన రూమ్‌వైపు దారితీశాడు. తను ఇలాగే కృషిచేస్తే రెండేళ్లలో తనకు డాక్టరేట్ వస్తుంది. స్టేట్స్‌కు వెళ్లడం ఖాయం. ఇంకా ఇంకా పరిశోధనలు చేస్తాడు. మరెన్నో డాక్టరేట్లు... అదృష్టం కలిసివస్తే నోబుల్ ప్రైజ్... ఇంక ఆలోచించదలచుకోలేదు. పట్టలేనంత సంతోషం కలుగుతోంది రాజేంద్రకు. లోలోన పొంగిపోతున్నాడు.



కానీ, ఎంతోసేపు బాత్‌రూమ్‌లో స్నానంచేసి బట్టలు మార్చుకుని పుస్తకాల ముందు కూర్చుంటుంటే తెలిసింది. తన ఆనందం ఎప్పుడో తనకు తెలీకుండానే గాలిబుడగలా టప్పున పేలిపోయిందని. తలనుభారంగా చేతుల్లో ఉంచుకుని కళ్లు మూసుకున్నాడు. బాత్‌రూమ్ గోడలపైన ఎవరో రోగ్ వేసిన బూతుబొమ్మ కళ్ల ముందు నిలిచింది. ఛీ...కళ్లు తెరిచాడు. ఎదురుగా క్యాలెండర్. వయ్యారంగా అర్ధనగ్నంగా వాలిన అందాలసుందరి మార్లిన్ మన్రో ఫోటో!

నిస్సహాయంగా, కసితో చేతిలోని పెన్సిల్‌ను టేబుల్ మీద గుద్దాడు. మొన విరిగిపోయింది. 'ఛట్..మళ్లీ చెక్కుకోవాలి. కాసేపు రాసుకుని డయినింగ్ హాలుకి వెళ్లి...' లైట్లు ఆరిపోయాయి. కరెంటుపోయినట్లుంది.

ప్రభావతి అతనూ షికారు నుండి ఎక్కడికి పోతారు? ఇంటికి.. కారులో... తరువాత.. ఎంచక్కా కబుర్లాడుకుంటూ సుష్టుగా భోజనం చేస్తారు. దెన్... తమలపాకు చిలకలు, నవ్వులూ... పడకగది, పందిరిమంచమూ, లైట్ ఆఫ్..

భగవాన్ తను ఎందుకు ఇలా ఆలోచిస్తున్నాడు. ఏమయిపోతున్నాడు. లాభం లేదు. ఇంక ఈరాత్రి తను చదువలేడు, ఏమీ చేయలేడు. శిక్ష విధించుకోవాలి. తను భోజనం చేయకూడదు.

అంతే! ఆ రోజు రాత్రి రాజేంద్ర పస్తున్నాడు. ఆలోచనలనుంచీ తప్పుకోలేక చిత్రవధ అనుభవించాడు.

★ ★ ★

మళ్లీ ఈనాడు ఫ్యాన్ నరసింహులు చెప్పిన మాటలు అదే అవస్థకు గురిచేశాయి.

పాతపరిచయం పునస్కరించుకుని పండక్కి డిపార్ట్‌మెంటులో కొందరిని, సన్నిహితులను కొందరినీ ఇంటికి భోజనానికి పిలిచింది ప్రభావతి. రాజేంద్రకు కూడా ఆహ్వానం వచ్చింది. కావాలనే తాను వెళ్లలేదు. నరసింహులు వెళ్లినట్టున్నాడు.

"మహాతల్లీ... అన్నపూర్ణా... అరుంధతీ.. ఆహా... ఏమి ఆ వంట, ఆ రుచీ, అన్నింటినీ మించి ఆప్యాయత... ఓహో, పతివ్రతాశిరోమణీ..." ఇంకా ఏమేమో వాగాడు.

రాజేంద్ర భరించలేకపోయాడు. ఎగతాళిగా వెకిలిగా నవ్వుతూ "వంట చేయడం, వడ్డించడం కూడా బ్రహ్మ విద్యేనా? కలిగినవాళ్లు మీకింత పెట్టడం కూడా గొప్పేనట్రా వెధవా?"

తూలనాడాడు.

వాడు మెల్లగా జారుకుంటూ అనవలసిన మాటలు అని పోయాడు. "మీలాంటోళ్లకేం తెలుస్తుందిలే బాబు... ఆ సంసారంలోని గొప్పతనం. మీలాగే ఉంటే, ఊళ్లేలేదా? రాజ్యాలేలేదా? ప్రభావతమ్మ గారు ఎంతమారిపోయారని, ఎంత సంతోషంగా ఉందని, అయినా ఈ సంతోషం మీలాంటోళ్లకి ఎందుకులే బాబు?"

అవును. ప్రభావతి మారిపోయిందట! అదే తనకు నచ్చలేదు. అదే తను భరించ లేకపోతున్నాడు. భరించక చేసేదేముంది. అయినా, ప్రభావతి ఎవరు? ఇప్పటికీ ఆమె జీవితం అంత గొప్పది కానిదే తన మనసెందుకలా ఆక్రమించుకుంటోంది.

రాజేంద్రకు తనమీద తనకే విసుగు కలిగింది. తనుకూడా ఇలా మారిపోతు న్నాడేమిటి? ఒకప్పటి తను... అప్పటి ప్రభావతికి, ఇప్పటి ప్రభావతికీ ఎంత వ్యత్యాసం!

★ ★ ★

"ఈమె మిస్ ప్రభావతి! అల్ట్రాసానిక్స్‌లో రీసర్చ్ చేస్తోంది.ఆమెకు నేషనల్ స్కాలర్‌షిప్ ఉంది. ఇంకో ఏడాదయితే డాక్టరేట్ రావచ్చు. షి ది ప్రౌడ్ ఆఫ్ అవర్ డిపార్ట్‌మెంట్" ప్రొఫెసర్ పరిచయం చేశాడు.

రాజేంద్ర నమస్కరించి ఆమె వైపు పరిశీలనగా చూసాడు. నిరాడంబరంగా ఉన్నా, ఆ నిరాడంబరత్వంలో ఆధునికత కొట్టవచ్చినట్టు కన్పడుతుంది. లేతనీలం రంగు చీర, అదేరంగు పొట్టి చేతుల రవికా రెండు బిగుతుగానే ఉన్నాయి. ఒకచేతికి గాజులు లేవు. మరో చేతికి, 'స్క్వేర్ వాచీ'. మెళ్లో ఏమీ లేవు. ముఖం మీద పౌడర్ అద్దిన ఛాయలు తప్పితే మరేవిధమైన అలంకారాలు లేవు. నూనె రాయకుండా వదిలేసిన వదులు జడలు రెండు ఒకటి ముందుకు, మరొకటి వెనక్కు వేసింది.

ప్రభావతి నమస్కరిస్తుంటే చక్కగా 'గులాబీరంగులో ఉన్న ఆ చేతులకు గాజులు ఉండి ఉంటే, ఇంకా ఆ ముఖం మీద తిలకం, కళ్లకు కాటుకా, ఒంటి జడలో పూలూ' అని అనుకోకుండా ఉండలేకపోయాడు. అయితే, ప్రభావతిలోని విజ్ఞాన తేజస్సు అనిర్వచనీయమైన ఆకర్షణ, పై ఆలోచనకు ప్రాధాన్య మీయడం తర్వాత రాజేంద్ర ప్రభావతితో తన పరిచయం 'భాగ్యమని' అనుకున్నాడు. ఆమె సన్నిధిలో ఎవరైనా, ఎంత విచారంలో ఉన్నా, ఏదో ఒకరకమైన శాంతిని, నిశ్చింతను అనుభవిస్తారు. ఆమె అందరితోనూ ఆప్యురాలిగా చనువుగా మాట్లాడుతుంది. తను స్త్రీనని ఎదుటి వారు అనుకునేవిధంగా ప్రవర్తించక పోయినా అందరినీ ఆకర్షించేది. ఆమె తెలివితేటలతోబాటు ఆమె స్త్రీత్వం కూడానని రాజేంద్ర గ్రహించాడు.

గలగలమనే నవ్వు, చలాకీమాటలు, ఎంతటి సమస్యనైనా తేలిగ్గా పరిష్కరించే విజ్ఞానం, ఫిజిక్స్ సబ్జెక్టులో ఆమెకున్న పాండిత్యం, లక్ష్యసాధనతో కార్యదీక్షా ఎంతటివారినైనా ఇట్టే ఆకట్టుకునేది.

నిజమే! ఆమె ఆ డిపార్ట్‌మెంటుకు ఒక శోభ. ఏదో కళ. ఆమె ఉంటే అందరికీ నిశ్చింత.

"మీరు నాకంటే సీనియర్. పెద్దవారు. నన్ను 'మీరు' అని సంబోధించకుండా మీ సహచర్యాన్ని కోరే చిన్నవానిగా ఆదరించండి. నా వర్క్‌లో నిస్సంకోచంగా నన్ను ఆదేశిస్తూ గైడ్ చేయండి, అని రాజేంద్ర ఆమె దగ్గర ఓ ప్రత్యేకత సంపాదించు కున్నాడు.

లాబ్‌లో ఆమె పనిచేస్తున్నపుడు ఆమె సలహాలిస్తుంటే, తనకు సహాయం చేస్తుంటే, ప్రాబ్లమ్స్ చర్చిస్తుంటే, తనకు రాని ప్రాబ్లమ్స్ అప్పుడప్పుడు ఆమె సాల్వ్‌చేసి పెడుతుంటే, ప్రభావతీ అంటే గురుత్వభావమూ, చెప్పలేనంత గౌరవమూ, భక్తి ప్రపత్తులూ ఉండేవి.

"ప్రభావతీగారూ! మీ తెలివితేటలకు, కార్యదీక్షకూ, నా జోహార్లు ఇవే! మీరింకా ఇంకా విజ్ఞానశాస్త్రంలో ఉన్నత శిఖరాల నధిరోహించి మన దేశానికి పేరుప్రతిష్టలు సంపాదించాలని నేను మనసారా కోరుకుంటున్నాను. సామాన్య జీవితానికి లొంగకుండా ఒక మహత్తరమైన ఆదర్శానికి అంకితమయి పోయిన మీరు, మీ జీవితం నాలాంటి వాడికి ఆదర్శప్రాయం. మీరెన్నటికైనా ఆసక్తి, కార్యదీక్ష ప్రదర్శించి, సీవీ రామన్ తరువాత మనదేశానికి నోబెల్ బహుమానగ్రహీతగా..." ఇంకా ఏదేదో మాట్లాడుతుంటే మధ్యలోనే ఆపేసేది ప్రభావతి.

"...తప్పు. నీవలాంటి మాటలు మాట్లాడకూడదు. నీవు సైంటిస్టువి. రాజకీయ ఉపన్యాసం ఎలా చెప్పగలవోయ్" అని మాటమార్చేసేది.

విసుగులేకుండా ఆపరేటస్ అడ్జస్ట్ చేస్తుంటే చమటకారుతున్నా, పైట జారుతున్నా, లెక్కచేయకుండా తనపనిలో తదేక ధ్యానంతో లీనమై శ్రమిస్తుంటే, నిర్విరామంగా పుస్తకాలు చదువుతూ, కాలిక్యులేషన్స్ చేస్తూ, థీసెస్ రాస్తూంటే, ఆ ప్రభావతి...కాబోయే డాక్టర్ ప్రభావతి... రాజేంద్రకు పెద్ద ఇన్‌స్పిరేషన్. తెలివికి కర్తవ్యాన్ని ఎప్పటికప్పుడు గుర్తుచేసే ఆదర్శమూర్తి.

అలాంటి ప్రభావతి వారంరోజులు మాయమై పూర్తిగా మారిపోయిన రూపంతో పెళ్ళి కూతురు సిగ్గుతో, శుభ లేఖలతో ఉపటేబుల్ ముందు హఠాత్తుగా ప్రత్యక్షమయ్యేసరికి రాజేంద్ర షాక్ తిన్నాడు. ఆవేదనతో కృంగిపోయాడు. ప్రపంచానికి ఏదో పెద్ద ప్రమాదం వాటిల్లుతున్నంతగా కంగారపడ్డాడు.

"మీకు.. మీకు.. పెళ్లి మీదేనా?" తనకు కావలసిన జవాబు కోసం ఇంకా మిగిలున్న ఆశతో అడిగాడు.

"అవును.. ఏం?" మామూలుగా అంది.

"మీరు పెళ్లిచేసుకోబోతున్నారా?!"

"బాగుంది. నేనే పెళ్లి చేసుకోబోతు న్నాను. కానీ ఇంత ఆశ్చర్యాన్ని కలిగించడం దేనికో.." ఆశ్చర్యంగా కళ్లు తిప్పుతూ అడిగింది.

"....కొద్దిరోజుల్లో డాక్టరేట్ తీసుకోబోతున్న మీరు, వైజ్ఞానిక జగతికే వన్నె తేవాల్సిన మీరు, ఒక సామాన్యస్త్రీలా పెళ్ళిచేసుకోవటమేనా?" కొంత ఆవేశం మిళితం కాగా అపనమ్మకంగా అడిగాడు.

నిస్సహాయంగా నవ్వింది ప్రభావతి. "ఎన్ని డిగ్రీలు పొందినీ, ఎన్ని డాక్టరేట్లు సాధించనీగాక, స్త్రీ పెళ్ళి చేసుకోవా

ల్సిందే.పైగా నేను ఆంధ్రప్రదేశ్‌లో పుట్టాను. తెలుగు, సంప్రదాయాలు, ఆచారాలు నన్ను పెంచాయి. ఈ సమాజం నాకో రూపాన్నిచ్చింది. నేను ఎన్ని ఉన్నత పంథాల్లో పయనిస్తున్నా తెలుగు స్త్రీని, తెలుగు స్త్రీ కావాల్సిందే. నేను సామాన్య స్త్రీలా తెలుగు జీవితం గడపాల్సిందే. అది అసహజమైంది కూడా కాదు కనుక తప్పదు.''

"అంతేనా? మీరు దాన్ని ఎదిరించలేరా? మీ ప్రతిభావిశేషాలూ, ముగింపుకొచ్చిన పరిశోధనా అన్నీ గంగపాలు కావల్సిందేనా, నాశనం కావల్సిందేనా'' దుఃఖం ముంచుకొస్తుంది రాజేంద్రకు. తన నిస్సహాయత తనకు చికాకు కలిగిస్తుంది.

"నేను.. ఆదిమ సమాజాన్ని ఎదిరించటమా? దాంట్లో అర్థంలేదు, ప్రయోజనమూ ఉండదు. ఇక నా తెలివితేటలు ఉన్నాయన్నా ఎవరూ నమ్మరు. నాకు డాక్టరేట్ ఎందుకులే రాజా.. నీవు తెచ్చుకోవాలి'' చివరి మాటల్లో ఆప్యాయత, బాధా ధ్వనించినా రాజేంద్రకు అవి పొడిగా తోచాయి. ఆవేదన, ఏ అనుభూతి లేని నిర్లిప్తమైన మాటలు.

"వీల్లేదు'' అని అరవాలనిపించింది. విశ్వప్రయత్నాలు చేసైనా సరే ప్రభావతి పెళ్ళి ఆపాలనిపించింది. ఏమీ చేయలేక చేతులతో ముఖాన్ని కప్పుకున్నాడు. అయిపోయింది. అంతా అయిపోయిందని తనకీ దేశం ప్రగతి మీద, శాస్త్ర విజ్ఞానము మీద ఎంత ప్రేమ ఉన్నా.. ఈ అనర్ఘరత్నం చేజారిపోవటాన్ని ఆపలేడు. అది ఈ సమాజం చేసుకున్న పాపం. జాతి కోరుకున్న దుస్థితి'' రాజేంద్ర కళ్లల్లో నీళ్ల నిండాయి.

ప్రభావతిగారూ మీరు పెళ్ళిచేసుకోవడం నాకెంత మాత్రం ఇష్టం లేదు. కాని నేనేం చేయగలను? ఒక్కమాట చెప్పండి. ఇది మీ ఇష్టప్రకారంగానే జరుగుతోందా?''

ప్రభావతి ఇబ్బందిగా చూసింది. "నీ ఆవేదన నాకు అర్థమైంది రాజా! కానీ చూడు మనం ఒక రకమైన వాతావరణంలో జీవిస్తున్నాం. అది ప్రభావాన్ని చూపకుండా ఉంటుందా? పరిసరాలూ, సమాజం స్త్రీ జీవితానికి నిర్వచనాన్ని ఎప్పుడో నిర్దిష్టం చేసివేశాయి. పుట్టిననాడే ఆడవాళ్ళ బ్రతుకులు నిర్ణయించబడతాయి. ఎన్ని మలుపులు తిరిగినా చివరికి అందరూ నడిచే ఆ నిర్ణీతమైన బాటలోకి చేరుకోవాల్సిందే. లోకంలో ఒకరిగా కలిసిపోవాల్సిందే. సమాజంలోని చుట్టుపక్కలవాళ్ళ జీవితాలూ, బంధువుల సలహాలు, ఆప్తుల హెచ్చరింపులూ, తల్లిదండ్రుల అర్థింపులూ, ఇవన్నీగాక మనకు తెలీకుండానే మన పరిసరాల్లో జీర్ణించుకుపోయిన సాంప్రదాయాలూ, ఆ రకమైన జీవితం మీద ఆకర్షణా- మన ఇష్టాన్ని ముంచుతాయి. వాటిని మనం ఎదిరించలేము. ఈనాడు కొందరు యువతీయువకులు తమ అంతర్యాలకు వ్యతిరేకంగా ఆదర్శం పేరుతో సమాజాన్ని ఎదిరిస్తున్నామనుకుని భ్రమలతో కొత్తజీవితాన్ని ఎన్నుకుంటారు. అయితే సాటివాళ్ల జీవితాలను చూసి ఆ ఆకర్షణలకూ, వ్యామోహాలకూ లొంగిపోతున్నారు. అసంతృప్తిని అనుభవిస్తున్నారు. తమ ఆదర్శాలకు, జీవితసత్యాలకూ, సమన్వయం కుదరక సంఘర్షణకు లోనవుతున్నారు. ఇదంతా ఎందుకు జరుగుతోంది. మనలో నాటుకుపోయిన ఆ బలహీనతను జయించే శక్తిలేదు...''

"... రాజా ఇదుగో ఇందుకే ఈ సంఘర్షణకు లోనుకాకూడదనే, బాగా ఆలోచించి ఈ నిర్ణయానికి వచ్చాను. నా ముందున్న రెండు జీవితపథాల్లో దేనిలో నేను మనగలిగి నిశ్చింతగా చివరకు సాగిపోయి జీవితానికి సార్థకత తెచ్చుకోగలనో.. ఆ పథాన్ని ఎన్నుకున్నాను. నిన్ను నిరాశపరిస్తే నన్ను క్షమించు రాజా.. నేను.. ఇది నాకు ఇష్టమేనని నేను అనుకుంటున్నాను. పెళ్ళికి వస్తావుగా..''

రాజేంద్రకు ప్రభావతి కళ్లు తుడుచుకుంటూ వెళ్లిపోవడం తెలీదు. ఆమె ప్రేమగా అతని చేతిని నొక్కడం కూడా తెలియదతనికి. అతడీ లోకంలో లేడు.

* * *

"పూర్ ప్రభావతి'' నిట్టూర్చాడు రాజేంద్ర. ప్రభావతిని గురించి ఆలోచిస్తూ కాలాన్ని వ్యర్థంచేయకూడదు. తన కర్తవ్యాన్ని మరువకూడదు. ఈరోజు ప్రొఫెసర్‌కు రీడింగ్స్ చేపట్టాల్సి ఉంది.

రాజేంద్ర లెక్కలు చేయడానికి ఉపక్రమించాడు. కాగితాలన్నీ పెన్సిల్ రాతలతో నిండిపోతున్నాయి. గంట తర్వాత చూసుకున్నాడు. రావలసిన ఆన్సర్ రాలేదు. ఎక్కడో తప్పు జరిగింది. మొదట్నుంచీ మళ్ళీ పరిశీలించాడు. తప్పెక్కడ జరిగిందో తెలియలేదు. రెండోసారి, మూడోసారి లాభంలేక పోయింది. తను వాడిన ఫార్ములాయే తప్పేమో.. విసిగేసింది. ప్రభావతి ఉంటే..''

అదిగో, మళ్ళీ ప్రభావతి జ్ఞాపకం... ఇదేమిటి, సామాన్య సంసార స్త్రీగా మారిన ప్రభావతి తననింతగా ఆక్రమించు కుందేమి? ...ఈ ఆకర్షణే నిజమా? తను ఆలోచించకూడదు. ఏదయినా పని కల్పించుకోవాలి.

మెర్క్యురీఆర్క్ స్పెక్ట్రమ్ కోసం స్పెక్ట్రోగ్రాఫ్‌ను ఎడ్జస్ట్ చేయడానికి ప్రయత్నించాడు. ఒక కన్ను మూసి ఐపీస్‌లో రంగుల్ని చూడడానికి ప్రయత్నం చేస్తున్నా, ప్రభావతి స్మృతి నుండి తాను పారిపోవాల్సివస్తోంది. ఎంత అవమానం.. తన వ్యక్తిత్వం ఇంత బలహీనమయిందా?

కనపడవలసిన రంగులేవీ కనిపించడం లేదు. అంతా చీకటి. డ్రమ్‌ను గబగబా త్రిప్పుతున్నాడు. ఆలోచనలు కూడా తిరుగుతున్నాయి. నలుపు.. ప్రభావతి ఆడపిల్లగా.. లేత పసుపు రంగు చీర... ప్రభావతి.. నవ్వుతోంది. తనను వెక్కిరిస్తోంది. తన ఆదర్శాన్ని ఎగతాళి పట్టిస్తోంది.

'భగవాన్!' కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. కర్చీఫ్‌తో తుడుచు కున్నాడు. భయంతో ఊపిరిఆడటం లేదు. తను 'ఓడిపోకూడదు' గింజుకున్నాడు రాజేంద్ర.

తనెందుకు కొరగాకుండా పోతున్నాడు. ప్రభావతి నిస్సహాయం, ప్రభావతి మీద ద్వేషంగా మారింది. కసిగా రూపొందింది. ఈ కసిని, ద్వేషాన్నీ ప్రభావతికే పంపాలి. ఆమెనెలాగయినా చిత్రహింసపెట్టాలి. లెటర్‌ప్యాడ్, పెన్

అందుకున్నాడు.

"ప్రభావతీ"

నీవెందుకింత స్వార్థపరురాల వయినావు. ఈ చదువు, రీసర్చ్ కంటే గొప్పదా నీ సంసార జీవితం. నీ సంస్కారం, విజ్ఞానం, వివేకం ఏమయి నాయి. తుచ్ఛమయిన, అల్పమయిన ఆ సుఖాలకు లొంగిపోవడానికే... ఏం సాధిస్తావ్ బ్రతుకులో... భర్తకు బానిసలా, దాసిగా సేవలు చేసి విడిచిపెట్టకుండా గడ్డిపూలకంటే హీనంగా నశించిపోతావ్.. అదేనా నీకు కావలసింది. వద్దు ప్రభావతీ రాలిపోతావ్, నీవలా కావద్దు ప్రభావతీ.. నీవలా కావద్దు.

ఒక్కసారి ఆలోచించు! గతంలో నీలాగే సైంటిస్టులందరూ స్వార్థాన్ని చూసుకుని ఉంటే, అందరూ అందినంత వరకూ భోగలాలసత్వంలో తేలియాడి ఉంటే, ఈనాడు నీవనుభవిస్తున్న సుఖాలు నీకు దక్కేవా..? ఇలా కార్లలో భర్తతో షికార్లు పోయేదానివా? చెప్పు...?

న్యూటన్ నుండి ఐన్‌స్టీన్ వరకూ మహానుభావులు చేసిన కృషినీ, త్యాగాలనీ గుర్తు తెచ్చుకో...

ప్రభావతీ నువ్వు త్యాగం చేయాలి. ఒక్కసారి ప్రపంచంలోని వైజ్ఞానిక పురోగతిని దర్శించు... ప్లీజ్... త్యాగాన్ని ప్రదర్శించు... నీ జీవితాన్ని చరితార్థం, సార్థకం చేసుకోవటానికి గల అవకాశాన్ని జారవిడుచుకోకు. నీవు కూడా అందరిలాగే తుచ్ఛసుఖాల మీద మోజుతో మూర్ఖురాలివి కావద్దు.

తల్చుకుంటే గుండె ద్రవించుకు పోతోంది. నీవు ఒకప్పుడు నాకు ఒక పెద్ద ఇన్స్పిరేషన్‌వి. ఇప్పుడు నన్ను నా ఎత్త యిన స్థానం నుండి రెండు కాళ్లు పట్టి క్రిందకు దిగజార్చే దుష్టశక్తిలా కనపడుతున్నావు.

నీవు పోయిననాటినుండి నా రీసర్చ్ వర్క్ అంగుళం కూడా ముందుకు జరగలేదు. ప్రొఫెసర్‌తో తిట్లు తిన్నాను. ఓదార్చేవాళ్లే లేరు. నన్ను పట్టించుకునేవాళ్లే లేరు. మాటిమాటికీ దుఃఖం కలుగుతోంది.

ఈ రీసెర్చ్ ఒక ఎండమావిలా, నా బ్రతుకు ఎడారిలా నిస్సారంగా కనిపిస్తోంది. నా మీద నాకే జాలి వేస్తోంది. ఏం చేయను ప్రభావతీ...

నా ఆశలు, ఆశయాలు, కలలు- అన్నీ భగ్నమైపోతాయేమోనన్న భయంగా ఉంది. నీకేం... నీ భర్త కౌగిట్లో, నవ్వుల్లో, సుఖాల్లో హాయిగా నిశ్చింతగా..."

ఏం రాస్తున్నాడు తను ఎంత నీచానికి దిగజారాడు. ఇంకేమీ వ్రాయకూడదు.

రాజేంద్ర వ్రాయలేదు... తిరిగి చదువు కోవడానికికూడా భయపడ్డాడు. తనకే తెలియని తనలోని వికృత స్వరూపం అందులో కనిపిస్తుందేమోనని తనలోని అవ్యక్తమయిన కోరికలు, తుచ్ఛమైన, భయంకరమైన వాంఛలు... ఎక్కడ ప్రతిబింబిస్తాయో నని, అంతులేని భయం... పిరికితనం..

ఆ ఉత్తరాన్ని ఆలాగే అసంపూర్తిగా వదిలేసి సంతకం చేసి కవర్లో పెట్టాడు. పని ఆరోజుకు మానుకుని, పోస్టు చేసే ఉద్దేశ్యంతో బయటపడ్డాడు.

★ ★ ★

రివ్వున దూసుకుపోయే స్కూటర్లపై భర్తల వీపులకు అతుక్కుపోయిన యువతులు...

ఒకరిమీద ఒకరు చేతులు వేసుకుని వాలుతూ, తన్మయత్వంతో నడిచే జంటలు- కేరింతలు కొడుతున్న పసి పాపలను ముద్దాడుతూ, ఆనందంగా నవ్వుకునే తల్లిదండ్రులు, బిగుతయిన దుస్తుల్లో అవయవాల పొంగును అర్ధ నగ్నంగా 'ఫ్రీ'గా ప్రదర్శిస్తూ తెచ్చిపెట్టు కున్న నవ్వుల కిలకిలలతో సాగిపోయే పెళ్లికాని అమ్మాయిల బృందాలు - ఎంత వద్దనుకున్నా ట్యాంక్‌బండ్ మీద నడుస్తున్న రాజేంద్ర దృష్టికి ఆకర్షిస్తూనే ఉన్నారు.

'నిన్నే పెళ్లాడుతా', 'భార్య', 'సుఖసంసారం' అన్నీ ఒకేరకం చిత్రాలు.. ఒకరి కౌగిట్లో ఒకరు కరిగిపోతున్న నాయికా నాయకులు.

ట్యూబ్‌లైట్ల వెలుతురుపడి హుసేన్ సాగర్ నీళ్లు కదులుతూ కరిగిన వెండిలా తళతళా మెరుస్తున్నాయి. చల్లటిగాలి మందంగా వీస్తోంది.

"అందమయిన సాయంత్రం అనే భావం తనకు కలిగినందుకు తనను తానే తిట్టుకున్నాడు. తన మహత్తర ఆదర్శం ముందు ఈ అల్పప్రపంచం అసభ్యంగా వెగటుగా తోచడం లేదూ..." అవును... వెగటు కలుగుతోంది. అసహ్యమేస్తోంది, డోకు వస్తోంది. తనను తాను నమ్మించు కున్నాడు రాజేంద్ర.

కళ్లు మూసుకుని హాస్టల్ రూమ్‌కి చేరుకున్నాడు. యాంత్రికంగా భోజనాది కార్యక్రమాలు ముగించుకుని ఎదురుగా ఉన్న మార్లిన్ మన్రో క్యాలెండర్ గోడవేపుకి తిరిగేసి మంచంమీద వాలాడు. తనకు నిద్రపడుతుందా?

★ ★ ★

తనెక్కడున్నాడు?అబ్బా ఎంత ఎత్తయిన శిఖరంమీద ఉన్నాడు. భూమ్మీద మనుషులు చీమల్లా సూక్ష్మజీవులయి పోయారు. పెద్దపెద్ద ఎత్తయిన భవనాలు బొమ్మరిళ్లల్లా కనపడుతున్నాయి. అదేమిటి? ఎవరో తనముందునుండీ నడిచి ఆ శిఖరం దిగిపోతున్నారు. అమ్మో తను ఒంటరిగా ఉండగలడా? భయం వేస్తోంది, చటుక్కున బలంగా ఆ వ్యక్తిచేయి పట్టుకుని ముఖా న్ని తన వైపుకి త్రిప్పుకున్నాడు. ఎవరో కాదు. తననిక్కడికి తీసుకువచ్చి నిలబెట్టిన వ్యక్తి ప్రభావతి. ఎంతమోసం చేసింది! తనని అమాయకుడిని చేసి, నమ్మించి, ఆ ఎత్తయిన కొండమీద నిరాధారంగా వదిలిపోవాలని చూసింది. తనేమయి పోను? ఏడుపొచ్చింది. పట్టరాని కోపంవచ్చింది. ప్రభావతిని చిత్రహింస చేయాలి. నామరూపాలు లేకుండా పాతిపెట్టాలి. బలమైన ఒక చేత్తో ప్రభావతిని పెనవేసి, మరో చేత్తో జేబులోంచి వాడిబ్లేడు తీసి ఆ అందమైన ముఖాన్ని చెక్కడం ప్రారంభించాడు. నెత్తురు కారుతోంది కెవ్వున కేకలు వేస్తుంది. తను వికృతంగా, రాక్షసునిగా నవ్వుతాడు. కానీ, ..ఇదేమిటి? ప్రభావతికి ఏమీ కావడం లేదు. గర్వంగా, నిర్లక్ష్యంగా నవ్వుతూ చూస్తోంది. తనను రెచ్చ గొడుతోంది. తను ఆ రాక్షసినేమయినా చేయాలి? ఈ కొత్త బ్లేడు పనిచేయడం లేదెందుకు? తను ముంజేతిమీత కసిగా

నాటి కథ

గీసుకున్నాడు. సువ్వున రక్తం చిమ్మింది. "అమ్మో రక్తం!" ఆక్రందించాడు. ప్రభావతి నిర్వికారంగా నవ్వి, తన గాయానికి చీర అంచు చింపి కట్టు కడుతోంది. అయినా తన ద్వేషం చల్లారడం లేదు. ఆవేశం, ఉద్రేకం పొంగిపోతున్నాయి. ప్రభావతి గొంతు పిసికేయాలనుకున్నాడు. అయ్యో...! తన చేతులు లేవడంలేదు. చేతులు, కాళ్లు కట్టెపుల్లలా వేలాడుతున్నాయి. తను దూదిపింజలా తేలికయిపోయాడు. ప్రభావతి తనను కొండ అంచుకు తీసుకుపోతోంది. తనకిష్టం లేదు. ప్రతిఘటించాడు. గింజుకున్నాడు. లాభంలేకపోయింది. అయిపోయింది. తను ఓడిపోయాడు. పతనమైపోతున్నాడు. ఆ అధోలోకానికి ప్రభావతితో పాటు జారిపోతున్నాడు. అంత ఎత్తునుంచి పడితే తనేమయినా మిగులుతాడా? పడ్డాడు. క్రిందపడ్డాడు తాను. కానీ, దెబ్బలు తగల్లేదు. పైగా కాళ్లూ చేతులూ స్వాధీనంలోకి వచ్చాయి. చుట్టూ చూశాడు. ఆశ్చర్యం! తనెన్నడూ ఊహించనంత అందంగా ఉంది ఈ లోకం. పచ్చని మైదానాలు, పూల చెట్లు, గలగలపారే సెలయేళ్లు, ఓహ్! ఎంతో ఉత్సాహంగా ఉంది తనకు. అదేమిటి ఆ శిఖరం మాయమయిందే? ఎక్కడ చూసినా సుఖాల్లో కరుగుతున్న జంటలే కనపడుతున్నారు. తన చేయి ఎవరో పట్టుకున్నారు. ప్రభావతి కాదు. మరి ఈ సౌందర్యవతి ఎవరు? ఎవరయితేనేం? ఒళ్లు అలా మెత్తగా, నున్నగా ఉంది. ఆమెను అతితమకంతో తనకు గుండెలకేసి హత్తుకున్నాడు. ఎంత హాయిగా ఉంది. మత్తుగా ఉంది. నిద్రవస్తోంది.

★ ★ ★

రాజేంద్రకు మెలకువ వచ్చింది. నీరసంగా ఉంది. విషాదంగా ఉంది..ఆ విషాదం సహితం ఆనందకరంగా ఉంది. రాత్రి తను కన్నకల ఆలోచించబోతుంటే, టేబుల్ పైన ఉత్తరం. వార్డుబాయ్ తెచ్చినట్టున్నాడు. అది ప్రభావతి జవాబు. ఆశగా ఆత్రుతగా విప్పి చదివాడు.

"రాజా, నీ ఉత్తరం చదివాను. ఆదర్శపు వేడి, ఆదేశపు పరుగు తప్పితే వాస్తవికత లేదు. అందులో.. మన చుట్టూ ఉన్న సమాజంలోని జీవిత సత్యాన్ని నీవింకా గుర్తించలేదు. అయినా, 'గ్రేట్ థింగ్స్ ఆర్ యాక్సిడెంటల్' అని నీవు చదవలేదూ? ఆదర్శాలు పెట్టుకుని త్యాగాలు చేద్దామనుకున్నంత మాత్రాన గొప్ప కార్యాలు సాధించగలమా!అలా మనం అనుకోనంత మాత్రాన అవి ఆగుతాయా... ఏవి ఎలా జరగాలో విధిగా మన ప్రమేయం లేకుండా అలా జరుగుతూనే ఉన్నాయి. ఇంకా మన చేతుల్లోనే ఉందనుకోవడం అహంకారం, అవివేకం.

రాజా, నీవు మరీ పసివాడివై పోతున్నావ్! ఎందుకు ఏడుపు, నేను ఓదార్చుతాను. వెంటనే రా, నా దగ్గరకు.

నీవు నీ ఆదర్శాల శిఖరాలనుండి దిగజారకూడదు. నీకోసం నిరీక్షిస్తుంటా...

ప్రభావతి...

రాజేంద్ర ముఖం నల్లగా మాడిపోయింది. ఉక్రోషం కలిగింది. ఎన్నో ప్రశ్నలు... ప్రభావతి ముఖానే అడిగేసేయాలి. తనను వేధిస్తున్న సమస్యకు పరిష్కారం అక్కడే దొరకాలి. వెళ్లాలనే నిశ్చయించుకున్నాడు.

★ ★ ★

"... పెళ్లయితే మాత్రం రీసెర్చ్‌వర్క్ ఎందుకు కొనసాగించకూడదు. కనీసం లెక్చరర్ ఉద్యోగంలాంటిదేదయినా చేసి నీ విద్యార్హతలను ఎందుకు సార్థకం చేసుకోరాదు." రాజేంద్ర ప్రభావతిని గౌరవించడం ఎప్పుడో మానుకున్నాడు.

రాజేంద్ర ప్రశ్నకు జవాబివ్వడానికి కొంచెంసేపు తటపటాయించింది ప్రభావతి. "కుదరదు రాజా..నాకు వీలు చిక్కదు."

"ఏం, ఎందుకు వీలుచిక్కదు, అంతగా పనులేమి ఉంటాయి."

చెప్పకతప్పదా అన్నట్లు రాజేంద్ర వైపు చూసి నిట్టూర్చింది. తరువాత తన వంటావార్పు, భర్త సేవ, షికార్లు... దినచర్య అంతా ఏకరువుపెట్టసాగింది.

రాజేంద్ర భరించలేకపోతున్నాడు. ఈర్ష్యాద్వేషాలతో మండిపోతున్నాడు. ఏదో ఉద్రేకంలో ఒళ్లు ఊగిపోతోంది. "నీవు..నీవు.." మాటలు రాలేదు...

ప్రభావతి వాత్సల్యంతో రాజేంద్ర వీపు నిమురుతూ అంది - "నేను బానిసను... ఆత్మాభిమానం, వ్యక్తిత్వం లేని మనిషిని అను, రాజా! ఎన్నయినా అను కానీ, నా కదే ఆనందం... ఏదో ఒక జీవితాన్ని ఎన్నుకున్న తరువాత దాన్ని నిండుగా అనుభవించాలి. మళ్లీ ఏవో అర్థంలేని ఆదర్శాలతో బ్రతుకు త్రిశంకుస్వర్గం చేసుకోలేను. కానీ రాజా, నీవు నాలా కాకూడదు.

"ప్రభావతీ..." అరిచాడు రాజేంద్ర... "నీవు నీచురాలివి. అల్పజీవివి. స్వార్థపరురాలివి. ఏవో మాటలతో నన్ను మభ్యపెట్టకు. నీకు ఈ జీవితం మీద, ఈ భోగాలమీద, తీరని మోజు, వ్యామోహం... నీవు నా పాలిట రాక్షసివి. పచ్చి కాముకవి. నిన్ను.. నిన్ను.. "

రాజేంద్ర పిచ్చి తమకంతో ప్రభావతిని కౌగిలించుకున్నాడు.

రాజేంద్ర కనులు తెరిచాడు. ప్రభావతి కళ్ల నుండి ఏకధారగా కన్నీరు... ఏం చేశాడు తను.. ఏం జరిగింది... ప్రభావతి తనకంటే పెద్దది. వివాహిత...తనకు మాతృమూర్తి...

ప్రభావతి యోగినిలా నిశ్చలంగా నిలబడింది.

పశ్చాత్తాపంతో ఆమె పాదాలమీద వాలిపోయాడు, చెట్టునుండీ రాలే పువ్వులా. "దుర్మార్గుణ్ణి.. శిక్షించు.. క్షమించు" అంటూ బావురుమని ఏడ్చాడు.

ప్రభావతి కదిలింది..."రాజా... లే.. తప్పు నీది కాదు. నేను క్షమించాల్సిన అవసరం కూడా లేదు. నీవు.. నీవు..

★ ★ ★

"...నేను రీసెర్చ్ మానుకున్నట్లే...నా పెళ్ళి నిశ్చయమైంది. ఉద్యోగం కూడా చూసుకున్నాను. నేను ఏవో ఆదర్శశిఖరాల నుండి దిగజారిపోయానని బాధపడటం లేదు. కానీ చివరికి ఒక నిజం తెలిసింది. మన ఆదర్శాల పరిణతికి అనువైన వాతావరణం మన సమాజంలో లేదు. కనీసం వచ్చే ముందుతరం వారికయినా ఆ వాతావరణం కలిగేట్లు ప్రయత్నిద్దాం.."

నెలరోజుల తర్వాత రాజేంద్ర నుండి ప్రభావతికి అందిన ఉత్తరమిది.

# ఉమర్ మధు మధురకవిత



స్వేచ్ఛాకవితానువాదం...
రఘువర్మ, 92900 93933

1

మధుప్రమదా, మేలుకో! వేకువ - రాత్రిగిన్నెలోకి
రాయిని రువ్వింది
అది చుక్కలన్నింటినీ చెదరగొట్టి ఎగరగొట్టింది
అదిగో, తూర్పువేటగాడి వెలుగువుచ్చులో చూడు,
సుల్తాను వైభవ భవన చంద్రశాలాగోపురం
పట్టుబడింది!

2

నింగిని ప్రభాతకాంతి పూర్తిగ పరచుకోకముందే
నేను స్వప్నిస్తూన్నప్పుడు,
మధుశాలలో నుండి ఒక్క మధురస్వరవాక్యం
వినిపించిందప్పుడు,
"జీవిత మధువు దాని పాత్రలో ఇగిరిపోకమునుపే
మేల్కొండి నా బిడ్డల్లారా,
పాత్రలో మధువు నింపుకోండి" అనే తీపిమాటను
ఆలకించానప్పుడు!

3

కోడికూతతోనే మధుశాల ముంగిట ఆత్రంగా
బారులుతీరి నిల్చున్నవారు -
"ఓహో, తలుపు తీయండి మరి" అంటూ
పిలిచారు,
"మీకు తెలుసు, ఇక్కడ మనమెంత తక్కువ
కాలముంటామో,
మరి, ఒకసారి వీదివెళ్ళినవారు తిరిగి ఇంక
రాకపోవచ్చు" అంటూ అరిచారు!

4

"మోజెస్" శ్వేతకరం - తెల్లపూలకొమ్మై మొలిచిన
చోట,
"జీసస్" ధరణీతలిలో నుండి పుష్పావళిగా
దీర్ఘంగా శ్వాసిస్తూన్న చోట,



క్రొత్త సంవత్సరమిప్పుడు పాత కోరికలను
పునరుద్ధరిస్తోంది,
ఆలోచనాసంచయ సంభరితాత్మ ఏకాంతంలో
విశ్రాంతి తీసుకుంటోందచట!

5

"ఇరాం" నగరం - తన గులాబీలతో నిజంగానే
వెళ్ళిపోయింది,
జంషీడు చక్రవర్తి సప్తవలయ పాత్ర ఎక్కడుందో
ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొని ఉంది,
కానీ-ప్రాచీన "రూబీ"కళతో-ద్రాక్షారమణీమణి
తళతళలాడుతుండడం అద్భుతం మరి,
జలాశయాల పవనవీవనలతో ఒక పూదోట-
ఆ చోట ఇంకా వర్ధిల్లుతూ ఉంది!

**ప్రపంచప్రఖ్యాత పర్షియన్ కవి ఉమర్ ఖయ్యామ్ రుబాయీలకు ఎడ్వర్డ్ ఫిట్జెరాల్డ్ ఆంగ్లానువాదాన్ని అనుసరించి చేసిన స్వేచ్ఛాకవితానువాదంలో మొదటి అయిదు!**

# ధనుర్భంగము

గోన బుద్ధారెడ్డి

గోన బుద్ధారెడ్డి పదమూడవ శతాబ్దమునకు చెందిన కవి. ఇతను కాకతీయుల సామంత రాజుగా పనిచేశారు. కందూర్ రాజధానిగా పాలిస్తూ తన తండ్రి పేర రంగనాథ రామాయణము గ్రంథాన్ని రచించాడు. ఇది పూర్తిగా ద్విపద ఛందస్సులో సా.శ. 1294-1300 కాలంలో రచించబడింది. యుద్ధకాండ వరకు ఇతను రచించగా మిగిలిన భాగాన్ని ఇతని కుమారులు పూర్తిచేశారు. ఇతని కుమారుడు గోన గణపతిరెడ్డి తండ్రిపేరిట బుద్ధేశ్వరాలయాన్ని నిర్మించాడు. ఉత్తరకాండ కర్తలయిన కాచ, విఠలనాథులు ఇతని కుమారులేనని కొందరు పరిశోధకులు పేర్కొన్నారు. ఐతే ప్రముఖ సాహిత్య విమర్శకుడు వేటూరి ప్రభాకరశాస్త్రి గోన బుద్ధారెడ్డి పినతండ్రి కుమారుడైన మరో గన్నారెడ్డి కుమారులే ఉత్తర రంగనాథరామాయణ కర్తలని పరిశోధన వెలువరించారు. గోన బుద్ధారెడ్డి రచించిన రామాయణమే తెలుగులో తొలి రామాయణ కావ్యంగా ప్రశస్తి వహించింది.



అదరకు భూదేవి యాత్మలో నీవు,
చెదరి చలింపకు శేషాహి నీవు
కడఁక ధరింపుము కమఠేంద్ర నీవు,
కడునేమరకుఁడు దిక్కరులార మీర
లని యని పల్కఁగ నా మేటివిల్లు,
గొనయ మెక్కించి కైకొనక రాఘవుఁడు
తనబాహుసత్త్వంబు దర్పంబు మెఱసి,
జనకునికనియె నా చాపంబు చూచి
యిది చాలఁ జులకన యిది చాలఁ బ్రాత,
యిది చాల నిస్సార మిది చాల నలఁతి
తెగఁగొన నిలువదు దీని నాయెదుటఁ,
బొగడితి పలుమాఱు భూపాలయనుచు
సురలు ఖేచరులు భూసురులు కిన్నరులు,
నరులును నృపతులు నలిఁ బర్విచూడ
నెడపక తనజయం బెల్లెడఁ జాటు,
వడువున విలు గుణధ్వని చెలంగించి
నీతగుణంబులు చెవిసోఁకెననఁగఁ,
జేతివింటిగుణంబు చెవిసోఁక దిగువ
వడి రక్కసులపట్టు వదలెనన్నట్టు,
పిడిపట్టు వదలినఁ బెకలి పేటెత్తి
పెళ పెళ ధ్వనులును బెటపెటధ్వనులు,
కలయ దిక్కులు అదరగా విల్లు విఱిగె

వ్యాసం

# నివురు గప్పని నిజం...

శ్రీరామ్మూర్తి కవిత్వంలో కురిసే
నిప్పుల్ని విప్పిన వ్యాసం...



కొండపల్లి నీహారిణి
98663 60082

"కవి అవడానికి నిబంధనలేమిటని అడిగితే నేనేమీ నిబంధనల్ని సూచించ లేను. ఎందుకంటే నిజానికి అలాంటి నిబంధనలంటూ లేవు" అన్నాడోచోట మయకోవస్కీ అనే కవి. విభిన్నమైన కవులు, రచయితలు విభిన్నమైన మార్గాలతో సాహిత్యాన్ని సృజిస్తారు. ఒక్కో కవికి ఒక్కో స్వంత పద్ధతి ఉంటుంది. ఒక్కో శైలి ఉంటుంది. ఒక్కో మార్గం ఉంటుంది. జీవితం కన్నా సాహిత్యం గాఢమైందేమీ కాదు. కాని, జీవితాన్ని గురించి గాఢమైన కవిత్వాన్ని రాయవచ్చు. నిజం! నిజం కలం అదే చేసింది!!

ఇది మర్త్యలోకం. ఇందులో సౌమ్యులు, కిరాతులు, మానవతావాదులు, అమానవీయులు, ఆశావహులు, నిరాశావాదులు, మేధావులు, బుద్ధిహీనులు, ముక్తివాదులు, హేతువాదులు, కళాకారులు, కళావిహీనులు, పేదవారు, ధనవంతులు, మంచివాళ్లు, దుర్మార్గులు, సోమరులు, పనిమంతులు అందరూ ఉంటారు. జ్ఞానము, అజ్ఞానమూ, వ్యాపారం, ఉద్యోగం, కష్టం, సుఖం అంతా ఉంటుంది. వర్గాలుంటాయి, ఉపవర్గాలూ ఉంటాయి. జాతులు సరేసరి! ఇవ్వన్నీ జీవమూ, మానవత్వమూ అనే భావాలతో కవి మనోమయ భూమికలో నుండి విస్ఫోటనం చెందినట్లు కవిత్వంలోకి రావాలి. సృజన శక్తి అనే క్షేత్రం నుండి నవాంకురమై



ఉద్భవించాలి. 'నిజం' కలంపేరుతో కవితాశర సంధానం చేసే కవి శ్రీరామ మూర్తి 'నివురు' కవితాసంపుటిలో 141 కవితల అంకురాలు మనసుల్ని తాకి ఆలోచనల్లో పడేస్తాయి.

"ఆకాశంలో సగానివో
అర్ధనారీశ్వరివో
ఆదిశక్తివో
కనక దుర్గవో, కాళివో
నువ్వెవరివైనా
ఎవరేమి పొగిడినా
నువ్వో ఆడదానివి
మగాడు సారించే నారివేగాని
నీకు నువ్వో విల్లువి కావు
ఒకటికి ముందు తరువాత సున్నావే
నీకో అంకె లేదు, సంఖ్య కూడదు.
వాడి రంకెలో నిశ్శబ్దానివి."

ఇంత స్పష్టంగా, ఇంత నిర్మోహ మాటంగా నిక్కచ్చిగా చెప్పడం 'నిజం' కలానికే సాధ్యం! అనాదిగా ఆడవాళ్ళకు కలిగే బాధలు, వివక్షలూ చూస్తున్న కవి మరి నిజం వ్యక్తీకరించరూ!! మాతృ దేవోభవ అంటారు, ఇంటి దేవత అంటారు. భరతమాత అంటారు. సకల బాంధవీ అంటారు. అన్నీ అంటారు కాని, నిజజీవితంలో తన కన్నా ఒక్క అడుగు ముందుకేస్తున్నట్టు అనిపించినా అనరాని మాటలూ అంటారు. "వాడి రంకెలో నిశ్శబ్దం"గా చేసే మగోడు, మగాణ్ణి అనే 'అహం' తొడుగుతో ఉంటే 'ఆమె' 'విల్లు' ఎప్పుడవుతుంది? 'ఒకటి పక్క సున్నా' అనే ఈ కవితలో శ్రీరామమూర్తిగారు, 'స్త్రీ'ని 'సున్నా'గా చెప్తూ ఆలోచనల్లో పడేస్తారు. 'సున్నా' అంటే అంతా శూన్యమే అని తీసేయలేము. అంతర్భావ విస్ఫోటనము అర్థమయితే వంద, వేలు, లక్ష కోట్లకు పడగలెత్తాలంటే ఒకటి పక్కన సున్నా ఉంటేనే విలువ పెరుగుతుందని అర్థమవుతుంది. ఇది సున్నా ప్రత్యేకతను తెల్పుతుంది. పురుషులకు హెచ్చరికనూ చేస్తుంది.

"నిన్ను నువ్వు సిమ్ అనుకుంటావు
నువు లేనిదే సెల్ నిల్ అనుకుంటావు
ఎన్ని సిమ్‌లైనా మార్చుకోగల శక్తి
సెల్కున్నదని తెలిసి

అమాయకురాలివి.”

అంటూ స్త్రీలకూ చురకపెడ్తారు. అతను సెల్, ఆమె సిమ్, మానవత్వమే నిల్. ‘ఆమె’ అమాయకత కన్నా ‘అతని’ అమానుషమైన అహం గురించేనని చెప్పడం, తెలిసిన విషయాలలోని మర్మాన్ని మనముందుంచడమే కవిత్వం. ఇంకా అంటారు -

*“నిండు వ్యక్తిత్వంతో*
*నిలబడదలచుకుంటే*
*లైంగిక కుట్రపన్ని*
*తిరిగి ఇంటింతిని గావిస్తాడు”*

అంటూ ధైర్యంగా నిలబడగలిగే వ్యక్తిత్వం ఉండాలని, వాళ్ళు కుట్రలు పన్నితే నువ్వు కాటికి పోవద్దనే ధ్వనిని ఇస్తారు. ‘ఇంటింతిని’ అనేది ఇందులో కొత్త పదప్రయోగం. ఇంకా,

*“నేలకు వంగినదానివి*
*నిటారుగా నిలబడగలిగితే*
*లోకం నీదే, శోకరాహిత్యమూ నీదే!”*

అంటారు. కవి లోపల ఎంతో ఆవేదన ఉన్నప్పుడే ఇంతటి కవిత్వం వస్తుంది. ఎంతసేపూ, “కార్యేషు దాసి, కరణేషు మంత్రి....” అంటూ స్త్రీ ఎట్లా ఉండాలో, ఎట్లైతే బావుంటుందో చెప్తారే తప్ప పురుషుడు ఇట్లా ఉండాలని చెప్పిన

*“కార్యేషు యోగీ, కరణేషు దక్షః*
*రూపేచ కృష్ణః క్షమయాతు రామః*
*భోజ్యేషు తృప్తః బీ సుఖదుఃఖ మిత్రమ్*
*షట్కర్మయుక్తః ఖలు ధర్మనాథ”*

అనే శ్లోకాన్ని ఎన్నడూ, ఎవ్వరూ, ఏ కవీ, రచయితా ఉటంకించరు. సమాజం లోకి స్త్రీపై వచ్చిన శ్లోకాన్ని చెప్పినట్టు సమాజంలోకి తీసుకుపోలేదు. ప్రతి వక్తా “కార్యేషుదాసి....” అని ఊకదంపుడుగా చెప్పి, చెప్పి కాస్త చదువుకున్న వాళ్ళ బుర్రల్లో కూరేశారేగానీ, “కార్యేషు యోగీ...” అనే ఈ శ్లోకంలో చెప్పినట్టు, రూపకర్మలో యోగ్యత, పనిలో దక్షత, రూపంలో కృష్ణునివలె, ఓపికలో రామునివలె ఉండాలనీ, అనుభవాలలో తృప్తితో ఉండాలనీ, సుఖ దుఃఖాలలో స్నేహితునివలె ఉండాలనీ చెప్పిన ఇంత చక్కని శ్లోకాన్ని ప్రచారంలోకి తెచ్చారా? లేదు! అంతా పురుషాధిక్య ప్రపంచం కదా! ఈ షట్కర్మలు, ఆరు రకాల పనులు సక్రమంగా చేసే పురుషుడే ఉత్తమ పురుషుడు, ధర్మనాథుడు అని ఎవ్వరూ చెప్పరు. అందుకే, రెండో పెళ్లి చేసుకున్న భర్తతో, అత్తమామలతో పోరాడి ఓడి, అగ్గిలో బుగ్గయిన నిప్పులకుప్ప సారిక స్మృతిలో రాశారు కవి. ‘ఆమె’ను శూన్యం చేద్దామా? విలువను పెంచే ‘సున్నా’ (0)ను చేద్దామా? అని విజ్ఞులు ఆలోచించాలి. అజ్ఞానులకు అర్థం చేయించాలి. అప్పుడే ఇటువంటి కవిత్వానికి ఇంకా విలువ పెరుగుతుంది.




శ్రీరామమూర్తిగారి కవితలన్నీ ఇట్లా ఆలోచనాత్మకంగా, చదివించేవిగా, గుర్తుంచుకునేవిగా ఉన్నాయి. ప్రకృతి సహజత్వంపై ప్రేమ, సమాజ వివక్షలపై ద్వేషం వీరి కవిత్వంలో కనిపిస్తుంది. ఈ సంపుటిలోని మొదటి కవిత ‘జాతీయత’లో ఒకచోట అంటారు, ‘మట్టిని కుండ చేయడం అజాతీయత, కుండను మట్టి చేయడమే జాతీయత’, “సవర్ణమే తప్ప అన్యవర్ణం నిషిద్ధం అనడంలో ఎంతో లోతైన ఆలోచన ఉన్నది. గొప్ప వ్యంగ్యం ఉన్నది. కాలునిమనీ కవితలో

*“రూపాయి అద్దంలో రూపుమాసిన*
*ముఖం తరతరాలకు పంచినా*
*తరగని దుఃఖం’ అనడమైనా,*
*తనలో తాను చుట్టు వెదురునాదమై*
*కొండ నుంచి కోనకు*
*నింగి నుంచి నేలకు*
*కబురందిస్తూ*
*కొమ్మరెమ్మలకు తెమ్మెరై*
*ఉమ్మనీటి బిడ్డకు ఊపిరై*
*అంతటా తానై*
*అప్పుడప్పుడూ అడవి చతికిల*
*బడిందెందుకో?....*
*ఇల్లిల్లూ ఓ నర్సింగుహోమై*
*ఉప్పెన పుట్టేదెప్పుడు?”*

కవిత్వమంటే ఇది! విషయం ఉండాలి. ఆలోచింపచేయాలి, సందేశమివ్వాలి. శ్రీరామమూర్తిగారి కవిత్వంలో ఇవన్నీ ఉన్నాయి. Poetry is the rythmic creation of beauty అని పాశ్చాత్య కవులైన జాన్సన్, మిల్, వర్డ్స్ వర్త్, షెల్లీ వంటివాళ్ళు అంటారు. ఏదో ఓ సందర్భంలో ఈ రిథమ్ హృదయంలో పచార్లు చేస్తుండాలి.

శతాబ్దాలు మారుతున్నాయేగాని సామాజిక నేరపు స్వభావాలు ఇంకా మారలేదు. అత్యాధునిక కాలంలో అడుగుపెట్టినా, అంటరానితనమునే వీడటంలేదు కొందరు. ఈ విషయంపై పురాణ అంశాలను ఉదహరిస్తూ చాలానే కవితలను రాశారు. ‘నిజం’గా ‘విపంక్తి’ కవితలో -

*“కాలం సీతాకోక చిలుక*
*అందరినీ తన రెక్కల మీదుంచుకొని*
*ఊరేగినట్టే*
*నన్ను ఒకనాడు ఎత్తుకొని*

వ్యాసం

ఎగురుతుందని ఎదురుచూశాను” అంటారు. కవిత్వమూ, కరుణాత్మక భావమూ మనల్ని బాధితునివైపు అడుగులేయిస్తుంది. సీతాకోక చిలుక అనేక వర్ణాలతో ఉంటుంది. అందరినీ ఎక్కించుకొని ఎగిరినప్పుడు ‘తనను’ ఎక్కించుకోవడం లేదు. కాంప్లెక్స్ ఇమేజెస్ ను, ఫీలింగ్స్ ను కవిత్వం కమ్యూనికేట్ చెయ్యాలి. సమాజంలో వర్ణాశ్రమ ధర్మం సీతాకోక చిలుక అనుకుంటే, అంటరాని తనం అందరితో కలిసి ఎగరనివ్వడం లేదని చెప్పడం. ప్రతీకాత్మక కవిత్వంలో కవి విక్టిమ్ను పరోక్షంగా చూపాలి. శ్రీశ్రీ గారు ముసలమ్మను “ముగ్గుబుట్ట వంటి తల”తో పోల్చడంలా ‘కాంతిలేని గాజుకళ్ళ”తో పోల్చడంలా, సీతాకోక చిలుక అనగానే రంగులు స్ఫురిస్తాయి, రంగు అంటే వర్ణం, వర్ణ వివక్షతో తన రెక్కలమీద ఎక్కించుకోకపోవడం ఇది. ఇంత మార్మికత, ఇంత తాత్వికత ఉండాలి. కవియొక్క పోయెటిక్ డిక్షన్ పాఠకులను ఆకర్షిస్తుంది. శ్రీరామమూర్తిగా ‘విపంక్తి’ శీర్షికతోనే తమదైన ఉద్దేశాన్ని వ్యక్తపరిచారు. కెరటాలు, కోయిలలూ, వెన్నెల, వెలుగు అన్నీ అతణ్ణి దూరం చేసాయి.

“భువన మధుకళంలో
నాకూ ఓ బిందువుంటుందని
ఊహించాను”.

అయ్యో ఇదేంటి అనే ఓ అపరాధ భావాన్ని ఎవరైతే వాళ్ళనలా చూస్తారో, ఆ హృదయాలకు గుచ్చుకునేలా “చివర వరస చివరివాడినీ / కాలేనివాడినై...” అని ముగిస్తారు. ఆనాడు జాషువాగారు ‘నాలుగు పడగల నాగరాజు....’ అంటూ రాశారు. ఇప్పటికీ మారనితనాన్ని స్ఫురింపజేస్తారు. Eradication of Virus ఇదే కదా కావాల్సింది. ఎట్లా? ఎట్లా ఎరాడికేట్ చేస్తారు, ఎట్లా ఈ దుర్నీతి వైరసను సమూలంగా నశింపచేస్తారు? ఈ కుల వివక్ష, ఈ అసమానతలు దేశం మొత్తం వదిలి వెళ్ళిపోవాలని ఆకాంక్షించే కవిత్వం ఇది. ఇదే అంశంపై కవి చాలా కవితలు రాశారు. ప్రజాశ్కామం, మార్నింగ్ వంటి కవితలు ఆలోచనాత్మకంగా ఉన్నవి.

కవితలన్నీ ఉటంకించదగినవే. ప్రతి వాక్యంలో క్లుప్తత, గుప్తతలతో విస్తృత భావాన్ని విప్పుకునేలా గొప్ప కవితా శిల్పంతో అలరారుతున్నవి. రైతుపై జరిగే అన్యాయాల గురించి, సమాజ దాష్టీకాలపైన, ప్రజాస్వామ్య విలువలపైనా అధిక్షేపన కవిత్వంతో గళమెత్తారు.

ఈ ‘నివురు’ సంపుటి పీఠికల్లో “నిష్ఠుర నిజాల నిప్పులీ జనపదాలు’ అని ఎన్. వేణుగోపాల్ రాస్తూ, “కనుకొనుకుల్లో నిలిచిన గుండెతో దిక్కులు పిక్కటిల్లే అక్షర కంఠాన్ని ప్రకటిస్తు ఆ సమున్నత ధిక్కార శిఖరానికి స్వాగతం” అనడమైనా, ‘గడప’అని తల్లావఝుల శివాజీ, “ఈ కవితలేవీ అదో లోకపు తెరల వెనుక మిస్టిక్ లా నిలిచి, పలకరించే బాపతు కావు. దవడవాయించి లెక్కలు తేల్చమన్నట్టే వుంటాయని” అంటూనే, “ఋషుల ఆశ్రమ వాటికలకు లేడి కూనలు వచ్చినట్టు మీ కవిత్వంలోకి పాదాలు, పదాలు బలే వచ్చి చేరటం మహా బావుంది” అనడమూ ఈ కవిత్వ గొప్పతనమే కారణం.

అభ్యుదయ సాహిత్య విమర్శకులు రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు రాస్తూ ‘నిజాలకవి నిజమైనకవి’ అంటూ, ‘నిజాలను గుర్తించడం, వాటిలోని నిజాల్ని వెలికితీయడం, దానికి అనువైన భాషను ఎన్నుకోవడం మూర్తిగారికి కరతలా మలకం. ఆకలి నుండి అమరావతిదాకా గుడిసె నుండి ఢిల్లీ దాకా, కాల్చే ఆకలి నుండి తుపాకి కాల్పులదాకా, కరువు నుండి తుఫాను దాకా ఆయన కవిత్వ వస్తువు విస్తరించింది” అనడమైనా, కాళోజీ అవార్డు గ్రహీత / ప్రముఖ కవి, అమ్మంగి వేణుగోపాల్ గారు, ‘సముద్ర స్పర్శ’ అంటూ, ‘నిజం సాహిత్య రంగ స్థలం మీదకు వచ్చింది పాట ద్వారా. విశాఖ సముద్ర కెరటాల లాగ ఎగిసిపడ్డ విప్లవోద్వేగపు దందహ్య దశాబ్దంలో తమవంతు బాధ్యతను నిర్వహించిన పాటల ఈటెగాళ్లలో నిజం ఒకరు” అనడమైనా ‘నిజం’ కలంపేరేగాదు శ్రీరామమూర్తిగారి అసలు పేరు అని అనిపిస్తుంది.

“అతిలోక మధుర కాసారంలో జలకాంగి
సృష్టించి రచించిన
నీ ఆకుల అక్షరాలు
చదివి తరించిన వారెవరు?”....
“నీ మొదలు నరకాలను
కోవడం ఎంత మూర్ఖత్వం”

అంటూ ‘తేనెచెట్టు’ కవితలో స్త్రీని చెట్టుతో ఉపమిస్తూ రాసిన ఈ కవిత స్త్రీ ధనపు మాధుర్యాన్నో, అమ్మదనపు అవసరాలనో అనుభవించే మనిషే, తిరిగి ఆమెను నరకడానికి ప్రయత్నిస్తున్నాడు అని తీవ్రంగా ఖండిస్తారు కవి. కూచున్న చెట్టు నీడను కాలదన్నడాన్ని చూపుతారు.

‘అవి రాములు’, సిగ్గోటు, సెగపాగా, కాపరికం, దేశభుక్తి, మందిపోటు, బలిపాఠం, చూతూపు, వెన్నెపాటు, సిలువంక, పూలకాన్పు, మెతుకమ్మలు, పాలాభిశోకం వంటి కొత్త పదలాస్యం ఈ పుస్తకం నిండా కనిపిస్తుంది. ఇట్లా కొత్త పద బంధాలలోని నవ్యత ఆకట్టుకుంటుంది.

ఎప్పుడో 70 దశకంలోనే ‘నిజం గీతాలు’, ‘ఎర్రమందారాలు’ కవితా సంపుటులు శ్రీరామమూర్తిగారు ప్రచురించారు. స్త్రీలపైన చులకన భావాన్ని నిరసించడం, రైతుల ఆత్మఘోషను తెలియజేయడం, సమాజ అసమానతలపై, కులవివక్షపై కవితా కరవాలాన్ని విసరడం, ప్రపంచీకరణ తెచ్చే పెను ప్రమాదాన్ని చూపడం, దగాపడే ప్రజాపక్షాన గళాన్నెత్తడం, మూఢ విశ్వాసాలు అంధకారంలో ఎట్లా పడేవేస్తాయో చూపడం వీరి కవిత్వంలో చూస్తాం. ఇవి జన జాగృతి కోసం రాసినవి. (మాన్ హెూల్స్ పడే ‘చెమట సింధువు’ ను గురించి గుర్తు చేయడం.)

“తలలను తలపులను వలదవ్వుల మధ్య పువ్వుల వారధి”, “అశరీర దిగంతాలు ముడేసి- సిగలో తురుముకున్న జవ్వని”వంటి పాదాలైనా, చెన్నై మహానగరం తుఫానులో

వ్యాసం

చిక్కుకున్నప్పుడు "కాసేపు గడిచి ఉంటే, అది మరో మొహెంజోదారో అయ్యేద" నడడంతోనే ఒక గగుర్పాటు కలిగిస్తాయి.

"శోక భీతిలేని
లోకరీతి చేతిలో
రెక్కలు తెంచిన
తూనీగలనూ పట్టించుకొని చెడు అలవాట్లతో,
పర తిరుగుళ్లతో కష్టాలు పడే"
ఆడవాళ్ళనూ తమ కవిత్వంలో పలకరిస్తారు కవి.

"నువ్వొడ్డించిన ఓటు రగలనిపొయ్యి' అంటూ ఎన్నికలప్పుడు ప్రజాస్వామ్యానికి మచ్చతెచ్చే నాయకుల సంగతులూ, ఓటు విలువ కోల్పోతున్న పౌరుల సంగతులూ చెప్తారు.

'అప్పుచావుడప్పు' కవిత, శీర్షికకు బలాన్నిచ్చేలా

"చేను చావును ఈనుతున్నది
మొక్క మృత్యువును కంటున్నది
ఉర్వి ఉరితాళ్ళను ప్రసవిస్తున్నది
పైరుకైజరైంది
పచ్చదనం గిన్నెలో గిరినాగైంది
పుడమి కృషుల బలిపీఠమైంది"
అంటూ రైతు కడగండ్లకు కారణాలు చెప్తారు. ఈ కారణాల వెనుకనున్న కారణాలను పాఠకులు ఆలోచించేలా దాస్తారు. ఈ నేలపై మనిషి ఇంకా బ్రతికి ఉన్నాడంటే అది రైతువల్లనే అనే స్పృహ కలిగేలా రాసారు. అద్భుత భాషా పరిజ్ఞానంతో, వైవిధ్యమైన విషయాలతో వీరి కవిత్వం అలలారుతున్నది. నివురు గప్పిన నిప్పులా నిజం చైతన్యంతో భూమండలమంతా సంచరిస్తూనే ఉంటుంది. శ్రీరామమూర్తి కవిత్వంలో నివురు గప్పని నిజాల్ని తెలుసుకోవాలి. వ్యాస ప్రారంభంలో చెప్పుకున్నట్టు కవిచెప్పే నిజానికి ఎలాంటి నిబంధనలూ ఉండవు. ఇది నిజం. ఇది నిజం నైజం.

కవిత

# రా... ప్రియతమా..!



-పొన్నం రవిచంద్ర, 9440077499

చిరునవ్వుల పరిచయమా
సిరిమల్లెల పరిమళమా
నువ్వంటే నేను
నేనంటే నువ్వనుకున్నా

నువ్వు దూరమయ్యావని
నా దరిన లేవనీ
ఆలోచనని అణిచిపెట్టినా,
జ్ఞాపకం కరిగిపోనంటుంది.
కనుల సరస్సులో..
ప్రేమ ఇంకిపోనంటుంది
రా... ప్రియతమా..!

కాలం కరిగిపోతుంది..
నా కలగా నిను మలచి..!!
నిన్ను నా హృదయం పిలుస్తుంది
రా... ప్రియతమా..!

నీ ప్రేమలో వెలిగిన వెన్నెల్లో
కొన్నాళ్లయినా సంతోషంగా గడిచాయనుకోనా
నా ఎదలో కలిగే వేదనలో
ఎన్నాళ్లయినా ఈ నడి రాతిరి గడవదని అనుకోనా
చెరిగి పోని నీ రూపం నా చూపులనొదిలేలా లేదు
రా... ప్రియతమా..!

నువ్వొదిలిన ఈ ఏకాంతంలో
ఎందరితో కలిసున్నా నేనెప్పటికీ ఒంటరినే
తొలి స్వప్నం ముగియక మునుపే
నిదుర చెదురుతుంది
ఎవ్వరు ఎదురుగ వస్తున్నా నువ్వే అనుకున్నా
రా... ప్రియతమా..!



ఆకాశం వర్షిస్తోంది
నా కళ్లూ వర్షిస్తున్నాయి
నీ కోసం నా మనసు తపించిపోతోంది
హృదయం మీద నీ జ్ఞాపకాల బాణాలు దిగుతున్నాయి
రా... ప్రియతమా..!

కొట్టుకుపోతున్నాను
కరిగిన కలల కన్నీటి అలలలో..!!
వియోగంలో.. నీ జ్ఞాపకాల బంధీనై ..!!
రా... ప్రియతమా..!

ఎందుకిలా నువ్వు నా మీద అలకవహించావు?
వాలిపోయే నీ కనురెప్పలే తప్ప
నాకు మరో ఆవాసం లేదని నీకు తెలియదా
రా... ప్రియతమా..!

# మాల్

శ్రమ దోపిడిని వ్యతిరేకించిన గిరిజనుని ధైర్యం...



నెల్లుట్ల రమాదేవి
94406 22781

నడి నెత్తిన ఎండ సూటిగా పడి సుర్రుమంటుంది. ఎండాకాలం ఇంకా రాకమునుపే సూర్యుడు మండి పోతున్నాడు.

'ఈ వీరూ ఇంక రాకపాయె! ఆకలి గాబట్టె, ఎప్పుడొస్తడో ఏందో!' ఎంతో సేపు ఎదురు చూసిన హేమ్లా నుదిటి మీద చెయ్యి ఉంచుకుని కనపడినంత మేరా రోడ్డు వైపు దృష్టి సారించాడు. ఎక్కడా వీరూ జాడే లేదు.

కాసేపు అటూ ఇటూ తిరిగాడు. ఇంకా సేపు అక్కడ చెట్టు నీడన నిలిపి ఉన్న బండి నొగల మీద కూచున్నాడు. చేసేదేమీ లేక బీడీ ముట్టించాడు. ఒక్క దమ్ము తాగాక కొంచెం నెమ్మదించింది. మళ్ళీ కాసేపటికి ఆకలి అవుతున్న సూచనగా కడుపులో పేగులు గుర్రు మనడం మొదలుపెట్టాయి. ఇంకా వీరూ రాలేదు.

ఎద్దుల డొక్కలు ఎండిపోయినట్టు కనిపించాయి. తెచ్చిన కొంచెం గడ్డి అయిపోయేటట్టుంది. 'తిరిగి పోయే టప్పుడు గడ్డే ఉండదు' అనుకుంటూ లేచి బండి ముందుభాగంలో తొట్టిలో ఉన్న గడ్డి కొంచెం తెచ్చి వాటి ముందు వేశాడు. ఆవురావురుమంటూ తినడం మొదలు పెట్టాయి.

ఎద్దు బండికి నాలుగు వైపులా అడ్డంగా తట్టు సంచులు కట్టి ఉన్నాయి. ఒక్కసారి బండి మీద కప్పిన తట్టు సంచీ ఎత్తి చూసాడు. బండి నిండా ఎరుపు రంగు కందగడ్డ దుంపలు, అక్కడక్కడా మట్టి కమ్ముకుని నవనవలాడుతూ ఉన్నాయి. నిన్నంతా తనూ, పుత్లీ, ఇంకా ముగ్గురు కూలోళ్లు కలిపి పీకి, దుంపలను వేరు చేసి, మట్టి దులిపి శుభ్రం చేసినవి. వాటిని చూసి ఎందుకో ఒకసారి హేమ్లా నుండి గాఢమైన నిట్టూర్పు వెలువడింది.

హేమ్లా ఊరు ఆ జిల్లా కేంద్రానికి నలభై కిలోమీటర్ల దూరంలో ఉన్న తండా. ఆ తండా పేరే కందగడ్డ తండా. చుట్టూ నీలి కొండల మధ్య దాక్కున్నట్టుగా ఉంటుంది. అక్కడి నేల మెట్ట పంటలకు అనుకూలం. నానా కష్టాలూ పడి ఆ భూమిని చదును చేసుకుని తెల్ల జొన్నలూ, కందులూ, ఉల్లిగడ్డలూ, కొంత మేర మొక్కజొన్నలు పండిస్తారు రైతులు. ఇక ఎడకారు పంటగా కొన్ని మళ్ళు కందగడ్డ తప్పనిసరి. అక్కడి నేలలో కందగడ్డ బాగా వస్తుంది గనుక అందరూ కొద్దో గొప్పో పండిస్తారు. హేమ్లాకు రెండెకరాల భూమి ఉంది. బాగా కష్టం చేస్తాడు. పుత్లీ కూడా ఒక్క క్షణం ఊరుకోకుండా ఏదో పని చేస్తూనే ఉంటుంది. తమ పొలంలోనే కాకుండా, పక్క ఊర్లలో పత్తి, మిరప చేన్లల్లో కూలికి వెళ్తుంది కూడా.

శివరాత్రికి చాలా మంది ఉపవాసాలు ఉండి పళ్ళూ, ఉడకబెట్టిన కందగడ్డలూ తింటుంటారు. పండుగ వారం రోజుల ముందునుండే తండా రైతులు కందగడ్డ మొక్కలు పీకి, గడ్డలు తెంపి, మట్టి దులిపి ఎద్దుల బళ్ళల్లో నింపి చుట్టుపక్కల ఊర్లల్లో అమ్ముకుంటారు.

ప్రతి సారీ హేమ్లా, పుత్లీ పది కిలోమీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి బండిలో కందగడ్డ నింపుకుని వెళ్లి సాయంత్రానికి మొత్తం అమ్మి వస్తుండేవారు. అక్కడక్కడా చెట్టు నీడలో బండి ఆపుకుని ఓ గంట సేపు అక్కడే ఉండి, జనం తగ్గాక ఇంకో కూడలికి కదిలేవారు. సంవత్సరాలుగా ఇదే అలవాటు వాళ్లకు. ఆ ఊర్లో ఒక పెద్దింటి వాళ్ళ ఇంటిముందు పెద్ద వేపచెట్టు ఉంది. దాని నీడలో గేటు పక్కగా బండి ఆపుకుని ఎడ్లకు గడ్డి వేసి అవి కాస్త సేదదీరే లోగా వాళ్లిద్దరూ వెంట తెచ్చుకున్న జొన్నరొట్టెలు కారం నంచుకుని తిని కొంచెం కుదుట పడేవారు. ఆ ఇంటావిడ మహా ఇల్లాలు. రానురానూ ఆమె వీళ్లిద్దరికీ కాస్త అన్నం, చారూ, కూరలూ ఇస్తుండేది. ఆమె కొన్న కందగడ్డలకు పైన మరిన్ని గడ్డలు ఊరికే ఇచ్చి వస్తూండేవారు వీళ్ళిద్దరూ.

హేమ్లా అన్న బద్రు రెండేళ్ల కింద చనిపోయాడు. అతడు ఉన్నప్పుడే కొడుకు వీరూ డిగ్రీ చదివి వ్యవసాయం చేయ నంటూ పట్నం వెళ్ళిపోయాడు. వాళ్లకు ఉన్న రెండెకరాల్లో ఎకరం భూమి

కథ

అప్పట్లోనే అమ్మేశారు. మిగిలిన ఎకరం వీరూ మేనమామ చూసుకుంటున్నాడు. హేమ్లా వదిన కూడా వ్యవసాయ కూలికే వెళ్తుంది.

రెణ్ణెల్ల కింద తీజ్ పండుగకు హేమ్లా అన్న కొడుకు వీరూ వచ్చాడు తండాకు. హేమ్లా ఇంటికి వచ్చినపుడు మాటల మధ్యలో 'చెల్కల కందగడ్డ ఏశినవా కాకా!' అనడిగాడు హేమ్లాని.

'ఏశిన ! మంచిగనే ఒస్తాంది. కొత్తగ అడుగుతానవేందిర ?!' అన్నాడు హేమ్లా.

'కిలకు యాపాటి దొరుకుతాంది?!' మళ్ళీ అడిగాడు వీరూ.

'యాపాటి అంటె శివరాత్రి పండుగ ముంగట నలభై, యాభై రూపాలకు కిల అమ్ముతం. ఉత్తప్పుడు ఇగ ముప్పై రూపాలు ఎటు పోవనుకో! జర మన గడ్డ కంటికి మంచిగ గొడ్తది. మల్ల పోంగ తెంపినాంక  నెల దినాల దంక ఖరాబ్ గాదు' చెప్పాడు హేమ్లా.

'కంద గడ్డకు సిటీల మస్తు డిమాండ్ ఉంటది. కిలోకు ఎనభై, వంద పెట్టి కూడా కొంటరు ఎర్కేనా?!' అన్నాడు వీరూ.

'సిటిల కొంటె మనకేం ఒస్తదిర?! గీడ గంత ఎవలు పెట్టరు!' నిరాశగా అన్నాడు హేమ్లా.

'మనమే ఆడికి తీస్కపోతె అయిపాయె! జర ఎక్కువ పైసల్ దొర్కుతయి' సలహా ఇచ్చాడు వీరూ.

'గంత దూరం ఎవలు పోవాలె?! ఏడ ఉండాలె, ఎట్ల అమ్మాలె, మనకేం ఎర్కలే గదర ?!'

'నేను జెప్త తియ్యి. గిప్పుడు నేను గండ్లనే పనిజేస్తాన. నువ్వు కందగడ్డ పెరుగంగనె జెప్పు. నేను మాట్లాడి చెప్త'

'అయ్యొ, నువ్ గంత సదువు జదివి కిరాన దుకునంల పని జేస్తానవార?! ఎంత దొరుకుతది?!'

'ఏ, ఇంజినీర్లకే జాబులు దిక్కు లేవు. నన్నెవడు దేకుతడు కాకా?! ఏదో మా దోస్తుగాన్ని పట్టుకోని ఇండ్ల ఇరికిన! మొదాలు పదివేలు ఇచ్చిన్రు, గిప్పుడు పన్నెండు ఇస్తాన్రు.'

'గంత దూరం గాదుర! రానుపోను తిప్పలు! ఎడ్లు గూడ తకాయిస్తయి'!

'ఏం గాదు, ఊరూరు, ఇల్లిల్లు తిరుక్కుంట ఎంతగనం అమ్ముతవ్?! ఆడనయితే ఒక్కకాడ అమ్మొచ్చు, నువ్వు



**ఆకలికి** ఆగలేక రాతెండి డబ్బాలో పుల్లీ పెట్టిచ్చిన జొన్నరొట్టె తిందామను కున్నాడు.బండి వైపు నడుస్తున్నాడో లేదో రోడ్డుకు అవతలి వైపు నుండి పోలీస్ కానిస్టేబుల్ తన వైపే నడిచి వస్తూ కనిపించాడు. 'ఏయ్ పెద్ద మనిషీ! బండి గీడెందుకు ఆపినవ్? మీదికెల్లి ఎడ్లను కట్టేశి గడ్డి ఏశినావ్?! గీడికి ఎడ్ల బండ్లు రావొద్దు ఎరికేనా? అసలు నిన్ను ఎవడు రానిచ్చిండు?!' అంటూ రంకెలేశాడు.

తిప్పలబడ్డందుకు జర ఎక్వ పైసలన్న ఒస్తయి.'

'సరె తియ్యి, గప్పటి వరకు జూద్దాం!' అన్నాడు హేమ్లా.

వారం రోజుల కింద ఫోన్ చేయిస్తే వీరూ రమ్మన్నాడు. హేమ్లా వెంట తను కూడా వస్తాననుకుంది పుల్లీ. కానీ, వరుసగా వారం రోజులుగా ఎండలో పత్తి చేన్లోకి కూలికి పోవడమో, నిన్నంతా కందగడ్డ తెంపడమో.. రాత్రి జ్వరం వచ్చినట్టుంది, పొద్దునే లేవలేకపోయింది.

'గంత దూరం ఒక్కనివే పోవుడెందుకు?! ఎప్పటిలెక్క గీడనే అమ్ముకుంటె కాదా?! మా అంటె జర పైసలు ఎక్వ ఒస్తయి గని, ఎరుక లేని జాగాయె!' అన్నది.

'నువ్వేం ఫికర్ జెయ్యకు, మన వీరు గాడు ఉన్నడు గద! నాలుగు పైసలు దొరికితెగా సోమయ్య కాడి అప్పు తీరుతది' అన్నాడు హేమ్లా.

తెల్లవారుఝామున నాలుగుగంటలకే లేచిఎడ్లబండి మీద బయలుదేరితే ఇక్కడికి వచ్చేవరకు పది అయింది. తీరా చూస్తే వీరూ ఎంతకూ రాడు.

ఆకలికి ఆగలేక రాతెండి డబ్బాలో పుల్లీ పెట్టిచ్చిన జొన్నరొట్టె తిందామను కున్నాడు.బండి వైపు నడుస్తున్నాడో లేదో రోడ్డుకు అవతలి వైపు నుండి పోలీస్ కానిస్టేబుల్ తన వైపే నడిచి వస్తూ కనిపించాడు.

'ఏయ్ పెద్ద మనిషీ! బండి గీడెందుకు ఆపినవ్? మీదికెల్లి ఎడ్లను కట్టేశి గడ్డి ఏశినావ్?! గీడికి ఎడ్ల బండ్లు రావొద్దు ఎరికేనా? అసలు నిన్ను ఎవడు రానిచ్చిండు?!' అంటూ రంకెలేశాడు.

'అయ్యో, గీడ ఆపొద్దని నాకు తెల్వదు సారూ! చెట్టు నీడ ఉన్నదని ఆపిన. మా ఓడు ఒస్తడని సూస్తాన! వాడు రాంగనే తీస్త తియ్యి!' హేమ్లా సంజాయిషీ ఇచ్చాడు..

'ఏమున్నయ్ బండ్లె?' అంటూనే బండి దగ్గరికి వెళ్లి తొంగిచూసాడు పోలీస్. 'కంద గడ్డలు ఈడ అమ్మొద్దు. మార్కెట్ కు కొట్టాలె. సరె గాని, రెండు కిలోలన్ని గడ్డలియ్యి, సంచి ఉన్నదా నీ కాడ?!' అంటూనే ఏరుకోవడం మొదలు పెట్టాడు.

'ఖుల్లా అమ్మను సారూ ! ఒకటే కాడ కొంటమంటె తెచ్చిన!' అన్నాడు అడ్డుపడుతూ హేమ్లా.

'గట్లనా? నిన్ను ఎవ్వడు అమ్మమన్నడు? ఉట్టిగనే పెట్టు. నీకు కొత్త ఉన్నట్టున్నదే? పోలీసోడు సరుకులు కొంటడా ?' పెద్దగా నవ్వాడు కానిస్టేబుల్.

కళ్ళల్లో నీళ్లు తిరుగుతుండగా ఏమీ మాట్లాడకుండా అతడి వైపు చూసాడు హేమ్లా.

'ఏంది గట్ల చూస్తున్నవ్? ఏడ పడితె ఆడ బండి ఆపినవని చలాన్ రాస్త! వెయ్యి రూపాయలు కట్టి పోవాలె' అన్నాడు వంకరగా నవ్వుతూ పోలీస్. హేమ్లా నుండి జవాబు ఆశించకుండానే జేబులోంచి ఓ ప్లాస్టిక్ సంచి తీసి అందులోంచి దాదాపు రెండు కిలోల కందగడ్డలు ఏసుకుని వెళ్తూ ... 'జల్దీ బండి తియ్యి ఈడికెల్లి! ఈడ ఆపొద్దు, నేను కాబట్టి ఊరుకున్న' అంటూ వెళ్ళిపోయాడు.

హేమ్లా నిరుత్తరుడై చూస్తూ ఉండగానే అప్పుడే అక్కడ వచ్చి ఆగిన బైక్ వెనుక నుండి దిగుతూ వీరూ కనబడ్డాడు.

'ఏంది కాకా! శాన సేపయిందా! మా మేనేజర్ ఒదులలే!' అంటూనే అతడు చూస్తున్న వైపు చూసి.

'ఏమన్న అన్నడా?! వీళ్ళంతే తియ్యి' అన్నాడు.

హేమ్లా తెప్పరిల్లి 'నువ్వు ఎప్పుడొస్తవనే చూస్తాన! దా, ఉల్లిగడ్డ కారం నంచుకోని జొన్న రొట్టె తిందాం! చిన్నమ్మ జేసిచ్చింది' అన్నాడు.

జొన్న రొట్టె కారం అనగానే వీరూ కళ్ళు మెరిసాయి, గానీ అంతలోనే ఏదో గుర్తొచ్చింది. 'ఇప్పుడొద్దులే కాకా, నేను మళ్ల పోవాలె, టైం లేదు. పా.. పా.. పోదాం!' అంటూ తొందరపెట్టాడు.

వీరూని బలవంతపెట్టేవాడేమో గానీ, పక్కన ఇంకొకతడు ఉండడంతో ఆకలవుతున్నా అణచుకున్నాడు హేమ్లా. 'సరె మరి.. బండెక్కు' అన్నాడు.

'నేనా?' చిత్రంగా చూసి 'నేను మా ఫ్రెండ్ బైక్ మీదనే ఒస్త గని, నువ్వు మా ఎనుక రా! అయినా నువ్వు గీ ఎడ్లబండి మీన గాకుండ ఏదన్న ట్రక్‌ల తెచ్చేటిది ఉండె!' అన్నాడు వీరు. అతని మాటల్లోని అయిష్టత హేమ్లా మనసును తాకింది.

'మల్ల దానికో నాలుగు వేలు గావొద్దురా! చారానా దావతుకు బారానా టాంగా కిరాయి లెక్క!' అన్నాడు.

'సరె సరె! రా మరి.. మేం మెల్లగ పోతుంటం!' అంటూ కదిలారు వాళ్ళు.

★ ★ ★

'ఇగ జర సేపయితె ఒస్తడు కాకా! ఓపిక బట్టు!' అంటూ మధ్యలో వచ్చి చెప్పిపోయాడు వీరూ. పెద్ద మాల్ పక్కనున్న సందులో దూరంగా బండి ఆపాడు హేమ్లా. వస్తూంటే మధ్యలో అందరూ వింతగా చూడడమే!

తీరా సరుకు చూసే పర్చేజింగ్ ఆఫీసర్ బయటికి వెళ్ళాడట. అటు నుంచటే లంచ్ చేసి వస్తాడని తెలిసింది. తను తెచ్చుకున్న రొట్టెలు తిని, నీళ్లు తాగాక కాస్త ప్రాణం నెమ్మదించింది. వీరూకి కూడా ఇస్తే లంచ్ టైంలో తింటానని తీసుకున్నాడు.

ఆ తరువాత ఆ మాల్ అంతా చూపించాడు . ఏసీ గనుక చల్లగా, హాయిగా ఉంది. కిరాణా సామాన్లు, కూరగాయలు, తినే వస్తువులన్నీ ఒక ఫ్లోర్‌లో, బట్టలు ఒక ఫ్లోర్‌లో, ప్లాస్టిక్, స్టీల్ ఇతర ఇంటికి కావలసిన వస్తువులు ఒక ఫ్లోర్‌లో ఉన్నాయి. ఐదో తరగతి దాకా చదువుకున్నాడు గనుక కూరగాయల దగ్గర ఆగి మరీ ధరలు చూసాడు హేమ్లా. తమ తండాలో ఒకరికి పండితే ఇంకొకరికి ఊరికే ఇచ్చి పుచ్చుకునే సొరకాయలు, పొట్లకాయల్లాంటి వాటికి కూడా ఇక్కడి రేట్లు చూసి ఆశ్చర్యపోయాడు హేమ్లా.

ఒక పెద్ద లోతైన ట్రేలో కందగడ్డలున్నాయి. వాటి దగ్గర చిలకడ దుంపలు అని రాసి ఉండడం చూసి, 'గివ్వి కందగడ్డలు కావా?' అని వీరూని అడిగాడు. 'కందగడ్డలే కాకా, ఆంధ్రోళ్ళు వీటిని చిలకడ దుంపలంటరు. కొన్ని జాగలల్ల మోరం గడ్డలని, కొన్ని జాగలల్ల రత్నపురి గడ్డలని గూడ అంటరు' చెప్పాడు వీరూ.

వాటి పక్కన 'ఈ రోజు వెల వంద రూపాయలకు కిలో' అన్న బోర్డును పదే పదే చూసాడు హేమ్లా. అంతా చూసాక మళ్ళీ బండి దగ్గరికి వచ్చాడు.

కాసేపటికి వీరూ మేనేజర్ ని తీసుకు వచ్చాడు బండి దగ్గరికి. అతడు యూనిఫామ్‌లోనే ఉన్నా వీరూ కన్నా కాస్త దర్జాగా ఉన్నాడు. 'ఈయనేనా?' అన్నట్టు హేమ్లా కేసి చూసి బండ్లోని కందగడ్డలను పరిశీలించాడు. మొహం మీద సంతృప్తి కదలాడిందేమో, వీరు మొహం విప్పారింది.

'సరే ! రండి, మాట్లాడుదాం' అంటూ

**'ఏంది గట్ల చూస్తున్నవ్? ఏడ పడితె ఆడ బండి ఆపినవని చలాన్ రాస్త! వెయ్యి రూపాయలు కట్టి పోవాలె' అన్నాడు వంకరగా నవ్వుతూ పోలీస్. హేమ్లా నుండి జవాబు ఆశించకుండానే జేబులోంచి ఓ ప్లాస్టిక్ సంచి తీసి అందులోంచి దాదాపు రెండు కిలోల కందగడ్డలు ఏసుకుని వెళ్తూ ... 'జల్దీ బండి తియ్యి ఈడికెల్లి! ఈడ ఆపొద్దు, నేను కాబట్టి ఊరుకున్న' అంటూ వెళ్ళిపోయాడు.**

వెనుదిరిగాడు. అనుసరించారు వీరూ, హేమ్లా.

మాల్‌కు వెనుకవైపు మెట్లున్నాయి. అవిఎక్కి పైకి వెళితే ఓ పెద్ద హాల్ ఉంది. అది గోడౌన్ లా ఉంది. అటు నుండి మాల్‌లోనికి దారి ఉన్నట్టుంది. డోర్ మూసి ఉంది.

హాల్లో ఓ ఇరవై మంది దాకా ఉన్నారు. బియ్యం, పప్పులు శుభ్రం చేసేవాళ్ళు, కూరగాయల్ని ఏరి తుడిచి పెట్టేవాళ్ళు, త్రాసులో తూచి కవర్లలో పోసి ప్యాక్ చేసే వాళ్ళు రకరకాల పనులు చేస్తున్నారు.

ఆ హాల్లోనే ఓ మూలకున్న చిన్న రూమ్‌లోకి నడిచాడు మేనేజర్. ఓ కుర్చీలో కూర్చుని 'ఊఁ, చెప్పు పెద్దాయనా, ఎంతకిస్తావ్?' అన్నాడు.

తను ఏం మాట్లాడినా బావుండదేమో అన్నట్లు వీరూ కేసి చూసాడు హేమ్లా . వీరూ గొంతు సవరించుకుని 'మీరే చెప్పండి సార్!' అన్నాడు.

'ఓ! మీ అంకుల్ అన్నావు గదా, నువ్వు చెప్పు మరి!' అన్నాడు.

'కాదు సార్! మీరే కొంచెం చూసి చెప్పండి' అన్నాడు వీరూ వినయంగా.

'ఒకే, మళ్ళీ మళ్ళీ అడక్కూడదు మరి, ఒకటే మాట... ట్వంటీ ఫైవ్ రూపీస్ పర్ కిలో, సరేనా?!' అన్నాడు మేనేజర్ వరాలిచ్చే దేవుడిలా.

వీరూ గుండె జారింది. తన వైపే చూస్తున్న హేమ్లాకు ఏం చెప్పాలో తెలియలేదు. 'ఇరువై అయిదు రూపాయలకు కిలోనట!' గొణిగాడు మెల్లగా.

హేమ్లాకు తలంతా గిర్రున తిరిగినట్టయింది. 'ఇరువై అయిదు కోసమా తను గింత దూరం ఒచ్చింది?! మేలు రకం గడ్డ తనే యాభై రూపాయలకు అమ్ముతడే! ఆఖరుకు తెంపే పరిగె గడ్డ కూడా ముప్పైకి అమ్ముకుంటడే! గిదేం కత!!'

హేమ్లా ముఖంలో మారుతున్న రంగుల్ని గమనిస్తూ 'నువ్వు తెచ్చిన కందగడ్డ మంచిగానే ఉంది గానీ, మట్టి బాగా అంటుకుని ఉంది. బయట వేరు, మేము అలా అమ్మలేం గదా! ప్రతిదీ చాలా ఫ్రెష్‌గా, ప్యూర్‌గా... ఐ మీన్ శుభ్రంగా ఉండాలి. దాన్ని క్లీన్ చేయించ డానికే చాలా అవుతుంది. బయట చూస్తున్నావుగా! వాళ్లకు కూలీ ఇవ్వాలి. పోనీ, ఓ పని చేద్దాం... నువ్వే శుభ్రం చేసివ్వు, కిలోకి ముప్పై చొప్పున కొంటాం, మట్టి అస్సలు ఉండకూడదు, ఏమంటావ్?!' అన్నాడు మేనేజర్.

హేమ్లా ఏమీ మాట్లాడలేదు. పుల్లీ గుర్తొచ్చింది. 'గంత దూరం పొయ్యి గిదేనా నువ్వు జేసిన గణకార్యం' అన్నట్ట నిపించింది. 'ఆరుగాలం కష్టపడి పండిచ్చి అరిగోస పడి ఈడికి తీసుకొస్తె గీ రేటుకా కొనేది? ఇగ ఏం బర్కత్ ఉన్నట్టు?! ఇప్పుడు మూడు అయితాంది. గీ గడ్డంతా ఎట్ల శుభ్రం చెయ్యొస్తది? ఇంటికి ఎట్ల బోవాలె?'. అయిన గూడ తినేటోడు గడ్డను నీళ్లల్ల ఏస్తె ఎన్నముద్ద ఇచ్చుకున్నట్టు మట్టి ఇచ్చుకపోతది. గా దాని కోసం మనం కడిగి ఇస్తె గడ్డ మురుగుతది. గిప్పుడెట్ల దులుపుతం .. ఎట్ల కడుగుతం... ఎప్పుడు ఆరుతది?!'

'ఇదిగో పెద్దాయనా, ఆఖరుగా చెబు తున్నా, ఇక ఆ కూలీ వాళ్ళతో శుభ్రం చేయించడమో ఏదో మా కష్టం మేం పడతాం గానీ, ఆ ముప్పైకి కిలో చొప్పున ఇచ్చి వెళ్ళు. నీకు లాభమే... సరేనా!' అంటూ విన్పించింది వెనకనుంచి. వెళ్తున్నవాడల్లా ఆగి ఒక్క క్షణం నిలబడ్డాడు హేమ్లా. మళ్ళీ ఏమను కున్నాడో గానీ, వెనుదిరిగి వచ్చాడు. మేనేజర్ ముఖంపై విజయగర్వం కదలాడింది. 'గివ్వి టమాటలో, సిల్వక్క పండ్లో అయితె దిక్కు లేక గట్నే చేద్దును. వంద రూపాయలకు కిల నువ్వమ్మే కాడ కమాస్కం యాభై రూపాయలు నాకిస్తె నీ కాళ్ళ కాడ పోసి పోదును.

ఎన్నో ప్రశ్నలు తలలో తిరుగుతున్నాయి.

'నీ ఇష్టం ఏమైనా చావు' అన్నట్టు ఏవో కాగితాలు చూస్తున్నట్టు ఉండిపోయాడు మేనేజర్. 'ఏమంటవు కాకా!' అనలేక హేమ్లా వైపు చూసాడు వీరూ.

హేమ్లాకు ఇక ఒక్క క్షణం కూడా అక్కడ ఉండబుద్ధి కాలేదు. గిర్రున వెనక్కు తిరిగి నడవసాగాడు. వీరూ అనుసరించాడు.

'ఇదిగో పెద్దాయనా, ఆఖరుగా చెబు తున్నా, ఇక ఆ కూలీ వాళ్ళతో శుభ్రం చేయించడమో ఏదో మా కష్టం మేం పడతాం గానీ, ఆ ముప్పైకి కిలో చొప్పున ఇచ్చి వెళ్ళు. నీకు లాభమే... సరేనా!' అంటూ విన్పించింది వెనకనుంచి.

వెళ్తున్నవాడల్లా ఆగి ఒక్క క్షణం నిలబడ్డాడు హేమ్లా. మళ్ళీ ఏమను కున్నాడో గానీ, వెనుదిరిగి వచ్చాడు. మేనేజర్ ముఖంపై విజయగర్వం కదలాడింది.

'గివ్వి టమాటలో, సిల్వక్క పండ్లో అయితె దిక్కు లేక గట్నే చేద్దును. వంద రూపాయలకు కిల నువ్వమ్మే కాడ కమాస్కం యాభై రూపాయలు నాకిస్తె నీ కాళ్ళ కాడ పోసి పోదును. నలుభై ఇస్తే నమస్తె పెడ్దును.

గప్పుడె పుట్టిన బిడ్డకు పెయ్యంత నెత్తురు ఉన్నట్టు బూతల్లి కడుపున పుట్టిన గడ్డకు మట్టి అంటుకోని ఉంటది. కాయకు, దుంపకు, కంకికి... దేని ఇంతెజామ్ దానికి ఉంటది సారూ! ఇగో, గీ బిస్కెట్ డబ్బల బిస్కెట్లే తింటం గని కాయిదం పారేస్తంగా అర్టి పండు ఉన్నదంటె పండే తింటం. తోలు తినం, గని గవ్వాటిని తీసేసి పైసలు తక్కకు నేను కొంటనంటె నువ్వు అమ్ముతవా?! వొద్దు సారూ! నాల్గు దినాలైనా సరె, రెండూళ్ళు తిరిగి అమ్ముకుంటం. ఇగ పరేశాన్ గాకు! అంటూ బయటికి నడిచాడు హేమ్లా.

వెనక పరిగెత్తాడు వీరూ. 'అరేయ్ వీరూ! నువ్వేం నారాజ్ కాకు. ఈ తాప మనమే ఏదన్న జేద్దాం' అంటూ భుజం తట్టి వెళ్ళిపోయాడు హేమ్లా.

వ్యాసం

# కరోనాపై కోట్ల "గడప దాటని యుద్ధం"

కాలానికి ఎదురొడ్డిన కవి అంతర్యుద్ధం చిత్రించిన వ్యాసం...



సంబరాజు రవి ప్రకాశ్
94913 76255

రెండు రోజుల నుంచి ఆకాశం మేఘావృతమై ఉంది. ఒక్కోసారి మధ్యలో విరామం ఇస్తూ, మరొకసారి ఎడతెరిపి లేకుండా వాన పడుతూనే ఉంది. ఈ రెండు రోజులుగా ఇంట్లో ఉన్న నా హృదయాకాశం 'నానీవృతమై'ఉంది. నిన్న ఆచార్య రఘు నానీలు నన్ను కదిలించి వేస్తే, ఈరోజు కోట్ల వెంకటేశ్వర రెడ్డి "గడప దాటని యుద్ధం" కరోనా నానీలు దుఃఖ వర్షాన్ని కురిపించాయి. కోట్ల నాకు ప్రియమైన కవి. నా పదవ తరగతిలో ఆయన "గుండె కింద తడి" కవితా సంపుటి చదివాను. అప్పటినుంచి ఆయన కవిత్వం వీలైనప్పుడల్లా చదువుతూనే ఉన్నాను. తెలంగాణ వచన కవిత్వానికి కోట్ల 'అధికారిక రాయబారి'. ఆయన జీవితమే కవిత్వం.

అటు వచన కవిత్వంలోనూ ఇటు నానీల రచనలోనూ కోట్లది అందెవేసిన చేయి. వస్తువును పట్టుకోవడంలో ఆయన ప్రతిభ నాన్యతోదర్శనీయం. ఇక పట్టుకున్న వస్తువును కవిత్వీకరించడంలో శక్తి, నిపుణత, లోకానుభవం, కావ్య పఠనం మొదలైనవన్నీ పడుగుపేకల్లా కలిసిపోతాయి. ఒక సుందర వ్యక్తీకరణ కలం నుండి జాలు వారుతుంది. చదువరులను అబ్బురపరుస్తుంది. కోట్ల కలానికి వేగం కూడా ఎక్కువే. పుస్తకాల ముద్రణలో కూడా తన వడిని




ప్రదర్శిస్తుంటాడు. ఇక్కడ వేగాన్ని ఎందుకు ప్రస్తావించాలంటే కోట్ల ఈ గడప దాటని యుద్ధం నానీలను ఒక రోజులో ఉషోదయం నుండి సంధ్యా సమయం లోపల రాశాడని జలజం సత్యనారాయణ తన ముందుమాటలో పేర్కొన్నాడు. ఇంత వేగంగా రాసిన కవిత్వంలో కవిత్వం పాలెంత ఉంటుంది? అన్న ప్రశ్న మీలో ఉదయించవచ్చు. ఇందులోని ప్రతి నానీ దేనికదే ఒక రస విరాట్ స్వరూపం. ప్రతి నానీలో విలక్షణమైన ఎత్తుగడ. అంతే విలక్షణమైన ముగింపు. లక్ష్మణ చక్రవర్తి వంటి విమర్శకులు కోరుకునే వ్యక్తీకరణలోని కళాత్మకమైన గుణం ఈ నానీల నిండా కనిపిస్తుంది. కోట్లకు తన కవితను ఎలా ప్రారంభించాలో తెలుసు.. ఎక్కడ ముగించాలో తెలుసు... తాను ఎన్నుకున్న వస్తువుకు అనుగుణమైన పోలికలను, దృశ్యాలను, ప్రతీకలను భావ చిత్రాలను, అభివ్యక్తిని, వాటికి అనుగుణమైన భాషను ఎన్నుకోవడంలో కోట్ల ముందుంటాడు.

ఇక గడప దాటని యుద్ధం పుస్తకం లోని కొన్ని కరోనా నానీలను చూద్దాం.

"కరోనా
ఓ డర్టీ ఫెలో
పరిశుభ్రతను చూస్తే
పడి 'చస్తది'!"

నానీల నిర్మాణాన్ని విశ్లేషించి చూస్తే నాలుగు పాదాలు నానీలోని మొదటి రెండు పాదాలు ఒక భావాన్ని చెబితే, మరో రెండు పాదాలు మరొక భావాన్ని గుమ్మరిస్తాయి. చివరి రెండు పాదాలు మొదటి రెండు పాదాలను సమర్థించ వచ్చు. లేదా వ్యాఖ్యానించవచ్చు. లేదా ఒక చమత్కారాన్ని వ్యంగ్యం ద్వారా సాధించ వచ్చు. ఒక నానీ 20 నుండి 25

వ్యాసం

అక్షరాలకు మించకుండా ఉంటుంది. పాదంలోని అక్షరాలకు సంఖ్య నియతి లేదు. స్వేచ్ఛ కవీంద్రునిదే. పైన ఉదహరించిన నానీలో చివరి రెండు పదాలలో ఒక వ్యాఖ్యానమూ ఉంది. ఒక వ్యంగమూ ఉంది. కరోనా అపరిశుభ్రతకు సంకేతం. పరిశుభ్రత దానికి గిట్టదు. పరిశుభ్రత ఉన్నచోట అది ఉండదు. దానినే కోట్ల వ్యంగ్యంగా పడి 'చస్తది'అన్న ప్రయోగం ద్వారా చెప్పాడు. మామూలుగా భాషలో 'పడి చస్తది' అంటే బాగా ఇష్టమని అర్థం. కానీ ఈ నానీలో ఆ పదాన్ని వ్యతిరేకార్థంలో ప్రయోగించడాన్ని మనం చూడవచ్చు. తెలుగు భాషలోని చమత్కారానికి ఇది ఒక ఉదాహరణ. పరిశుభ్రత, అపరిశుభ్రత అనే రెండు వ్యతిరేకాంశాలను తీసుకొని శబ్ద చమత్కారం సహాయంతో ఈ నానీకి కోట్ల జీవం పోశాడు.

*"ఇంత విపత్తులో*
*దేవుళ్ళెక్కడ?*
*స్టెతస్కోపుల్లో*
*గాంధీ హాస్పిటల్లో!"*

పై నానీలో మొదటి రెండు పాదాలు ఒక ప్రశ్నను వేస్తున్నాయి. చివరి రెండు పాదాలు పాఠకుడు ఊహించని జవాబు ఇస్తున్నాయి. దీనినే మనం నానీలలోని మెరుపుగా భావించవచ్చు. ఈ మెరుపు వల్లనే ఒక కవితానుభూతికి లోనవుతాం. ప్రత్యక్షంగా విశేష సేవలు అందించిన డాక్టర్లను దేవుళ్ళుగా అభివర్ణించడం అందరికీ ఆమోదనీయమైన సత్యం. ప్రజలు మాట్లాడుకునే అంశాన్ని పట్టుకొని దానిని కవితావస్తువుగా చేయడం 'కోట్ల' ప్రతిభ.

*"రోడ్లన్నీ*
*బావురుమంటున్నాయి*
*కందిపోయే*
*వలస పాదాలను చూసి!"*

కరోనా సమయంలో వలస కార్మికుల అగచాట్లు ఒక దుఃఖ భరితమైన అధ్యాయం. వందల కిలోమీటర్లను కాలినడకన అధిగమించిన తీరు అశ్రు సముద్రాన్ని పొంగి పొరలేలా చేసింది.

**కర్ణుడు అనేక శస్త్రాస్త్రాలలో నేర్పరి. అయినప్పటికీ యుద్ధ సమయంలో ఆయనకవేవి గుర్తుకు రాలేదు. అది ఆయనకున్న శాపం. కరోనాపై వైద్యులు అనేక రకాల ఔషధాలను ఉపయో గించారు. తొలి దశలో అవన్నీ నిరర్థకంగా మారి పోయాయి. దీన్నే కవి పై నానీలో సూచిస్తున్నాడు. ప్రపంచాన్ని శాపగ్రస్త కర్మభూమిగా పేర్కొనడం కోట్ల భావ శబలతను తెలియజేస్తున్నది.**

బాలింతలు, గర్భవతులు, వికలాంగులు, వృద్ధులు, సకలాంగులు ఎవరైతే నేమి? అందరూ ఆ కష్టం బారిన పడిన వారే. "భగవాన్! పగవానికి కూడా రాకూడదు ఈ కష్టం" అని ప్రతి ఒక్కరూ ప్రార్థించిన వాళ్ళమే. ఇక నిలువెల్లా కవిత్వమై సంచరించే కోట్ల దానిని చూసి స్పందించకుండా ఉంటాడా?

*"నేను*
*గణం తప్పని పద్యాన్ని*
*ఇవ్వాళ*
*గడప దాటని యుద్ధాన్ని!"*

పద్యం గణం తప్పితే ఛందోభంగమవుతుంది. మనిషి గడప దాటితే బతుకు భంగమవుతుంది. కరోనా సమయంలో ఎవరైనా గడప దాటని యుద్ధం చేయాల్సిందే. లేకుంటే వాడు గణం తప్పిన పద్యమవుతాడు. పై నానీలో మొదటి రెండు పాదాలు చివరి రెండు పదాలకు ప్రతిబలకంగా ఉన్నాయి. 'గడప దాటితే గణం చెదురుతుంది' అన్న హెచ్చరిక ఈ నానీలో కనపడుతుంది.

*"కాలం*
*కలిసి రానప్పుడు*
*తగ్గాలి*
*ఖైరతాబాద్ గణేశ్ ఆదర్శం!"*

పై నానీలో మొదటి మూడు పాదాలు ఒక అంశంగా, నాలుగో పాదం ఒక అంశంగా ఉండడాన్ని మనం గమనించవచ్చు. రూప నిర్మాణంలో నానీకున్న వెసలుబాటు ఇది. దీని నిర్మాణ సూత్రాలు ఒక చట్రంలో బిగించి లేవు. కవి తాను చెప్పదలుచుకున్న అంశానికి అనుగుణంగా నాలుగు పాదాలను ఎలాగైనా వాడుకోవచ్చు. కరోనా సమయంలో ఖైరతాబాద్ గణేశుని ఎత్తు 66 అడుగుల నుంచి ఒక అడుగుకు తగ్గిపోయింది. పట్టువిడుపులు ఉంటేనే కదా జీవితం. కరోనా మనకు కలిసిరాని కాలం. ఆ సమయంలో ఇంట్లో ముడుచుకుని ఉంటేనే మనుగడ సాధ్యం. కొంచెం ఎక్కువ ఏమైనా చేస్తే మరణ మృదంగం మోగుతుంది. ఇదే ఈ నానీ అంతరార్థం.'పంజరాల్ని దాటుకుని, బంధనాలు తెంచుకొని దేనికోసమో, ఎవరికోసమో బయటకు వెళ్ళే కాలం కాదు' కరోనాకాలం.

"చెప్పిన దానికన్నా చెప్పనిదే ఎక్కువ ధ్వనిస్తే అది సాంద్రమైన నానీ"అని నానీల సృష్టికర్త ఆచార్య గోపి అంటారు. దానికి బలమైన సాక్ష్యం మనం ఇంతకుముందు చెప్పుకున్న నానీ.

కోట్ల నానీలలో భారత, భాగవతాలలోని పాత్రలు మనకు కనబడతాయి. ఏ పాత్రలను ఏ భావంలో ప్రవేశపెట్టాలో ఆయనకు బాగా ఎరుక. సందర్భానికి తగినట్లుగా, ప్రకటించే భావానికి అనుగుణంగా ఇతిహాస పాత్రలను తన నానీలలో కోట్ల ప్రవేశపెట్టాడు. ఇలా చేయడం వల్ల నానీకి కొత్త కాంతి వచ్చినట్లయింది.

*"కరోనా*
*అంతటా ఉంది*
*చూపించే ప్రహ్లాదుడే*
*ఇంకా పుట్టలే!"*

"ఇందు గలడు... అందు లేడని సందేహము వలదు.. చక్రి సర్వోపగతుండు... ఎందెందు వెతికిన అందందే గలడు..." అంటూ తన తండ్రికి స్తంభంలో నరసింహ స్వామిని చూపించిన ప్రహ్లాదుని పాత్రను కరోనాతో అనుసంధానించడం కవి భావనా శక్తికి నిదర్శనం. కంటికి కనబడని కరోనా

రూపంపై ప్రపంచ వ్యాప్తంగా అంతులేని పరిశోధనలు జరిగాయి. అది ఎలా వ్యాపిస్తుందో, దాని రూపం ఏమిటో తెలియక విశ్వమంతా గగ్గోలు చెందింది. వైద్యరంగ శాస్త్రవేత్తలకు కరోనా ఒక సవాల్ విసిరింది. కోట్ల ఈ నానీ రాసే నాటికి వైద్యశాస్త్రం ఆ రోగాన్ని ఛేదించలేదు. భారతంలోని పాత్రతో రాసిన కింది నానీని చూడండి.

"ఇది శాపగ్రస్త
కర్ణభూమి
యుద్ధ సమయంలో
ఏ అస్త్రం పనికిరాదు"

కర్ణుడు అనేక శస్త్రాస్త్రాలలో నేర్పరి. అయినప్పటికీ యుద్ధ సమయంలో ఆయనకవేవి గుర్తుకు రాలేదు. అది ఆయనకున్న శాపం. కరోనాపై వైద్యులు అనేక రకాల ఔషధాలను ఉపయోగించారు. తొలి దశలో అవన్నీ నిరర్థకంగా మారిపోయాయి. దీన్నే కవి పై నానీలో సూచిస్తున్నాడు. ప్రపంచాన్ని శాపగ్రస్త కర్మభూమిగా పేర్కొనడం కోట్ల భావ శబలతను తెలియజేస్తున్నది.

"మనిషిని చూసి
మనిషి భయపడటం
ఇప్పటి
అవ్యక్త విషాదం!"

నిజంగా ఎంత అల్లాడిపోయాం. బయటి మనుషుల సంగతి అటు ఉంచితే ఇంట్లోనే కుటుంబ సభ్యులు ఎవరైనా దగ్గినా, తుమ్మినా వారిని అనుమానపు చూపులు చూడాల్సి వచ్చింది. అత్యవసరంగా వారిని వేరు గదులలో ఉంచాల్సి వచ్చింది. ఒకే కుటుంబంలో అడ్డుగోడలు కట్టుకోవాల్సి వచ్చింది. అత్యవసర పనిమీద బయటకు వెళితే కళ్ళు ఎమ్మార్రై స్కానర్లలా మారిపోయాయి. ప్రతి ఒక్కరిని నఖశిఖపర్యంతం పరీక్షించిన వాళ్ళమే. కరోనా సమయపు మానవ స్వభావాన్ని చక్కగా వివరించిన నానీ ఇది. సాటి మనుషులను అనుమానంగా చూడవలసి రావడం, మనిషికి మనిషే భయపడడం అవ్యక్త విషాదమే కదా! అంతకన్నా మరో దురదృష్టం ఉంటుందని అనుకోను.

"కాల గమనాన్ని అర్థం చేసుకొని నిత్య నూతనంగా రచనలు చేసేవాడే ఉత్తమ కవి"అని ఆచార్య గోపి ఒకచోట అంటాడు. ప్రపంచ మానవ చరిత్రలో కరోనా అంత ఆధునిక విషాదం మరొకటి లేదు. కనపడని శత్రువుతో చేసిన యుద్ధంలో ఒరిగిన నరకంఠాలెన్నో కదా!. ఇంతటి బీభత్సకర దృశ్యాన్ని కోట్ల వంటి కవి కవిత్వీకరించకుండా ఎలా ఉండగలడు?. ఆ ఉండలేని తనమే 'గడప దాటని యుద్ధం' నానీలు.

"ఈ ఎండా కాలానికి
ఏ మందుల్లేవు
మల్లెపూల కుర్రాడు
ఏమయ్యాడో!"

పై నానీలో కరోనాను ఎండాకాలంతో కవి పోల్చాడు. గ్రీష్మ తాపంతో జనం ఎంత అల్లాడుతారో అంతకు లక్షల రెట్ల ప్రతాపంతో కరోనా భీకరమైన వాతావరణాన్ని సృష్టించింది. కొన్ని ప్రాంతాలకు ప్రాంతాలు మరు భూములుగా మారిపోయాయి. స్మశానాలలో చోటు దొరకలేదు. శవ దహనాలకు రోజులకు రోజులు వేచి చూడాల్సిన పరిస్థితి. కరోనా ఒక ఎండాకాలమా? కోట్ల గ్రీష్మాలు ఒక్కసారిగా నేలరాలిన పరిస్థితి, దుస్థితి.

> **నిజంగా ఎంత అల్లాడి పోయాం. బయటి మనుషుల సంగతి అటు ఉంచితే ఇంట్లోనే కుటుంబ సభ్యులు ఎవరైనా దగ్గినా, తుమ్మినా వారిని అనుమానపు చూపులు చూడాల్సి వచ్చింది. అత్యవసరంగా వారిని వేరు గదులలో ఉంచాల్సి వచ్చింది. ఒకే కుటుంబంలో అడ్డుగోడలు కట్టుకోవాల్సి వచ్చింది. అత్యవసర పనిమీద బయటకు వెళితే కళ్ళు ఎమ్మార్రై స్కానర్లలా మారిపోయాయి.**

అలాంటి ప్రళయ బీభత్సవేళ కవి మల్లెపూల కుర్రాడిని గుర్తు చేసుకుంటున్నాడు. వేసవి తాపానికి మల్లెపూల పరిమళం ఒక మందు. ఈ నానీ లో మానవత్వం గుభాళించింది.

"పరక చేపలకు గాలాలేసే
తురకల పోరలు ఏమైపోయిరి?
లారీలల్లో క్లీనర్లైరా...
పెట్రోల్ మురికిల మురికయ్యిండ్రా.."

అంటూ గోరేటి వెంకన్న తన పాటలో తురకల పోరలను గుర్తుకు తెచ్చుకున్న విషయం గుర్తుకు వచ్చింది. కనపడకుండా పోయిన సాటి మనిషిని గుర్తుకు తెచ్చుకోవడం కంటే మానవత్వం మంచితనం ఇంకేముంది?

వందకు పైగా ఉన్న ఈ నానీలలో వస్తువు విషయంలో ఏక సూత్రత ఉంది. అవన్నీ కరోనా చుట్టే తిరిగాయి. ఒకే అంశంపై శతాధిక సంఖ్యలో నానీలు రాయడం కత్తి మీద సామే. కానీ ఆ పనిని కోట్ల అలవోకగా చేశాడనిపిస్తోంది. ఈ పనికి ఆయన సుదీర్ఘ కవితా ప్రస్థానం సహకరించింది. అధ్యయనం మరింత ఉపకరించింది. పరిశీలన రచనాశక్తిని పరాకాష్టకు చేర్చింది. వ్యక్తీకరణ కొత్త అడుగులు వేసింది. ఏ నానీని పరికించి చూసిన అస్పష్టత అన్న మాటే లేదు. కరోనా మహమ్మారి వికృత స్వరూప స్వభావాలను, దానివలన ప్రపంచం పడిన ఇబ్బందులను, మారిన మనుషుల జీవన విధానాలను, బలవంతంగా పోగొట్టుకోవాల్సి వచ్చిన కొన్ని అలవాట్లను, అండగా నిలబడిన ఆపద్బాంధవులను, ఒక్కసారిగా తలకిందులైన పరిస్థితులను అన్నింటిని "గడప దాటని యుద్ధం"లో కోట్ల గడప దాటకుండా ప్రస్తావించాడు. సమకాలీన స్ఫూర్తి ఈ నానీల ప్రత్యేకత.

"ఎవరి పద్యానికి
కరోనా బలయితుందో
వారేపో
ఈనాటి మహాకవి!"

ఈ పుస్తకం వచ్చేనాటికి కరోనా అంతరించిందనే చెప్పవచ్చు. అందుకే ఈనాటి మహాకవి నిస్పందేహంగా కోట్లే.



కవిత

# ఎగ'తాళి' సంసారాలు



డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037

ఉన్నత చదువులు, కొలువులు
కాస్మోపాలిటన్ కలర్‌ఫుల్ కల్చర్లు
అరచేతిలో స్మార్ట్‌ఫోన్ వైకుంఠాలు
టెక్నాలజీ మాయలో మరమనుషులు
బిజీ బిజీ కృత్రిమత్వపు బతుకులు
సంపాదనే సర్వస్వమనే భావనలు
ఆర్థిక స్వతంత్ర అహంభావాలు
మానవీయ అనుబంధాలకే తూట్లు
సింగిల్ పేరెంట్ నవ్య సంస్కృతులు
న్యూక్లియర్ ఫామిలీల పరిమితులు!

సామాజిక మాధ్యమాల్లో సంసారాలు
సహజీవన కార్పొరేట్ కాపురాలు
తాళిని ఎగతాళి చేసే విపరీతాలు
భార్యాభర్తలే దూరపు బంధువులు
ప్రేమానురాగాలకే పట్టిన బూజులు!

ఫేస్‌టైమ్‌లో పెళ్లి చూపుల తంతు..
వాట్సాప్‌లో పత్రికల పంపకాలతో..
అట్టహాస వైభవ వివాహ వేడుకలతో..
ఆన్‌లైన్లోనే దర్శించి అక్షింతల దీవెనలతో..
ఇద్దరు మనుషులు ఒక్కటైన ఘడియలు!

పసుపు పారాణి ఆరనే లేదు
మామిడి తోరణాలు ఎండనే లేదు
పుస్తెలు, మెట్టెల్ని పెట్టెలో పెట్టి..
పండుగలు, పర్వదినాల్లో వాడేటోళ్లు..
ప్రేమానురాగాల్ని పెడచెవిన పెట్టి..
అహాన్ని, స్పర్ధల్ని పోగు చేసుకొని..
అహంకారాల్ని పెంచి పోషిస్తూ..
ఏడడుగుల్ని ఎగ'తాళి' చేస్తూ..
మూడుముళ్లను పరిహాసం చేస్తూ..
ఏడడుగుల కోర్టు మెట్లెక్కి..
వివాహాల్ని విడాకులతో తుంచి..
అన్యోన్య అనుబంధాలకే బీటలు
మూన్నాళ్ల ముచ్చటైన పవిత్ర బంధాలు
పటాపంచలు అనురాగాల ఆస్తులు
యువత నవ్య కార్పొరేట్ కాపురాలు!

కథ

# నా భాషకేమైతది!

తెలుగుకు కూడా మంచి రోజులు
వస్తాయని ఆశాభావం వ్యక్తం చేసే కథ..



కుంతి
87909 20745

బడి గంట గణగణ మ్రోగింది. పిల్లలు బిలబిల మంటూ స్కూల్ బయటికి పరుగెత్తుకు వచ్చారు. ఉపాధ్యాయులు కూడా తమ తమ వాహనాలను తీసుకొని ఇంటి ముఖంపట్టారు.తెలుగు మాస్టార్ రామారావు నెమ్మదిగా తన సంచి భుజానికి తగిలించుకొని, తన పాత కాలపు స్కూటర్ ను స్టార్ట్ చేసి ఇంటి ముఖం పట్టాడు. ఇతర ఉపాధ్యాయులు రామారావు వైపు ఉదాసీనతతో కూడిన చిరునవ్వుతో ఒక నమస్కారం పారేసి వాళ్ళు బయలుదేరారు.

నిజానికి బడి మధ్యాహ్నం మూడు గంటలవరకే. కానీ ఆ రోజు పాఠశాలలో ఇన్స్పెక్షన్ జరిగింది. విద్యాధికారులు వచ్చి బడినీ, బడిలో విద్యార్థులను,విద్యాభ్యాస కార్యక్రమాలను, ఉపాధ్యాయుల పనితీరును నిశితంగా పరిశీలించారు. వారు అన్ని తరగతులు చూసినప్పటికీ, తెలుగు తరగతికి రాలేదు.

తెలుగు మాస్టార్‌ను పక్కకు పిలిచి, "విద్యార్థులు మీ తెలుగులో వందకు వంద మార్కులు తెచ్చుకోవాలి. ఫలితాలు అద్భుతంగా ఉండాలి. తెలుగు మాతృ భాష కావున అది పెద్ద కష్టం కాదు. ఎవరికైనా తక్కువ మార్కులు వస్తే దానికి మీరే బాధ్యులు" అంటూ హెచ్చరికతో కూడిన సలహా ఇచ్చి పంపించారు.

"సార్! గత సంవత్సరం పదవతరగతి పరీక్షలలో, తెలుగు సబ్జెక్ట్‌లో, రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది నా విద్యార్థియే" అన్నాడు వినయంగా.

"ఆ తెలుగులో స్టేట్ హయ్యస్ట్ మార్క్ దేముందండి? కాస్త తెలివైన విద్యార్థులు ఎవరైనా తెచ్చుకోగలరు" అన్నాడు ఒక అధికారి.

రామారావు "తాను ఇంతకాలం ఎలా విద్యార్థులకు చదువు చెబుతున్నదీ, విద్యార్థులు ఎలా ప్రగతి సాధిస్తున్నదీ, అధికారులు మాతృభాషాభివృద్ధికై ఎలాంటి ప్రయత్నాలు చేయాలి"వంటి విషయాలు వివరించబోయాడు. వారు పట్టించుకోలేదు.

ఇన్స్పెక్షన్ అయిన తరువాత అధికారులు సమావేశం నిర్వహించారు. విద్యార్థుల విద్యా విషయక ప్రగతిని గురించి చర్చించారు. వారు తెలుగు విషయం ఎత్తలేదు. మళ్ళీ రామారావు ఏదో చెప్పబోయాడు.

"అబ్బే! తెలుగుదేముందండి. పిల్లలు ఎలాగైనా చదువుకోగలరు. పాస్ అవ్వగలరు"అంటూ అతడిని మాట్లాడ నివ్వలేదు.

ఇలా ఆ రోజు జరిగిన ఇన్ స్పెక్షన్ తాలూకు ఆలోచనలతో, రామారావు ఇంటికి వెళ్ళుతుండగా యేదో చప్పుడు అయింది. అది స్కూటర్ టైర్ తాలూకు పంక్చర్ శబ్దం అని గ్రహించడంతో దగ్గరలో నున్న మెకానిక్ షెడ్‌కు వెళ్ళాడు.

"బాగున్నావా యాదగిరి! బాబు బాగా చదువుకుంటున్నాడా?" అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ, "ఇదిగో మళ్ళీ నా స్కూటర్ టైర్ పంక్చర్ అయింది.కాస్త చూడు" అంటూ మెకానిక్ యాదగిరిని పలుకరించాడు.

ఇంతలో యాదగిరి కొడుకు అక్కడికి వచ్చి, తండ్రి దగ్గర పదిరూపాయలు తీసుకొని వెళ్ళాడు.

"ఇంతకీ నీ పిల్లవాడు ఎలా చదువుతున్నాడో చెప్పలేదు?" అన్నాడు రామారావు.

"ఏమి చెప్పాలి సార్! నా పిలగాణ్ణి ప్రైవేట్ బళ్ల జేర్పించిన, వేలకు వేలు పీజులు గడుతున్న. వాడు మాత్రం బాగ చదువుత లేడు. అవారాగాని లెక్క అయిండు. పోయిన తాప ఫేలయిండు. గా బడిల అంత ఇంగ్లీసులనే చెప్పుతరట, ఈడి కేమో సమజయితలేదట"

"పోనీ మా బడిల చేర్పించరాదు. ఫీజులు ఉండవు. తెలుగు మీడియం కూడా. కాబట్టి భాషా సమస్య ఉండదు" అన్నాడు.

"మీ బళ్ల చదివితే ఏమొస్తది సార్! అంత తెలుగుల చెపుతరు.తెలుగుల చదివితే వాళ్ల జిందగీ యేమయితది? గందుకే గీ నెల నుంచి కార్పొరేట్ స్కూల్ కు తోలుతున్న. పది వేలు కర్చుపెట్టి సెల్

కథ

ఫోన్ గూడ కొనిచ్చిన. ఆన్‌లైన్‌ల చెపుతరట. ఎంతైన ఇంగ్లీషు బళ్ళు ఇంగ్లీషు బళ్ళే. ఇయ్యాలరేపు ఇంగ్లీషుల చదివితేనే మంచిది. పిల్లలు ఉషార యితరు. దీనికి నేనెంతనన్న కష్టపడుత'' అంటూ టైర్ బాగు చేసి, స్కూటర్ అప్పగించాడు.

స్కూటర్ స్టార్ట్ చేసి కొంత దూరం వెళ్ళగానే తన బడిలో పదవతరగతి చదువుతున్న వెంకటేష్ అనే పిల్లవాడి తండ్రి భాస్కరరావు ఎదురుపడ్డాడు. రామారావు ఎప్పటి నుండో అతడిని కలవాలనుకుంటున్నాడు. అతడి అబ్బాయి చాలా మంచి పిల్లవాడు, అన్ని సబ్జెక్ట్‌లలో మంచి మార్కులు తెచ్చుకు ంటాడు. కానీ తెలుగులో బాగా వెనుక బడ్డాడు. తాను శాయ శక్తులా కృషి చేస్తున్నా, ఫలితం కనిపించడం లేదు. ఆ పిల్లవాడి అభివృద్ధికై తానొక అలోచన చేసాడు. ఆ అలోచన ఆ అబ్బాయి తండ్రికి చెప్పి అమలు జరిగేలా చూడాల నుకున్నాడు.

వెదకబోయిన తీగకాలికి తగిలినట్లు అతడికి భాస్కర రావు కనబడ్డాడు.

"బాగున్నారా! భాస్కర్ రావుగారు! ఈ మధ్య స్కూల్ వైపు రావడం లేదు. అన్నట్లు మీ అబ్బాయి అన్ని సబ్జెక్ట్ లలో మంచి మార్కులు తెచ్చుకుంటు న్నాడు. కానీ తెలుగులో వెనుకబడి ఉన్నాడు'' అంటూ యేదో చెప్పబోయాడు.

"అబ్బా! తెలుగులో స్లో లెర్నర్ అయితే నష్టం ఏమిటి? పాసవుతున్నాడు కదా? పైగా మిగిలిన సబ్జక్టులు బాగా చదువుతున్నాడు. ఇంటర్‌లో సంస్కృ తమో, ఫ్రెంచీయో లేదా స్పెషల్ ఇంగ్లీష్ ఇప్పిద్దామనుకుంటున్నాను. అవేవి కాకుంటే హిందీ ఇప్పిస్తాను. అయినా చదువులు పూర్తి అయిన తరువాత ఈ రాష్ట్రంలో కానీ, ఈ దేశంలో కానీ ఉండేది ఉందా? అన్నట్లు నాకు కొంచెం పని ఉంది. సెలవ్'' అంటూ వెళ్ళిపోయాడు.

అతడికి ఇనుప కమ్మితో ముఖంమీదా, దవడల మీదా వాయించినట్లు అనిపించింది.

స్కూటర్ స్టార్ట్ చేసుకొని, ఇంకా కాస్త ముందుకు పోయాడు. ఎదురుగా ప్రొఫెసర్ నారాయణ గారు వస్తూ కనబడ్డాడు. రామారావు స్కూటర్ ఆపి నమస్కరించాడు. అతడూ ,తన వెహికిల్ ను ఆపాడు.

రామారావు పీజీ చేస్తున్నప్పుడు అతడు తెలుగు సాహిత్యం బోధించేవాడు. ఉద్దండ పండితుడు. తెలుగు భాషా మాధుర్యాన్ని, ఘనతను ఆయన చెబుతుంటే వినే వారికి ఎంతో ఆనందం, స్ఫూర్తి కలిగేది. కాలేజీ విడిచి ఉద్యోగంలో చేరినా, ఆయనంటే ఇప్పటికీ అభిమానం, గౌరవం తగ్గలేదు.. ఒకరకంగా రామారావులో ఉన్న భాషాభిమానానికి ఆయనే కారణ భూతులు.



"సార్! మిమ్మల్ని చూసి చాలా కాలం అయ్యింది'' అంటూ అప్యాయంగా పలుకరించాడు రామారావు.

"బాగున్నానయ్యా! గవర్నమెంట్ బడిలో టీచర్ అయ్యావట కదా .మీ బ్యాచ్ వాళ్ళెవరో కలిస్తే చెప్పారు. నేను పోయిన సంవత్సరం రిటైరయ్యాను. ప్రస్తుతము వ్యాపారం చేస్తున్నాను. మా పెద్దబ్బాయి సాఫ్ట్ వేర్ ఇంజనీర్. అమెరికాలో ఉన్నాడు. రెండవవాడు డాక్టర్ ఇంగ్లాండ్‌లో ఉన్నాడు. మూడవ అబ్బాయి నీ లాగా తెలుగులో ఎమ్.ఎ చేసాడు. వాడికీ తెలుగు టీచర్ ఉద్యోగం వచ్చింది. నేను వెళ్ళ వద్దు అన్నాను. వ్యాపారం పెట్టించాను. అందరూ బాగా సెటిల్ అయ్యారు. నీవు బాగే కదా.

"ఆల్ ది బెస్ట్. నాకు కొంచెం పని ఉంది వెళ్ళాలి'' అంటూ వెళ్ళిపోయాడు. రామారావుకు ఏదో చేదు తిన్నట్లయింది.

తానెవరి స్ఫూర్తితోనైతే తెలుగు ఉపాధ్యాయుడు అయ్యాడో,అతడు,అతడి పిల్లలు తెలుగు భాషకు దూరమయ్యారు. మనసంతా అదోలా అయింది.

మాతృభాషా దినోత్సవాల నాడు అతడు చేసే ఉపన్యాసాలు గుర్తుకు వచ్చాయి.

ఇంటికి వెళ్ల బుద్ధి కాలేదు. టౌన్ హాల్‌లో సాహిత్య సభకు వెళితే మనసు ప్రశాంతంగా ఉంటుందని అటు వైపు ప్రయాణం సాగించాడు. అక్కడికి వెళ్ళే సరికి కార్యక్రమం జరుగుతుంది. పండితులు,కవులు తమ పద్యాలను, కవితలను వినిపిస్తున్నారు. భాషా భిషక్కులు తమ భేషజాలను ప్రదర్శిస్తున్నారు. కొందరు దీర్ఘ సంస్కృత సమాసాలతో, శబ్దాల గారడితో శ్రోతలచే ఇనుప గుగ్గిళ్ళు నమిలిస్తున్నారు. కొందరు సింబాలిక్ పోయెట్రీ పేరుతో

శ్రోతల మెదళ్ళను మర్దిస్తున్నారు. కొందరు ఇజాలను, నిజాలను చెప్పే ప్రయత్నము చేస్తున్నారు.

"నా కవిత్వము నీవు మెచ్చుకో, నీకవిత్వము నేను మెచ్చుకుంటాను" అన్న పరస్పర అంగీకారంతో, ఒక రకమైన 'క్విడ్ ప్రొకో'తో సభ నడుస్తున్నట్ల నిపించింది. అతడికి, అక్కడ కూర్చున్న వాళ్ళలో చాలా మందికి, ఆ సభ కురుక్షేత్ర యుద్ధంలా పరభాషాచిత్రంలా అనిపిస్తున్నట్లు తోచింది.

దాదాపు రెండు గంటలు అక్కడే ఉన్నా అతడి మనసు కుదుట బడలేదు. ఆ సభలో కవులు చదివిన కవిత్వంలో మాధుర్యం,సున్నితత్వం, సారళ్యం లేదు. కవితా సొబగులతో తెలుగు కవితామాతను అర్చించిన నన్నయ, తిక్కన, పోతన, గురజాడ, దేవులపల్లి, శ్రీశ్రీ, దాశరథి మూడు ముక్కల్లో మూడులోకాలు దర్శనం చేయించిన ప్రజాకవి వేమనలు గుర్తుకు వచ్చారు.

ఒక్కసారిగా నిట్టూర్చాడు. ఇంటికి బయలు దేరాడు.

ఇంటి మెయిన్ గేట్ తీసి లోపలికి వెళ్ళి,స్కూటర్ పార్క్ చేసాడు. ఇంటిలోకి వెళ్ళ బోతుండగా పక్కింటి నుండి, వచ్చీరాని ఇంగ్లీషులో పెద్ద పెద్ద గద్దింపులు, హెచ్చరికలు, కేకలు వినబడ సాగాయి. అంత అరుపుల్లోను మాటలు స్పష్టంగా వినబడ సాగాయి.

"డోంట్ టాక్ తెలుగు. టాక్ ఇంగ్లీష్. నెక్స్ట్ టైమ్ యూ టాక్... ఐ బీట్, ఇఫ్ యూ టాక్ తెలుగు... నోఫుడ్, నోడ్రెస్" అంటూ పక్కింటి తెలుగు మమ్మి ఆరేళ్ల పసి పిల్ల వాడిని దండిస్తున్నది. వాడు బిక్కచచ్చి దోషిలా నిలబడ్డాడు.

రామారావుకు హరిభక్తి మానని ప్రహ్లాదుడిని దండిస్తున్న హిరణ్యకశిపుడి కథ గుర్తుకు వచ్చింది.

ఇంట్లోకి వచ్చి బట్టలు మార్చుకొని అలాగే కూర్చుండి పోయాడు. ఆ రోజు జరిగిన సంఘటనలు ఒక్కొక్కటిగా గుర్తుకు రాసాగాయి. అతడిలో ఆందోళన ప్రారంభమైనది.

తెలుగు భాషకు, భాషాభిమానులకు ఎంత గడ్డురోజులు వచ్చాయి. మాతృ భాషను ప్రేమించని వాడు, దానిలోని మాధుర్యాన్ని చవి చూడలేని వాడు పరభాషను ఎలా ప్రేమిస్తాడు? ఎలా సేవిస్తాడు? ఒకవేళ అభిమానించినా అంతసులువుగా పట్టుబడుతుందా? ఏ వ్యక్తికైనా మాతృభాషలో పరిచయ ప్రావీణ్యాలు లేకపోతే భావ వ్యక్తీకరణ సులభముగా చేయగలడా? అభివ్యక్తీక రణ నైపుణ్యాలను ఒడిసి పట్టగలడా? అందమైన అనుభూతులను, అనంతమైన అనుభవాలను, ఆనంద, విషాద, విస్మయ సమయాలలో తన భావాలను వెల్లడి చేయగలడా?

ఘనమైన సారస్వత సంస్కృతి కలిగిన జాతి క్రమంగా భాషను నిర్లక్ష్యము చేస్తే, రేపటి తరాలవారు ఆ సారస్వతాన్ని ఎలా అర్థం చేసుకోగలరు? శాస్త్ర సాంకేతిక రంగాలలో జాతి ఎంత మమేకమైనా, హృదయాన్ని స్పందింపచేయగలిగే, భాషా నైపుణ్యాలు అలవర్చుకోకపోతే మనకు మిగిలేదేమిటి? మనిషిని భౌతికంగా, ఆర్థికంగా ఉన్నతుడిని చేసేది వృత్తి విద్యలు, శాస్త్ర సాంకేతిక విద్యలు అయినా, ఆధ్యాత్మికంగా, సాంస్కృ తికంగా, నైతికంగా ఉన్నతుడిని చేసేది సాహిత్యం. ఆ సాహిత్యానికి ఆలంబన అయినది భాషే కదా. అందులో మాతృ భాషది అగ్రస్థానం కదా. అంతటి మాతృ భాషను ఉపేక్షిస్తే ఎలా?

నీతిని, భావుకతను భాషలో చెప్పినంత అందంగా సూత్రాలలో, డెరివేషన్లలో, ఈక్వేషన్‌లలో చెప్పలేముకదా? అటు నన్నయ, పోతనలను మరిచిపోయి, ఇటు తులసీదాసు, షేక్ స్పియర్‌లను అర్థము చేసుకోలేక ఏమిటీ ఈ అవస్థ.

తెలుగు భాషాభివృద్ధి అటుంచి, తెలుగులో మాట్లాడడమే నేరమయ్యే రోజులు వచ్చాయే, అమృతతుల్యమైన భాష మృతభాషగా మారుతుందే?" ఇలా పరిపరి విధాలా ఆలోచిస్తూ తలపట్టుకు కూర్చున్నాడు. అతడి ఎదురుగా వీణాధారి యైన సరస్వతీదేవి పటం ఉంది.

ఎందుకో రామారావుకు సరస్వతీ దేవి జీన్స్, స్లీవ్‌లెస్ టీషర్ట్ వేసుకొని గిటార్ పై పాశ్చాత్య రాగాలు పాడుతున్నట్ల నిపించింది. అతడి ఊహ అతడికే నవ్వు తెప్పించింది. వెంటనే అపరాధ భావన కలిగింది. భోజనం ఎలాగో చేసాడు. పడక మీదికి చేరుకున్నాడు. ఇంతలో అతడి శ్రీమతి పనులు ముగించుకొని వచ్చింది. వచ్చీ రావడముతోటే

"అయ్యా పోతనగారూ! ఈ సంసారాన్ని ఈదలేకపోతున్నాను. ఇంటి అద్దె, పిల్లల చదువులు, మీ తల్లిదండ్రుల అనారోగ్యాలు, మీ చెల్లెళ్ళ పెళ్ళిళ్లకి చేసిన అప్పులు, ఇలా.. ఇలా... అన్నింటిని మీరిచ్చే జీతముతో సర్దలేక పోతున్నాను. అయినా ఎవరిని ఉద్ధరించడానికి ఈ తెలుగు మాస్టర్ గిరిని ఎంచుకున్నారండి? ఎదుగూ బొదుగూ లేని జీవితంతో చస్తున్నాము. ఇదిగో ఇపుడే చెపుతున్నాను, సాయంత్రాలు ఆ కవిత్వాలు, కాకరకాయలు మానేసి ఎక్కడైనా పార్ట్ టైం జాబ్ చేయండి. లేదా నేనే ఇంటి గడప దాటాల్సి వస్తుంది." అంటూ రోజూ పాడే పాట ఆ రాత్రి మళ్ళీ పాడి అటుతిరిగి పడుకుంది.

ఉదయం నుండి జరుగుతున్న సంఘ టనలకు, ముక్తాయింపుగా ఇంతకంటే మంచి క్లైమాక్స్ ఉండదేమో అనిపించింది.

అంత బాధలోనూ అతడికి నవ్వు వచ్చింది. నిదుర పోవాలనుకున్నా, నిదుర పట్టడం లేదు.

సెల్ ఫోన్ తీసి వాట్సాప్ ఆన్ చేసాడు. యేదో గ్రూప్‌లో సాహిత్య కార్యక్రమం తాలూకు వీడియో ఉంటే ఆన్ చేసాడు. చిన్న పిల్లలు ఒకళ్ళ తరువాత ఒకళ్ళు అద్భుతంగా పద్యాలు పాడుతున్నారు. గుండె ఆనందంతో నిండింది.

ఇంకొక గ్రూపులో మరొక వీడియో ఆన్ చేసాడు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్య మంత్రి ఒక సభలో అద్భుతంగా పద్యాలు పాడుతున్నాడు. ఎందుకో తెలియని ధైర్యం వచ్చింది అతనికి. "నా భాషకేమైతది" అనిపించింది. సెల్ మూసి వేసాడు. హాయిగా నిదురపోయాడు.

# జయమిమ్ము భువికి!



అవుసుల భానుప్రకాశ్, 96032 04507

ఢామ్మని ప్రేలు పటాకుల శబ్దాలు
విజయనాదమ్ముగా వినగ మేలు!
చిచ్చుబుడ్లనుబోలు హెచ్చు చైతన్యమ్ము,
మహినిండ వెలుగొంద మనకు శక్తి
రవళించునభివృద్ధి రాకెట్ల వలెసాగి,
నింగిలో మార్మోగ నిఖిలయశము!
కాకరపూవత్తి  కాంతులవలయాలు
జీవితమ్ముల నిల్వ చేవ గలుగు!
విష్ణు భూచక్రాల వెలుగులే జగతిని
వెలిగింప శ్రేయమౌ విమలకీర్తి!
చిట్టిచేతులనుండి చిటపటల్ జాల్వారి
సంతోషమొలుకగా సత్యమదియె!
చీకటిన్ తరుమగా చెన్నారు జిలుగులన్
భువినింపు దీపమే బ్రోచుధరను!

నేలనుండి తీగయి సాగి, నింగి పూలు
వెలుగ జేసెడి బాంబులు చెలువమొలుక,
ఈల పాటల రాగాలు నేలకొసగి,
సర్రుమని సాగెడు టపాసు సత్వమొసగ,
రమ్ము దీపావళీ! జయమిమ్ము భువికి!

దీపమొక్కటి వెలిగించు దీపతతుల
నట్లు మనుషుల కదిలించునతడు మనిషి!
వరలి లక్ష్మిపూజల, సరస్వతిని గొలిచి,
సంఘటనమను దీపంపు శక్తిబెంచ,
ప్రజలు ప్రమిదలై చమురుగా బలముగూర్ప,
రమ్ము దీపావళీ! జయమిమ్ము భువికి!

దీపమొసగెడి సందేశ దీప్తియేది?
తాను కరుగుచున్ ధరణికి దారిజూపు!
వెలుగు లీనుచు నితరుల వెల్గజేయు
నిట్టి దివ్యభావన మది తట్టిలేప,
రమ్ము దీపావళీ! జయమిమ్ము భువికి!

తమమునిండిన మదులందు ధైర్య కాంతి
నింపి, చైతన్య క్రాంతులన్ నేర్పు నేర్పి,
దేశభక్తిని యలవర్చి దివ్య నరుల
జేయ, స్వార్థ యోచన లేని చిత్తమొసగ,
రమ్ము దీపావళీ! జయమిమ్ము భువికి!!



వ్యాసం

# పాలమూరు జిల్లాలో గ్రంథాలయోద్యమం...

తెలంగాణ భాష సంస్కృతుల వికాసం తెలిపిన వ్యాసం...



డా॥ భీంపల్లి శ్రీకాంత్
90328 44017

మానవ సమాజానికి విజ్ఞానాన్ని అందించే సాంస్కృతిక వికాస కేంద్రాలు గ్రంథాలయాలు. తెలంగాణలో సాహిత్య సాంస్కృతిక వికాసానికి ఎనలేని కృషి చేసినవి గ్రంథాలయాలు. నాడు అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతున్న తెలుగు ప్రజలకు ఆశాదీపంలా వెలుగుబాటలో పయనింపజేసినవి గ్రంథాలయాలు. పాఠకులకు పత్రికలు, పుస్తకాలను అందించడమే కాక సభలకు, సమావే శాలకు, కవిసమ్మేళనాలకు, వివిధ సంస్థల వార్షికోత్సవాలకు వేదిక కల్పించి ప్రజలను మేల్కొలిపిన గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు. నాటి ప్రజలలో రాజకీయ చైతన్యం తీసుకురావడానికి ఈ గ్రంథాలయాలు ఇతోధికంగా సహాయ పడ్డాయి.

నాటి హైదరాబాద్ రాష్ట్రంలో తెలుగు మాట్లాడేవారి శాతం 48.2% కాగా మరాఠి వారి శాతం 26.4%, కన్నడ వారి శాతం 12.3%, ఉర్దూ మాట్లాడేవారి శాతం 10.3%గా ఉన్నది. అధికార భాషగా మాత్రం ఉర్దూ భాష ఉండేది. నాటి నిజాం ప్రభుత్వ కాలంలో తెలుగుభాష కనుమరు గవుతుందేమోనన్న భావనలో ఉన్న నాటి తెలుగు భాషాభిమానులు, కవులు, రచయితలు ఊరూరా గ్రంథాలయాల స్థాపనకు నడుం బిగించారు. దీనికి కారణం లేకపోలేదు. అప్పట్లో ప్రజలు



తెలుగు పత్రికలను తెప్పించటం, చదవడం అనేది దేశద్రోహంగా పరిగణించ బడేది. ఆనాటి నిజాం ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలు ఈ పత్రికల ద్వారా తెలుసుకొనేవారు.

ఈ అవకాశాన్ని కూడా ప్రజలకు అందుబాటులో లేకుండా చేయడానికి నాటి నిజాం ప్రభుత్వం ప్రయత్నించడంతో తెలంగాణలో గ్రంథాలయోద్యమం ప్రారంభమైంది.

ఈ నేపథ్యంలోనే తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణ వికాసం కోసం గ్రంథాలయోద్యమం ప్రారంభమైంది. ఈ గ్రంథాలయోద్యమానికి బీజం వేసినవాడు కొమర్రాజు వెంకట లక్ష్మణరావు. ఈ గ్రంథాలయోద్యమాన్ని తెలంగాణలో ప్రజల్లోకి ఉవ్వెత్తున తీసుకెళ్ళినవారు మునగాల జమీందారు నాయిని వెంకట రంగారావు, రావిచెట్టు రంగారావు, వట్టికోట ఆళ్వారుస్వామి, మాడపాటి హనుమంతరావు, ఆదిరాజు వీరభద్రరావు, సురవరం ప్రతాపరెడ్డి తదితరులు. వీరు తెలంగాణలో గ్రంథాలయోద్యమాన్ని బలోపేతం చేసిన తెలుగు భాషోద్య మకారులు.

ఈ సందర్భంలోనే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో కూడా గ్రంథాల యోద్యమం ఉవ్వెత్తున సాగింది. ఈ గ్రంథాలయోద్యమ ప్రభావంతో ఊరూరా అనేక గ్రంథాలయాలు నెలకొల్పబడ్డవి. నేటికీ అవి ఎంతోమందిని విద్యావం తులుగా తీర్చిదిద్దుతూనే ఉన్నవి. మహబూబ్ నగర్ జిల్లాలో గ్రంథాలయో ద్యమానికి తొలిసారిగా ఊపిరిలూదిన వాడు సురవరం ప్రతాపరెడ్డి. కవిగా, రచయితగా, గోల్కొండ పత్రిక సంపాద కుడిగా, తెలుగు భాషా పరిరక్షకుడిగా యావత్తు తెలుగు ప్రజలకు సుపరి చితుడు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో మొట్టమొదటిసారిగా 1922వ సంవత్సరంలో ఉస్మానియా (బాల సరస్వతి) గ్రంథాలయాన్ని నెలకొల్పారు.

తెలంగాణలోనే మొట్టమొదటిసారిగా 1913 వ సంవత్సరంలో మహబూబ్ నగర్ నుండి "హితబోధిని" అనే మాసపత్రికను కోయిలకొండకు చెందిన బరారు

వ్యాసం

శ్రీనివాసశర్మ తన సంపాదకత్వంలో వెలువరించారు. ఆనాటి నిజాం ప్రభుత్వ ఒత్తిడివల్ల ఆర్థిక ఇబ్బంది ఏర్పడడంతో 1915 వ సంవత్సరంలో ఈ పత్రిక ఆగి పోయింది. ఆ తర్వాత తెలంగాణలో నీలగిరి పత్రిక, తెలుగు పత్రిక, గోలకొండ పత్రికలు మొదలైనవి వెలువడ్డాయి.

ఆనాటి నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగానే కాకుండా తెలంగాణ భాష, సంస్కృతి వికాసం కోసం 1922 వ సంవత్సరంలో మాడపాటి హనుమంత రావు, సురవరం ప్రతాపరెడ్డి తదితర పెద్దలు కలిసి హైద్రాబాద్ లో ఆంధ్రజన కేంద్ర సంఘం పేరుతో ఒక సంఘాన్ని స్థాపించారు. దీని ద్వారానే గ్రామగ్రామాన గ్రంథాలయోద్యమం వ్యాప్తి చెందింది. గ్రంథాలయాలు, పఠనాలయాలు విరివిగా ఏర్పడ్డాయి. ఈ సంఘాన్ని హైదరాబాద్ వరకే పరిమితం చేయకుండా తెలంగాణలోని అన్ని జిల్లాల్లో శాఖలను ఏర్పాటు చేసారు. ఈ సంఘం ముందుగా గ్రంథాలయాలను ఏర్పాటు చేసి ప్రజల్లో ఉద్యమ స్వభావాన్ని రగిలించింది. వీరి కృషి ఫలితంగానే మహబూబ్ నగర్ పట్టణంలో 1922 వ సంవత్సరంలో ఉస్మానియా గ్రంథాలయమనే పేరుతో ఒక గ్రంథాలయం స్థాపించబడింది. ఈ గ్రంథాలయం రెండు, మూడు సంవత్సరముల వరకు నిర్వహించబడి తర్వాత మూతబడింది. జిల్లాలో ఆంధ్ర మహాసభ ద్వారా గ్రంథాలయోద్యమం నిర్వహించబడి దాదాపు ఆయా గ్రామాలలో వంద గ్రంథాలయాలు స్థాపించబడ్డాయి.




**తెలంగాణలోనే**
**మొట్టమొదటి సారిగా 1913 వ సంవత్సరంలో మహబూబ్ నగర్ నుండి "హితబోధిని" అనే మాసపత్రికను కోయిలకొండకు చెందిన బరారు శ్రీనివాసశర్మ తన సంపాదకత్వంలో వెలువరించారు. ఆనాటి నిజాం ప్రభుత్వ ఒత్తిడివల్ల ఆర్థిక ఇబ్బంది ఏర్పడడంతో 1915 వ సంవత్సరంలో ఈ పత్రిక ఆగి పోయింది. ఆ తర్వాత తెలంగాణలో నీలగిరి పత్రిక తెలుగు పత్రిక, గోలకొండ పత్రికలు మొదలైనవి వెలువడ్డాయి.**

పాలమూరు జిల్లాలో 1930వ సంవత్సరంలో జడ్చర్ల రైల్వే స్టేషన్ సమీపంలో రవీంద్ర పఠనాలయం స్థాపించబడింది. ఈ గ్రంథాలయం స్థాపనానంతరం ఉద్యమ తీవ్రత పెరిగి ఆయా గ్రామాలలో, పట్టణాలలో విరివిగా గ్రంథాలయాలు స్థాపించబడినవి. ఉద్యమ ప్రారంభ దశలోనే గ్రంథాలయాలకు నిజాం గ్రంథాలయం, ఉస్మానియా గ్రంథాలయం అనే పేర్లు పెట్టబడినవి.

ఆనాటి నిజాం ప్రభుత్వంలో సభలు, సమావేశాలు నిర్వహించాలన్నా ప్రభుత్వ అనుమతి తప్పనిసరిగా ఉండేది. కానీ గ్రంథాలయోద్యమకారులు ఎన్నో కష్టాలకు ఓర్చి గ్రంథాలయ వార్షిక సభలను, స్థాపనోత్సవాలను విజయ వంతంగా పూర్తి చేసేవారు.

1938 సంవత్సరంలో జరిగిన స్టేట్ కాంగ్రెస్ ఉద్యమానంతరం జిల్లాలో గ్రంథాలయ ఉద్యమం దినదినాభివృద్ధి చెందడంతో దాదాపు 40 వరకు నూతన గ్రంథాలయాలు, పఠనాలయాలు స్థాపించబడ్డాయి. ఈ కృషి ఫలితంగానే 1946వ సంవత్సరం మార్చి 1,2,3, తేదీలలో అలంపూరు తాలూకా క్యాతూరు గ్రామంలో 26వ ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘ వార్షిక సభలు రాజా బహదూర్ కొత్వాల్ వెంకట్రామారెడ్డి అధ్యక్షతన






వైభవంగా జరిగాయి. ఈ వార్షికోత్సవ సభలకు జిల్లాలోని ఆయా గ్రంథాలయాల ప్రతినిధులు దాదాపు 60 మందికిపైగా హాజరయ్యారు.

జిల్లాలో గ్రంథాలయోద్యమం ద్వారా ప్రజలలో రాజకీయ చైతన్యం కలగడంతో స్వాతంత్రోద్యమంలో గ్రంథాలయ సేవకులతో పాటు సాధారణ ప్రజలు కూడా సత్యాగ్రహులుగా జైళ్ళకు వెళ్ళిన చరిత్ర జిల్లాది. సత్యాగ్రహ సమర కేంద్రాలుగా కొన్ని గ్రంథాలయాలు స్ఫూర్తిగా నిలిచాయి. 1944లో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో శ్రీరామనవమి పర్వదినాన శ్రీ సీతారామాంజనేయ గ్రంథాలయం స్థాపించబడింది. ఈ గ్రంథాలయం స్థాపించేనాటికి స్వాతంత్ర్య పోరాటం ఉధృతంగా సాగుతుండడంతో ఈ గ్రంథాలయం స్వాతంత్రోద్యమానికి కేంద్రబిందువుగా మారింది. ఎందరో యువకులు ఉద్యమాలు చేసి జైలుశిక్ష అనుభవించారు. అప్పటికే యువతరంలో జాతీయ భావాలు పుంజుకోవడం వలన తత్త్వవేత్తలు, రాజకీయవేత్తలు, సాహితీ వేత్తలు, కవులు గ్రంథాలయాన్ని సందర్శించటం శ్రీ సీతారామాంజనేయ గ్రంథాలయం నిర్వాహకులను ఉత్తేజ పరచింది. కేవలం ఒక భాషకు సంబంధించిన గ్రంథాలు, పత్రికలే కాక అనేక భాషల ప్రచురణలు గ్రంథాలయం సమకూర్చుకోగలిగింది. ఈ గ్రంథాలయం కేవలం గ్రంథాలయ నిర్వహణకే కాక ఖాదీ, హిందీ ప్రచారం, వయోజన విద్య, మద్య పాన నిషేధం, హరిజన సేవ, సర్వోదయ మరియు వినోబాభావే ప్రారంభించిన భూదానోద్యమానికి కేంద్రమైంది. అంతేకాదు అనేక సంఘసంస్కరణలను చేపట్టి వింతతు వివాహాది వంటి కార్యక్ర మాలు కూడా నిర్వహించడం విశేషం. ఈ గ్రంథాలయ నిర్వహణలో పల్లెర్ల జానకి రామశర్మ కృషి చిరస్మరణీయమైనది. జిల్లాలో గ్రంథాలయాల స్థాపన నిర్వహణకై యువకులను ప్రోత్సహించడం, నిరంతరం పర్యటిస్తూ పరిస్థితులను పర్యవేక్షించడం ఆయన సంఘసంస్కరణాభిలాషకు నిదర్శనం. ఇంకా గంగాపురం హనుమ చ్ఛర్మ, గంగాపురం అనంతరామశర్మ తమ జీవితాలను గ్రంథాలయోద్యమానికి అంకితం చేసిన ధన్యజీవులు. ఇక్కడేగాక హైద్రాబాదులోని గౌలిగూడలో బాల సరస్వతీ గ్రంథాలయాన్ని స్థాపించి దాని నిర్వహణలో వీరు కీలకమైన పాత్ర పోషించారు.

హైద్రాబాదు రాష్ట్రంపై పోలీసు చర్యానంతరం 1950 వ సంవత్సరంలో జిల్లా గ్రంథాలయ సంఘం ఏర్పడి గ్రంథాలయాల పునర్వ్యవస్థీకరణకై విశేషకృషి చేసింది. ఆ తర్వాత 1955లో లోకల్ లైబ్రరీ చట్టం రావడంతో గ్రంథాలయాల వ్యవస్థ తారుమారైంది. ఈ వ్యవస్థ ద్వారా రాజకీయ నాయకులు గ్రంథాలయ ప్రతినిధులుగా అవతార మెత్తారు. నిజాయితీగా పనిచేసిన గ్రంథాలయోద్యమకారులకు స్థానం లేకుండాపోయింది. దీంతో రాజకీయ పక్షాలు స్వప్రయోజనాలకై గ్రంథాల యాలను ఉపయోగించడం వల్ల పాత గ్రంథాలయాలు మూతబడి కొన్ని కొత్త గ్రంథాలయాలు స్థాపించబడ్డాయి. ఈ జిల్లాలో దాదాపు డెబ్బై గ్రంథాలయాల వరకు స్థాపింపబడి లక్షా యాభైవేల గ్రంథాలతో నాలుగు వందల మంది గ్రంథాలయ సేవకులు కృషిచేయడం గొప్ప విషయం. ఆనాటి గ్రంథాలయాలలో బాలసరస్వతి గ్రంథాలయం (మహబూబ్ నగర్), శ్రీ సీతారామ గ్రంథాలయం (మహబూబ్ నగర్), శివకేశవ

> **1944లో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో శ్రీరామనవమి పర్వదినాన శ్రీ సీతారామాంజనేయ గ్రంథాలయం స్థాపించబడింది. ఈ గ్రంథాలయం స్థాపించేనాటికి స్వాతంత్ర్య పోరాటం ఉధృతంగా సాగుతుండడంతో ఈ గ్రంథాలయం స్వాతంత్రోద్యమానికి కేంద్రబిందువుగా మారింది. ఎందరో యువకులు ఉద్యమాలు చేసి జైలుశిక్ష అనుభవించారు.**

గ్రంథాలయం (వట్టెం), శారదా గ్రంథాలయం (నాగర్ కర్నూలు), ఆంధ్రభాషా గ్రంథాలయం (రఘుపతి పేట), ప్రజా గ్రంథాలయం (కల్వకుర్తి), ఆంధ్ర గ్రంథాలయం (మరికల్), సీతారామ గ్రంథాలయం (అచ్చంపేట), శ్రీ రామకృష్ణ స్మారక గ్రంథాలయం (అలంపూర్), అభ్యుదయ గ్రంథాలయం (అయ్యవారిపల్లి), ఆంధ్రవాణి గ్రంథాల యం (మక్తల్), రవీంద్ర గ్రంథాలయం (యాపర్ల), చెన్నకేశవ గ్రంథాలయం (కోడంగల్), జవహార్ గ్రంథాలయం (ఆమన్ గల్), జైహింద్ గ్రంథాలయం (వెల్దండ), రామచంద్ర గ్రంథాలయం (తాటిపర్తి), వాణి గ్రంథాలయం (గోపాల్ పేట), సీతారామా గ్రంథాలయం (ఆత్మకూర్), అష్టభాషా బహిరి గోపాల



రాయ ఆంధ్ర గ్రంథాలయం (వనపర్తి), చెన్నకేశవ గ్రంథాలయం (గద్వాల), గ్రామస్వరాజ్య గ్రంథాలయం, శివానంద గ్రంథాలయం (శ్రీరంగాపురం), జయహిందు గ్రంథాలయం (మూసాపేట), సదానంద గ్రంథాలయం (అమడబాకుల), రామచంద్ర గ్రంథాలయం (గంగాపురం ), రవీంద్ర పఠనాలయం (బాదేపల్లి), ఆంధ్ర గ్రంథాలయం (ఆవంచ), ఆంధ్రభాషా గ్రంథాలయం (వంగూరు), చెన్నకేశవ గ్రంథాలయం (లింగనవాయి), శారదా గ్రంథాలయం (కంచిరేవుపల్లి), ఆంధ్ర గ్రంథాలయం (కందూరు), స్వతంత్ర గ్రంథాలయం (గుమ్మడం), శారదా గ్రంథాలయం (కంచిరేవుపల్లి), స్వరాజ్య ఆంధ్ర గ్రంథాలయం (క్యాతూర్) , యువజన గ్రంథాలయం (కొల్లాపూర్), శారదా గ్రంథాలయం (మారమునగాల), కళాసమితి గ్రంథాలయం (అమరచింత), ఆంధ్ర గ్రంథాలయం (రంగాపురం), వెంకటేశ్వర గ్రంథాలయం (పోలేపల్లి), సర్వేశ్వర గ్రంథాలయం (పెబ్బేరు) మొదలైనవి.

ఆనాడు స్థాపించిన బాలసరస్వతీ గ్రంథాలయమే నేటి మహబూబ్ నగర్ జిల్లా కేంద్ర గ్రంథాలయం. దీని శాఖలు జిల్లాలో దాదాపు 12 వరకు ఆయా తాలూకా కేంద్రాలలో నెలకొల్పబడ్డాయి. ప్రతి సంవత్సరం లక్షా యాభైవేల రూపాయలను ప్రభుత్వం ఈ గ్రంథాలయాల కోసం ఖర్చు చేయడం విశేషం.

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కేంద్ర గ్రంథాలయ స్థాపనలో నిస్వార్థులైన ఎందరో మహామహులు సేవచేసి కాలగర్భంలో కలిసిపోయారు. ఆనాటి ప్రభుత్వ నిరంకుశత్వానికి భయపడి నిర్వాహకులు కొన్ని సంవత్సరాల తర్వాత మూసివేసారు. అనంతరం కొంతకాలానికి అదే గ్రంథాలయం 1936 వ సంవత్సరంలో బాలసరస్వతీ గ్రంథాలయమనే పేరుతో పునర్వవస్థీకరించబడింది. ఈ గ్రంథాలయాన్ని ప్రసిద్ధ న్యాయవాది నందగిరి వేంకటరావు పునర్వవస్థీకరించారు.

1938-39లో నిజాం రాష్ట్రంలో స్టేట్ కాంగ్రెసు ఉద్యమం ప్రారంభమయ్యింది. రాష్ట్రంలో చాలామంది ప్రముఖులు సత్యాగ్రహం చేసి జైళ్ళకు వెళ్ళారు. ఈ సందర్భంలోనే నందగిరి వెంకట్రావు కూడా జైలుకు వెళ్ళారు. దీంతో గ్రంథాలయ నిర్వాహణ బాధ్యతను ఆంధ్ర బాలసంఘ కార్యదర్శి ఉత్తమ వెంకయ్య తీసుకొని గ్రంథాలయ కార్యకలాపాలను యథావిధిగా నిర్వహించారు.

నందగిరి వెంకట్రావు జైలు నుండి వచ్చిన తర్వాత గ్రంథాలయ బాధ్యతను తీసుకుని ప్రముఖ న్యాయవాది యం. నారాయణరావును అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. కొంతకాలానికి గ్రంథాలయ భవన నిర్మాణానికై స్థలం సేకరించడం జరిగింది. రాజా బహదూర్ కొత్వాల్ వెంకట్రామారెడ్డి భవన నిర్మాణానికై శంఖుస్థాపన చేశారు. ఈ భవన నిర్మాణం కోసం ప్రజల నుండి విరాళాలను సేకరించారు. మొట్టమొదటిసారిగా వనపర్తి రాజా రామేశ్వరరావు వెయ్యిరూపాయలను విరాళంగా అందించారు. గ్రంథాలయ భవన నిర్మాణానంతరం అత్యంత వైభవంగా వార్షికోత్సవం నిర్వహించారు. విరివిగా అనేక సాహిత్యసభలు, కవి సమ్మేళనాలు, సన్మాన సభలు భవనంలో జరపడం వల్ల గ్రంథాలయం విశేషంగా ప్రజాదరణ పొందింది.

కొంతకాలానికి నందగిరి వెంకట్రావు హైద్రాబాద్ వెళ్లుతూ కె. అచ్యుతారెడ్డికి గ్రంథాలయ బాధ్యతలను అప్పగించారు. కె. అచ్యుతారెడ్డి కాలంలో ఈ గ్రంథాలయం క్రమశిక్షణతో చక్కగా నిర్వహించబడేది. ఆనాటి రాజకీయ పరిస్థితి వల్ల కె. అచ్యుతారెడ్డి కూడా హైద్రాబాద్ వెళుతూ గ్రంథాలయాన్ని ప్రభుత్వపరం చేసి వెళ్ళారు. ప్రభుత్వపరం తర్వాత బాలసరస్వతీ గ్రంథాలయం పేరును తీసివేసి జిల్లా కేంద్ర గ్రంథాలయంగా మార్చారు. అప్పటి నుండి జిల్లా

**మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో అక్షయపాత్ర ద్వారా అభ్యర్థులకు రూ.5 లకే మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ఇక్కడ అన్ని వసతులు సమకూరుతుండడంతో ప్రైవేట్ కోచింగ్ సెంటర్లకు వెళ్ళకుండా చదువుకునేందుకు జిల్లా గ్రంథాలయాలవైపే మొగ్గు చూపుతున్నారు. శిక్షణార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం పెంచేందుకు డిస్ట్రిక్ ఎంపవర్‌మెంట్ కింద 200 మందికి క్రాష్ కోర్సులను కూడా నేర్పిస్తున్నారు.**



వ్యాసం

గ్రంథాలయం ఎందరో పాఠకులకు మార్గదర్శనం చేస్తూ వస్తోంది. నేటి కంప్యూటర్ యుగంలో సామాన్య పాఠకుల సంఖ్య తగ్గినా గ్రంథాలయాల వైభవం ఏమీ తగ్గలేదు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 67 గ్రంథాలయాలు కొనసాగుతున్నాయి. ఎన్ని అధునాతన సౌకర్యాలు వచ్చినా ఉద్యోగార్థులు తప్పకుండా చదివేది గ్రంథాలయాల్లోనే నడడం అతిశయోక్తి ఎంతమాత్రం కాదు.

అయితే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత గ్రంథాలయాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ప్రతి ఒక్క జిల్లాలో నూతనంగా గ్రంథాలయ భవనాలు ఏర్పాటవుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో గ్రంథాలయాల భవనాలు శిథిలావస్థలో ఉండేవి. వానొస్తే కురిసేవి. కుర్చీలు కూడా లేని దుస్థితి. టేబుళ్లు, పుస్తకాలు మాత్రం బూజుపట్టి ఉండేవి. తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో నిధులు భారీగా రావడంతో గ్రంథాలయాల రూపురేఖలే మారిపోయాయి. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లా గ్రంథాలయాలను స్టడీసెంటర్లుగా తీర్చిదిద్దారు. కాంపిటీటివ్ పరీక్షలకు చదివే అభ్యర్థుల కోసం అన్ని రకాల మౌలికవసతులను కల్పించారు. పుస్తకాలు, బల్లలు, కుర్చీలు, ఫ్యాన్లు, తాగునీరు, టాయిలెట్లు వంటి కనీస మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

అంతేకాకుండా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో అక్షయపాత్ర ద్వారా అభ్యర్థులకు రూ.5 లకే మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ఇక్కడ అన్ని వసతులు సమకూరుతుండడంతో ప్రైవేట్ కోచింగ్ సెంటర్లకు వెళ్ళకుండా చదువుకునేందుకు జిల్లా గ్రంథాలయాలవైపే మొగ్గు చూపుతున్నారు. శిక్షణార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం పెంచేందుకు డిస్ట్రిక్ ఎంపవర్‌మెంట్ కింద 200 మందికి క్రాష్ కోర్సులను కూడా నేర్పిస్తున్నారు. జిల్లాలోని మిగతా గ్రంథాలయాల కోసం కూడా పక్కా భవనాలను నిర్మించాలనే ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు.

భారతదేశ స్వాతంత్ర్యోద్యమ పోరాటంలోనూ, తెలంగాణ సాయుధ పోరాటంలోనూ, నిజాం వ్యతిరేకోద్యమ పోరాటంలోనూ గ్రంథాలయాలు దిక్సూచిగా పనిచేశాయి. ఎంతోమంది మేధావులు, ఉద్యమకారులను, అభ్యుదయవాదులను కలిపే కేంద్రాలుగా విరాజిల్లాయి. ఇంతటి ఘనమైన పాత్రను పోషించిన గ్రంథాలయాలు రానురానూ వాటి నిర్వహణభారం అధికం కావడంతో అప్పటి ప్రభుత్వాలు పట్టించుకోలేదు. కేవలం దినపత్రికలు మాత్రమే దర్శనమిచ్చేవి. ప్రస్తుతం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఉద్యోగార్థులు, పుస్తకప్రియులు గ్రంథాలయాల వైపు పరుగులు పెడుతుండడం విశేషం. పాత భవనాల స్థానంలో కొత్త భవనాల నిర్మాణానికి నిధులు సమకూర్చడం, మున్సిపాలిటీ, ఇతర శాఖల నుంచి రావాల్సిన సెస్‌ను నెలనెలా అందేలా చేయడంతో గ్రంథాలయాల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రాంమందిర్ గ్రంథాలయాన్ని పూర్తిగా ఆధునీకరించారు. రాజా రామ్మోహన్ రాయ్ లైబ్రరీ ఫౌండేషన్ ద్వారా రూ.53 లక్షలు, నియోజకవర్గ అభివృద్ధి ఫండ్ ద్వారా రూ.45 లక్షలు వెచ్చించి ఆధునిక భవనం, పార్కింగ్, పుస్తక పఠనానికి ప్రత్యేక సమావేశ మందిరం వంటి వసతులను కల్పించారు. నారాయణపేట జిల్లాలో రూ.5 లక్షల ఎంపీ ల్యాడ్స్ ఫండ్స్‌తోనూ, కోస్గిలో రూ.6 లక్షల నియోజకవర్గ అభివృద్ధి నిధులతో గ్రంథాలయాలను ఆధునీకరించారు. జడ్చర్లలో గ్రంథాలయ ఆధునీకరణకు రూ.12 లక్షలు, గ్రంథాలయ జనరల్ ఫండ్ నుంచి రూ.18 లక్షలు వెచ్చించారు. దేవరకద్రలో రూ.38 లక్షలతో కొత్త భవనాన్ని నిర్మించారు. కోయిలకొండ, హన్వాడలలో కొత్త భవనాలను నిర్మించారు. వెన్నచేడ్‌లో రూ.15 లక్షలతో మరమ్మతులు చేయించారు. వీటన్నిటి వెనక మహబూబ్ నగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్ గౌడ్ కృషి ఉన్నది. జిల్లాకు చెందిన మంత్రి శ్రీనివాస్ గౌడ్ రాజేశ్వర్ గౌడ్ కు బాధ్యతలు అప్పజెప్పడంతో అప్పటినుంచి చదువుకునే వారి కోసం ఏదో ఒకటి చేయాలనే తపనతో జిల్లా గ్రంథాలయా లకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు నిధుల సమీకరణపై దృష్టి సారించారు. ప్రభుత్వ శాఖల నుండి వచ్చే వివిధ సెస్‌లో రూపాయి కూడా వదలకుండా వసూలు చేసి ఆ నిధులతో భవనాలు, మౌలిక సదుపాయలను కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక ఉద్యోగ ప్రకటనలను విడుదల చేయడంతో గ్రంథాలయాలకు ఉద్యోగార్థులు చాలామంది వరుస కడుతున్నారు. ఇక్కడ చదువుకున్న అనేకమంది పంచాయతీ కార్యదర్శి, కానిస్టేబుల్, ఉపాధ్యాయుల కొలువులను సాధించారు. జిల్లాకు చెందిన మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్, ఇతర జిల్లా శాసనసభ్యుల సహకారంతో గ్రంథాలయాలకు కొత్త భవనాలను నిర్మించారు.

*(జిల్లా గ్రంథాలయాల వార్షికోత్సవాల సందర్భంగా)*

**భారతదేశ స్వాతంత్ర్యోద్యమ పోరాటంలోనూ, తెలంగాణ సాయుధ పోరాటంలోనూ, నిజాం వ్యతిరేకోద్యమ పోరాటంలోనూ గ్రంథాలయాలు దిక్సూచిగా పనిచేశాయి. ఎంతోమంది మేధావులు, ఉద్యమకారులను, అభ్యుదయవాదులను కలిపే కేంద్రాలుగా విరాజిల్లాయి. ఇంతటి ఘనమైన పాత్రను పోషించిన గ్రంథాలయాలు రానురానూ వాటి నిర్వహణ భారం అధికం కావడంతో అప్పటి ప్రభుత్వాలు పట్టించుకోలేదు.**

కవిత

# కవిత్వాయుధం



డా॥ చింతోజు మల్లికార్జున్, 9949927142

నిశ్శబ్ద అంతరంగంలో నివురుగప్పిన
చైతన్యంలోంచి నిప్పును రగిలించేది!
ఆకలి కేకలతోనే ఆకలి తీరుస్తూ నలిగిన వెలయాలి
వలువలు రాల్చిన కన్నీటి బొట్లను తుడిచేది!

పసిపిల్లల పాలబుగ్గల్లో పరువపు
సోయగాలను వెతుకుతూ
వికృతానందం పొందుతున్న మానవాసురులపైన
ప్రయోగించే అక్షర త్రిశూలం!

మట్టి మహా క్షేత్రంలో చెమట
గింజలు చల్లుతూ అన్నపు
సిరులను పండిస్తున్న
హలధారులకు ఆనందం కలిగించేది!

మౌడ్యం చీకట్లలో మగ్గుతున్న
కుహనా మేధావుల మస్తిష్కాలను
మథనం చేసేది!

బలహీనలతల దిగజారుడుతనాన్ని
బజారులో బేరమాడుతూ తాయిలాల
గాలాలతో ఓట్ల చేపలు పడుతున్న
రాజకీయ జాలరులకు గుణపాఠం!

కవిత్వమంటే కేవలం కవిత్వమే కాదు
సామాజిక వైరుధ్యాలపై అక్షరాయుధం!
వైపరీత్యాల విశృంఖలత్వంపై వజ్రాయుధం!



కథ

# కోపిన్ బియ్యం

కష్టపడి లక్ష్యసాధన చేయడంలో ఉన్న
ఔన్నత్యం వివరించిన కథ...



హుమాయున్ సంఘీర్
93981 78380

"ఈ మా నేషనల్ షార్ట్ ఫిల్మ్ కాంపిటీషన్స్‌లో 'వెలుగు' షార్ట్ ఫిల్మ్‌కి మొదటి బహుమతికి అర్హమైనదిగా ఎన్నుకున్నాం" అంటూ ఇంగ్లీష్‌లో స్టేజ్ మీదకు పిలిచారు. తను ఊహించిందే ఈ విజయాన్ని.

అక్కడున్నవాళ్లంతా సాయిలు ఎవరా? అన్నట్టు చూస్తున్నారు. ఆకుపచ్చరంగు లాల్చీలో వచ్చిన సాయిలు లేచి స్టేజీ వైపు నడుస్తున్నాడు. అందరూ అతన్నే చూస్తున్నారు.

కేంద్రమంత్రి మయూర్ దూబే ముఖ్య అతిథిగా వచ్చారు. ఆయన చేతుల మీదుగా ఫస్ట్ ప్రైజ్ మెమెంటో, ప్రైజ్ మనీ చెక్ అందుకున్నాడు. అప్పుడు సభలో మోగుతున్న చప్పట్లను చూస్తున్న సాయిలు ఉద్వేగానికి లోనవుతున్నాడు.

ఇన్నేళ్ల తను పడ్డ శ్రమను, తపనను, అవమానాలను, బాధలను.., అన్నింటినీ ఈ చప్పట్లు చెరిపేసాయన్న ఫీలింగ్ అతనిలో. చేతిలో మెమోంటోను చంటి పిల్లాడిలా మురిపెంగా చూస్తూ కళ్లకు అద్దుకొని, గుండెలకు అదిమి పట్టుకున్నాడు. "ఇది నేను అమ్మకిచ్చే నా మొదటి కానుక" అనుకున్నాడు. మనసులో మురిసిపోతూ దాన్ని కాసేపలా చూస్తుండిపోయాడు.

కళ్లు మురిపెంతో విప్పార్చుకున్నాయి. ఆ వెలుగు అతని మస్తిష్కంలో టన్నుల కొద్ది ఉత్సాహాన్ని నింపుతోంది. "ఈ విజయం మా అమ్మకు కానుకగా ఇద్దాం అనుకుంటున్నా. ఇకపై ఏం సాధించినా అమ్మ కోసమే. ఈ షార్ట్ ఫిల్మ్ వెనుక ఒక పదేళ్ల శ్రమ ఉంది. నా షార్ట్ ఫిలింను మొదటి బహుమతి కింద ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు" అని అందరికీ నమస్కరిస్తూ విజయగర్వంగా ఆ వేదిక దిగుతున్నాడు.

మళ్లీ చప్పట్లు మారు మోగుతున్నాయి. ఆ సౌండ్ తన అంతరానికి ఆనందాలను అద్దుతుంటే.. అలా ఆ సౌండ్‌ను ఎంజాయ్ చేస్తూ కిందికి దిగాడు. అది ఢిల్లీలో జరుగుతున్న కార్యక్రమం.

ఒక ప్రైవేట్ సంస్థవారు ప్రతి సంవత్సరం షార్ట్ ఫిల్మ్ కాంపిటీషన్స్ నిర్వహిస్తారు. దేశంలోని ఏ రాష్ట్రం నుంచైనా అందులో పాల్గొనవచ్చు. లోకల్ భాషలోనే తీసినా కింద ఇంగ్లీష్‌లో సబ్ టైటిల్స్ వేసి పంపాలి. వివిధ భాషల్లోని టాప్ టెన్ దర్శకులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి ఆ షార్ట్ ఫిలింస్‌ను జల్లెడ పట్టి సెలెక్ట్ చేస్తారు. అందులో షార్ట్ ఫిల్మ్ గనక సెలెక్ట్ అయితే ఇక ఆ దర్శకుడికి, కాస్ట్ అండ్ క్రూకి బాలీవుడ్ నుంచి పేరున్న నిర్మాణ సంస్థల నుంచి ఆఫర్లు వస్తాయి.

సాయిలుకి కూడా అలాంటి ఆఫర్ వచ్చింది స్టేజీ దిగీ దిగగానే. "మీ డెబ్యూ ఫిలిం మా సంస్థ నుంచే రావాలి" అని కోటి రూపాయల అడ్వాన్స్ చెక్ కూడా పట్టుకున్నారు.

సాయిలు దాన్ని చల్లగా తిరస్కరించాడు. తన మూలాలు, వ్యథలు, గాథలు అన్నీ తన మాతృభాషను అంటిపెట్టుకొనే ఉన్నాయి కాబట్టి ముందు తెలుగులోనే సినిమా చేయాలని నిర్ణయించుకున్నాడు. ఆ తర్వాత ఒక యూనివర్సల్ సబ్జెక్టుతో ఆస్కార్ అవార్డు రేంజ్ సినిమా కూడా తీయాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు సాయిలు.

అక్కడినుంచి రైలులో తిరుగు ప్రయాణం అవుతున్నాడు. చేతిలో పురస్కారం తాలూకు గోల్డ్‌షీల్డ్‌లో ఉన్న ప్రతిమ, ఇంకో చేతిలో ప్రశంసా పత్రం. వాటిని పదేపదే చూసుకుంటూ మురిసిపోతున్నాడు. తను ఇన్నేళ్లు పడ్డ కష్టానికి ఇవి తాత్కాలిక ఉపశమనం కలిగిస్తున్నాయనే భావన అతనిలో. కళాకారుడు అంతే.. ఎంత సాధించినా ఇంకా ఏదో చేయాలనే వెలితి.

తమ కళ ఈ సమాజంలో గట్టి ముద్ర వేసినప్పుడే బహుశా కళాకారులకు స్వాంతన లభిస్తుందేమో.. సాయిలులో రకరకాల ఆలోచనలు. అంత పెద్ద స్టేజీ మీద తనను అందరూ సాయిలు అని సంబోధించడాన్ని తలుచుకుంటున్నాడు. ఆ సౌండ్స్ ఇంకా తన చెవుల్లో మారు

క
థ

మోగుతుంటే పెదవులపై సన్నని నవ్వు చారిక. "ఈ పాత పురాణం పేరేందిరా? పైగా నువ్వు సినిమా ఇండస్ట్రీల పని జేస్తున్నవ్. మన నేమ్ మోడ్రన్‌గా, మల్ల క్యాచీగా ఉండాలె. నీ స్క్రీన్ నేమ్‌ను మారుస్తా. నీకు న్యూమరాలజీ ప్రకారం ఈ నేమ్ సెట్ కాదురా" అని న్యూమరాలజీ తెలిసిన సినిమా మిత్రులు కొందరు చెప్పిన మాటలివి.

సాయిలు వాళ్ల మాటలను సీరియస్‌గా తీసుకోలేదు. "పేరు మార్చుకోవడమంటే మన అస్తిత్వాన్ని కోల్పోవడమే. నేను మార్చుకోను. మా అమ్మ నాకెంతో ప్రేమతో పెట్టిన పేరిది. సాయిలూ.. అని మా అమ్మ పిలుస్తే నాకు చాలా గర్వంగా ఉంటది. నేను ఈ పేరుతోనే కంటిన్యూ అయితా.

నాకు ఈ పేరులోనే వైబ్రేషన్ ఉన్నట్టు అనిపిస్తది" అని తాపీగా సమాధానం చెప్పేసేవాడు. ఓల్డ్ ఈజ్ గోల్డ్ అని బలంగా నమ్మినవాడు సాయిలు. ప్రతిభను తప్ప దేన్నీ నమ్మనివాడు తను.

★ ★ ★

ఉదయం ఇంగ్లీష్, హిందీ పత్రికల్లో, వివిధ వెబ్‌సైట్లలో సాయిలు పరిచయం ప్రచురితం అయింది.

తెలుగు సినీ పరిశ్రమ కళ్లు సాయిలు మీద పడ్డాయి. అతనితో సినిమా చేయాలని పెద్ద పెద్ద నిర్మాతలు కాంటాక్ట్ నంబర్ కోసం ప్రయత్నిస్తున్నారు.

★ ★ ★

ఓ ప్రముఖ ఛానెల్ వాళ్లు బలవంతంగా సాయిలుని ఇంటర్వ్యూకి పిలిచారు. అప్పుడే ఏదో సాధించేసినట్టు ఇంటర్వ్యూ అవసరమా అనిపించింది. కానీ, ఒకరి తర్వాత ఒకరు వరుస పట్టినట్టు తన నంబర్‌కి కాల్స్ చేస్తుండటంతో.. తప్పదన్నట్టు ఒక ఛానెల్‌కు ఒప్పుకున్నాడు. యాంకర్ ముందు కూర్చున్నాడు. ముందు ఆమె ఎక్కడలేని పొగడ్తలతో ముంచెత్తేసింది.

తర్వాత ఏం సినిమా చేయబోతున్నారు అని అడిగింది. తన లైఫ్ ఆంబిషన్ గురించి అతను చెప్పిన మాటలు విన్నప్పుడు యాంకర్ ఒక్కసారిగా షాక్ అయిపోయింది. "మా



అమ్మకు నేను కోపిన్ బియ్యం గాకుంట సన్న బియ్యంతోని దినాం బువ్వ తినిపిచ్చినప్పుడే నేను ఎదిగినట్టు.. ఏదో సాధించినట్టు"అని చెప్పాడు. ఆ మాట విని ఆమె నోరు వెళ్లబెట్టింది.

సినిమా దర్శకుడిగా ఇంకా ఎన్నెన్నో అత్యున్నత స్థానాలకు చేరాలని చెప్తాడని భావించిన ఆమె కోపిన్ బియ్యం దగ్గర ఆగిపోయింది. అప్పుడామెకు అర్థం అయ్యిందేమిటంటే సాయిలు చాలా పేదరికం నుంచి వచ్చాడని. అన్నేసి కష్టాలు పడుతూ ఇవాళ ఈ స్థాయికి వచ్చాడని తెలిసి ఆమె ఒకింత గర్వంగా ఫీల్ అయింది. తన గతం గురించి ఆ ఇంటర్వ్యూలో పంచుకుంటున్నాడు. ముఖ్యంగా అమ్మ తమకోసం పడ్డ శ్రమను గుర్తు చేసుకుంటున్నాడు.

★ ★ ★

కామారెడ్డి జిల్లా, నాగిరెడ్డి పేట్ మండలంలోని ఓ మారుమూల పల్లెటూరు అది. ఊరు పేరు వాడి. ఆ ఊరికి ఒక వాగు ఉంది. ఆ వాగు మీదే రైతాంగం ఆధారపడ్డారు.

వాగుకి అవతల ఇంకో ఊరు ఉంటుంది. అక్కడివారు వీళ్లను 'ఏటావలోల్లు' అంటారు. వీళ్లు వాళ్లను అదేవిధంగా సంబోధిస్తారు. ఇంకా ఆ ఊరికి బస్సు సౌకర్యం లేదు. గోపాల్ పేట్‌లో దిగి వాడికి వెళ్లాలంటే పది కిలోమీటర్లు వెళ్లాలి. ఆటోలు నడుపుతున్నారు ఇప్పుడు. ఓ పదేళ్ల ముందైతే దారిలో పొలం పనులకు వెళ్లేవారి ఎడ్లబండి ఎక్కి రావడం, లేదా తెలిసినవారి సైకిల్ కనిపిస్తే వెనక క్యారిల్ మీద ఎక్కడం, వెనక ఎవరైనా ఉంటే మాత్రం ముందు దండా మీద కూర్చొని పెడల్స్ తొక్కడంలో సాయం చేస్తూ వెళ్లడం. ఏదీ లేనప్పుడు 'సోమ మంగళ' అంటూ కాలి నడకన వెళ్లడం వాడి వాసులకు అలవాటైపోయింది.

సాయిలు వాళ్ల నాన్న చిన్నప్పుడే చనిపోయాడు. అప్పటినుంచి ఆ తల్లి తన కొడుకుల కోసం తన రెక్కల కష్టాన్నే నమ్ముకుంది. ఇద్దరు కొడుకుల్లో

కథ

పెద్దవాడు రాజు దివ్యాంగుడు. నడవలేడు, కూర్చోలేడు, కనీసం మాట్లాడనూ లేడు. అతని మంచి చెడ్డ చూడాలంటే ఎల్లప్పుడు ఒకమనిషి వెంట ఉండాలి. లేకపోతే చాలా కష్టం. భూమవ్వకు పెద్ద కొడుకు ఆలనాపాలనా చూడటం కష్టంగా మారినా దాన్ని చాలా ఇష్టంగా స్వీకరించింది. చిన్నోడు సాయిలు చిన్నప్పటినుంచి అమ్మ పడుతున్న కష్టాన్ని చూస్తూ పెరిగాడు. తాను పెద్దయ్యాక అమ్మకు ఏ కష్టం కలగకుండా చూసుకోవాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు.

కల్లు దుకాణంలో భూమవ్వ గూడాలు, బజ్జీలు అమ్ముతూ కొడుకులిద్దరినీ పోషించుకుంటోంది. పాలోళ్లు వేరుపడగా ఆ పెంకుటింట్లో తనవంతుగా రెండు గదుల ఇల్లు వచ్చింది. అందులోనే ఉంటూ తన కొడుకులను చూసుకుంటోంది.

రాజును కూడా కల్లు దుకాణానికే ఎత్తుకెళ్లి అక్కడే పక్కన కూర్చుండ బెట్టుకొని తన పని చూసుకునేది. రాజు ఏళ్లకు ఎదిగినా తన చంకనెక్కే పసిబిడ్డే అయ్యాడు.

తన సంపాదనతోనే ముగ్గురు బతకాలి. సాయిలు ముందు ఎప్పుడూ భూమవ్వ ఒకటే మాట అంటుంది. "బిడ్డా.. మీ అయ్య ఉన్నప్పుడు దినాం కిల బియ్యం కొన్కచ్చుకొని తినేటోళ్లం. పనిలేన్నాడు కడుపు మాడ్సుకునేటోళ్లం. అసలు కోపిన్ కారట్ ఎట్ల తీసుకోవాల్నో గూడ తెల్వక శానొద్దుల దాంక కారట్ తీస్కోలేదు. ఎప్పుడైతే కారట్ తీశినమో అప్పటి సంది తిండికి జర పర్వాన్ తప్పిందిరా.

ఇంట్ల గోలెంల కోపిన్ బియ్యం నిండుంటే నాకు ఏం పర్వాన్ అనిపియ్యది. అది ఖాళీ అయితే సాలిగ, నా పానమంత మెరమెర కొట్టుకుంటది. నా పోరగాండ్లు ఉపాసం ఉండద్దు అనుకుంట. మీ అయ్య ఉన్నప్పుడు పండుగులకు పబ్బాలకు సన్నబియ్యం తెచ్చి పలావ్ బువ్వ అండిపిచ్చేటోడు.

నాకు సన్నబియ్యంతోని చేసిన బువ్వంటే శానిష్టం. మన కొడుకులు పెద్దగైనంక మనకు దినాం సన్నబియ్యం బువ్వనే వెడ్తరే అనేటోడు మీ నాయిన. కనీ, కొడుకుల కష్టం మీద సుఖపడే భాగ్యానికి నోసుకోకుంటనే వోయిండు. మన పాలోల్లల్ల శానమంది మంచిగ బల్శి ఉన్నరు. వాళ్లంతా సన్నబియ్యం తింటరు.

మనం గూడగా సన్నబియ్యం తినే రోజు రావాలె బిడ్డా" అని చెప్పేది. "సన్న బియ్యం తిన్నప్పుడే మనం ఎదిగినట్టు" అని తన చిన్ని బుర్రలో ఫీడ్ చేసుకున్నాడు సాయిలు. కోపిన్ బియ్యం ఆకలి విలువ తెలిసినోడి కడుపు నింపుతాయి.. ఉన్నోడి ఆకలి రుచిని పెంచుతాయి సన్నబియ్యం. బియ్యం నడుమ కూడా ఇంత వ్యత్యాసం ఉందా అని అమ్మ చెప్పాకే తెలుసున్నాడు సాయిలు "సన్నబియ్యం అంటే పైసలున్నోళ్లు, దొడ్డు బియ్యం అంటే పేదోళ్లు తింటరు అన్నకాడికి తెచ్చిరు తినే బియ్యాన్ని గూడా?? సన్నబియ్యం తినేటోళ్లు శాని మన్సులు, దొడ్డుబియ్యం తినేటోళ్లు బగ్గడ్ మన్సులు అనుకుంటున్నరు ఈ మన్సులు" అనుకుని చాలాసార్లు బాధపడ్డాడు.

**ఆ బియ్యం పేదల ఆకలి తీరుస్తాయి.. వ్యాపారులకు కాసుల పంట పండిస్తాయి. ఆ చుట్టుపక్కల మండలాల్లో రేషన్ డీలర్లంతా కుమ్మక్కై బియ్యం, చక్కెర, కిరోసిన్, గోధుమల మీద పెద్ద సిండికేట్ వ్యాపారమే నడిపిస్తున్నారు. "ఈ కోపిన్ బియ్యం ఉండెపట్కెనే మనం బతుకుతున్నం బిడ్డా. లేకపోతే గీ పిరం బియ్యం మనం ఏం కొంటం? ఏం తింటం.. ఎట్ల బతుకుతం? శివారు మీద మనకు బీగెడు పాలం లేకపాయె.**

"మనిషి సృష్టించుకున్న చాలా వస్తువుల్లనే వ్యత్యాసాలు పెట్టుకొని ఆ వస్తువుల వాడకం పరంగ పేద, ధనిక అని తీర్మానించుకుంటున్నరు" అని సాయిలు బాధపడ్డ సందర్భాలు చాలా. అయినోళ్లు కంట్రోల్లో రూపాయికి కిలో బియ్యం తెచ్చి వాటిని పదిహేను రూపాయలకు కిలో బియ్యం చొప్పున బ్లాకులో అమ్మేసుకుని క్యాష్ చేసుకుంటున్నారు.

ఆ బియ్యాన్ని భూమవ్వ కొని ఇంట్లో గోలెం నింపేది. భూమవ్వ దృష్టిలో చౌక ధరల దుకాణం అంటే తనలాంటి పేదోళ్ల కడుపు నింపే దేవాలయంలా భావించేది. లారీ లోడు బియ్యాన్ని హమాలీ అన్నలు దించిపోయాక కిందపడ్డ బియ్యాన్ని భూమవ్వ చీపురు పట్టుకొని పోయి ఊడ్చుకొని వచ్చేది. హమాలీ అన్నల కాలికింద నలగడం వల్ల బియ్యంలో సగం నూకలు అయ్యేవి. పైగా కాళ్లకు అంటుకున్న ఇసుక, కిందున్న మట్టి కూడా కలిసి బియ్యం మైలపడేవి.

ఆ బియ్యాన్ని ఏరుకొని బుక్కడానికి ఆ వాడకట్టులోని కోళ్లు తెగ పోటీలు పడేవి. ఆ బియ్యాన్ని చాలా ఓపిగ్గా చెరిగేది.

నూకలను గిర్నీలో పిండి పట్టించి తన పిల్లలకు రొట్టె చేసిపెట్టేది. అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్న మాటను బువ్వ తిన్నప్పుడల్లా తొలిముద్ద తినేముందు గుర్తు చేసుకుని, ఆ ముద్దను కళ్లకు అద్దుకుని నోట్లో పెట్టుకునేది.

ఆ ఊరిలో ఉన్న చాలామంది సేట్లు, పటేళ్లు కంట్రోల్ బియ్యం అంటే చులకనగా చూసేవారు. "గా బియ్యం మనుసులు తింటరా? మా పొలంల సన్నటి సోనా మైసూర్, బీపీటీ అడ్లు ఏశినం. గవే తింటం మేము" అనేవారు. పేదల ఆకలి తీర్చే ఆ కంట్రోల్ డీలర్ ఈ బియ్యం మీద బాగానే సంపాదించాడు.

పట్నం నుంచి వచ్చే వ్యాపారులకి బ్లాకులో లారీలకు లారీల లోడు బియ్యం బ్లాక్‌లో అమ్ముకునేవాడు. పట్నంలో టిఫిన్ సెంటర్లలో ఇడ్లీ, దోశలకు ఈ బియ్యం పిండే వాడుతారు. అక్కడ కోపిన్ బియ్యం అంటే తమ స్థాయిని తగ్గిస్తాయి అని భావించే ఎంతోమంది బడాబాబులు ఆ

కోపిన్ బియ్యంతో తయారైన టిఫిన్స్‌నే ఆరగించడం యాదృచ్ఛికం.

ఆ బియ్యం పేదల ఆకలి తీరుస్తాయి.. వ్యాపారులకు కాసుల పంట పండిస్తాయి. ఆ చుట్టుపక్కల మండలాల్లో రేషన్ డీలర్లంతా కుమ్మక్కై, బియ్యం, చక్కెర, కిరోసిన్, గోధుమల మీద పెద్ద సిండికేట్ వ్యాపారమే నడిపిస్తున్నారు. "ఈ కోపిన్ బియ్యం ఉండెపట్కెనే మనం బతుకుతున్నం బిడ్డా. లేకపోతే గీ పిరం బియ్యం మనం ఏం కొంటం? ఏం తింటం.. ఎట్ల బతుకుతం? శివారు మీద మనకు బీగెడు పొలం లేకపాయె. పొలం ఉండుంటే మాంచిగ సురేఖ అడ్లు ఏశి గీ పాలిష్ లేని బియ్యం తినెటోళ్లం కొడ్కా. అట్ల యాడాదికి ఇన్ని అడ్లు అచ్చుం టెనన్నా మనకు గాసానికి సరిపోవు. ఏమో పో.. ఇద్దరు కొడుకులు పుట్టిర్రని మాలస్క సంబురవడ్డం.

కనీ, వీన్ని దేవుడు ఇట్ల జేశిండు. నువ్వు ఒక్కోనివేరా సాయిలు. సచ్చి సర్గానున్న మీ నాయిన, మణున్న మీ అమ్మ కోర్కెను తీర్చేది. ఈ ఊర్ల ఇంత ఇల్లు కట్టుకునాలె, సన్నబియ్యం తిని మనం వాళ్ల లెక్క మన్సులమే అని మన పాలోళ్ల ముంగట సుపూత్ జెయ్యాలె" అని ఎన్నోసార్లు చెప్పింది భూమవ్వ.

అమ్మ మాటలను బాగా మనసుకు ఎక్కించుకున్నాడు సాయిలు. ఎలాగైనా ఎదగాలి అనుకున్నాడు. ఆ క్రమంలో అతని మనసు అనూహ్యంగా సినిమా వైపు మళ్లింది. ఎలాగైన సినిమా డైరెక్టర్ అయి తమలాంటి బడుగు బలహీన వర్గాల ప్రజల జీవితాలను సినిమాలుగా మలచాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు. ఈ మాటలను అమ్మ ముందుంచాడు. సినిమా అంటేనే తెలియని ఆమె వద్దంది. "పట్నం వోయి ఏం తిప్పలు వడ్తవు కొడ్కా అద్దు.. ఈడనే ఉండు. మంచిగ సదువుకొని ఏదన్న కొల్వు జెయ్. అన్న గట్లున్నడు. నువ్వు పట్నం గడ్డ ఎక్కుతనంటే వాడు నేను ఆగమైతం" అని చెప్పింది.

కానీ, అతని మనసు నిండా సినిమానే ఉంది. అమ్మకు అర్థమయ్యేలా చెప్పి హైదరాబాద్ వెళ్లాడు. అప్పటికి అతని డిగ్రీ చదువు ఫినిష్ అయింది. సినిమా రంగంలో సక్సెస్ కాకుంటే ఏదైనా జాబ్ చూసుకుందాం అనుకున్నాడు.

అక్కడికెళ్లాక చాలా కష్టాలు పడ్డాడు.

తొలుత ఒకటి రెండు సినిమాలకు అప్రెంటిస్‌గా జాయిన్ అయ్యాడు. జీతం లేని జీవితం. ఈ వయసులో ఏదో జాబ్ చూసుకుంటే డబ్బులు వస్తాయి, అమ్మని, అన్నని బాగా చూసుకోవచ్చు.. కానీ, అలా చేయడానికి అతని మనసులో పాతుకుపోయిన సినిమా ఆ పని చేయనివ్వడంలేదు.

ఇంటి అద్దెలు కట్టలేక చాలా తిప్పలే పడ్డాడు. ఆ సమయంలో అతనికి కోపిన్ బియ్యమే కడుపు నింపాయి. యాభై రూపాయలకు కిలో బియ్యం కొని వండుకొని తినే స్థాయి కాదు తనది. ఇంటి ఓనర్ బ్లాక్‌లో కోపిన్ బియ్యం అమ్ముతుంటే ఆ బియ్యాన్ని కొని రోజులు వెళ్లదీశాడు. షేర్ రూంలో ఉన్న ఫ్రెండ్స్ మాత్రం..

"గా కోపిన్ బియ్యం ఎందుకురా.. మెరిగెలు, రాళ్లు, లక్క పురుగులు ఉంటయి. అసలు మన్సులు తినే బియ్యం లెక్కనే సప్లై జేస్తున్నదా గీ సర్కార్? మాతోటే నువ్వు గూడ గీ సన్నబియ్యం తినరాదు?" అని పోరేవారు. "నాకు ఈ బువ్వనే ఇష్టంరా. నోట్లె దొడ్డ మెతుకులు వడ్తేనే నాకు అన్నం తిన్నట్టు అనిపిస్తది.

సన్నబియ్యం తింటే నాకు అన్నం తిన్నట్టే అనిపియ్యది. నాకు ఈ బువ్వనే నోటికి మజా అనిపిస్తది. కడుపుల తిన్న ఫీలింగ్ కలుగుతది" అని వాళ్లకు సర్ది చెప్పేవాడు. అప్పుడు వాళ్లు ఇతన్ని అప్‌డేట్ కాని వెర్రి మాలోకం అన్నట్టు చిన్న చూపు చూసేవారు. కానీ, వాళ్లకు తెలియదు. ఊర్లో తన అమ్మ, అన్నలు ఆ కోపిన్ బియ్యమే తింటున్నారని. "బువ్వ ఉంటే సాలు. ఎల్లిపాయ కారమో, పచ్చిపులుసుతోనో పొద్దు ఎల్లదియ్యచ్చు" అనుకొనే తనవాళ్లను కాదని తను ఆ సన్నబియ్యం అన్నం తినడం తనకు అస్సలు ఇష్టంలేదు.

**సినిమా దర్శకుడిగా ఇంకా ఎన్నెన్నో అత్యున్నత స్థానాలకు చేరాలని చెప్తాడని భావించిన ఆమె కోపిన్ బియ్యం దగ్గర ఆగిపోయింది. అప్పుడామెకు అర్థం అయ్యిందేమిటంటే సాయిలు చాలా పేదరికం నుంచి వచ్చాడని. అన్నేసి కష్టాలు పడుతూ ఇవాళ ఈ స్థాయికి వచ్చాడని తెలిసి ఆమె ఒకింత గర్వంగా ఫీల్ అయింది. తన గతం గురించి ఆ ఇంటర్వ్యూలో పంచుకుంటున్నాడు. ముఖ్యంగా అమ్మ తమకోసం పడ్డ శ్రమను గుర్తు చేసుకుంటున్నాడు.**

ఫ్రెండ్స్ రూంలో బిర్యానీ, మందు పార్టీలు చేసినా ఏరోజూ సాయిలు ఆవైపు ఆకర్షితుడు కాలేదు. సినిమా దర్శకుడు అవాలనే ఆశయం కన్నా గట్టిగా అమ్మకు సన్నబియ్యంతో అన్నం తినిపించాలనే తపనే అతనిలో బాగా పాతుకుపోయింది. అలా నానా కష్టాలు పడి ఒక ఆర్ట్ ఫిలిం సబ్జెక్ట్ తయారు చేసుకుని దాన్ని తెరకెక్కించాడు. దానికోసం అమ్మ తనవద్ద దాచుకున్న అర్థ తులం చెవి కమ్మలు ఇచ్చింది.

ఫ్రెండ్స్‌ని, వాళ్లని, వీళ్లని డబ్బులు అడిగి కిందామీదా పడి ఆ షార్ట్ ఫిల్మ్‌ను ఎలాగోలా కంప్లీట్ చేశాడు. అది ఇవాళ అతని శ్రమకు మించిన ఫలితం ఇచ్చింది.

అతని గతమంతా విన్న యాంకర్ విస్తుపోయింది. ఆల్ ది బెస్ట్ చెప్పింది. ఇతని కథే మంచి సినిమా అవుతుంది కదా అనుకుంది.

★ ★ ★

మర్నాడు సాయిలు తన ఊరికి బయలుదేరాడు. గోపాల్ పేట్‌లో బస్సు దిగగానే సాయిలుకి కాలి నడకనే తన ఊరికి వెళ్లాలనిపించింది. పచ్చని పైర్లను చూస్తూ కాలువ కట్ట మీది నుంచి వెళ్తూ చింత చెట్ల గుంపు చింతళ్లను చూస్తూ వెళ్తున్నాడు.

కథ

తన చిన్ననాటి జ్ఞాపకాలను అడుగడుగులో వెతుక్కుంటూ నవ్వేస్తూ, పులకించిపోతూ, ఆనందంతో, ఉత్సాహంతో దారి సాగుతున్నాడు. గండ్లె పొలాల్లోని కాలువలో ఇంగిలీకం చేపలు చేతులకు ముల్లడిచ్చినప్పుడు అది కరిచిన చోటు నుంచి మెదడుకి ఎగబాకిన మంట గుర్తుకురాగానే మనసు సులుక్కుమంది. ఆ యాదులు మనసును సుతిమెత్తగా గుచ్చుతుంటే విప్పారిన పెదాలతో దారి సాగుతున్నాడు. గాలికి తల వెంట్రుకలు చిందర వందర అవుతుంటే ముని వేళ్లతో సరి చేసుకుంటూ సాగుతున్నాడు.

ఏటి కాలువ మీదికి రాగానే అక్కడున్న అలుగులో దోస్తులతో ఎండిపోయిన ఆనిగంకాయతో, బైకు ట్యూబును ఛాతి వరకు తొడిగించుకొని ఈత నేర్చుకున్న జ్ఞాపకాలు దృశ్యాదృశ్యం అవసాగాయి.

ఇంటికి వెళ్లగానే అమ్మ భూమవ్వ ఎదురొచ్చి "కొడుకా సాయిలూ.." అని వచ్చి గట్టిగా అలుముకుంది. వాకిట్లో ఉన్న తన అన్న రాజు "హాహా.." అంటూ ఆనందంతో ఉప్పొంగిపోతూ చూస్తున్నాడు. తమ్ముడి దెగ్గరికి రావాలని అనుకుంటున్నాడు. కానీ, అతను నడవలేడు, మాట్లాడలేడు. పుట్టుకతోనే దివ్యాంగుడు. మనుషుల్ని గుర్తుపట్టి నవ్వుతుంటాడు అంతే.

అన్న ఆరాటం చూసి అమ్మను విడివడి అన్న దగ్గరికి వెళ్లిపోయాడు. నోట్లోంచి సొల్లు కారుతుంటే.. తన జేబులోంచి కర్చీఫ్ తీసి తుడిచి, అన్నను ఆప్యాయంగా గుండెలకు హత్తుకున్నాడు. తన బ్యాగులోంచి అన్నకు తెచ్చిన కొత్త డ్రెస్ ఉన్న కవర్ ఇచ్చాడు. వాటిని సరిగ్గా పట్టుకోలేని రాజు ముఖంలో ఆనందం మరింత పెరిగింది. అమ్మకు కూడా కొత్త చీర ఉన్న కవర్ అందించాడు. ఆ తర్వాత తనకు వచ్చిన అవార్డు, ప్రశంసా పత్రం చూపించాడు.

లక్ష రూపాయల చెక్కును కూడా అమ్మ చేతిలో పెట్టాడు. "నా కొడుకు ఏందో సాధిచ్చిండు" అనుకుని వాటిని మురిపెంగా చూస్తోంది. చాలా రోజుల తర్వాత కొడుకు ఇంటికి వచ్చాడని ఆమె ఆనందంతో పలావ్ బువ్వ చేసి పెట్టింది. రాత్రి పండు వెన్నెల్లో వాకిట్లో కూర్చుని అమ్మ, అన్నతో కలిసి పలావ్ బువ్వ తింటూ శిథిలావస్థకు చేరుతున్న తన పెంకుటిల్లును చూసి బ్యాగులో ఉన్న లక్ష రూపాయల చెక్కును గుర్తు చేసుకున్నాడు. "ఆ పైసలతోని ఇల్లు మంచిగ జేపిచ్చుకునాలె" అని అనుకున్నడు. "ఎట్లుందిరా సాయిలు బువ్వా. నువ్వు అస్తున్నవని నాకు ముందుగాల్లనే తెల్సుంటే సన్నం బియ్యం తెప్పిచ్చి పలావ్ బువ్వ ఇంకింత రుచిగ అండుతుంటి" అంది. ఆ మాట వినగానే సాయిలు మనసు చివుక్కుమంది.

అయినా అలవాటు ఉన్న అన్నమే అవడంతో ఆ పలావ్ బువ్వ సాయిలు నోటికి మరింత రుచిస్తోంది. అమ్మను, లోకం తెలియని అన్నను చూస్తూ భోజనం చేశాడు.

* * *

తన ఫోన్ పదేపదే మోగుతుంటే ఎత్తాడు. పెద్ద పెద్ద బ్యానర్ల నుంచి మేనేజర్లు ఫోన్లు చేస్తున్నారు. అడ్వాన్స్ ఇస్తాం ఆఫీసుకు రమ్మంటున్నారు. తన కల సాకారం అవుతున్న వేళ మనసు అదోలా ఉంది సాయిలుకు. ఇన్నేళ్లు హైదరాబాద్‌లోనే ఉండి అప్పుడప్పుడు చుట్టం చూపుగా ఇంటికొచ్చే తనకి ఇక ఇంట్లోనే, అమ్మ అన్నలను బాగా చూసుకుంటూ, ఊళ్లోనే ఉండిపోవాలనిపిస్తోంది.

కళ్లు చెదిరే ఆఫర్ అయినా ఏదోలే అన్నట్టుగా ఉంది అతనికి. ఫోన్లు చేసేవారందరికీ నెల తర్వాత హైదరాబాద్ వచ్చి కలుస్తా అని చెబుతున్నాడు. తను అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన ప్రొడ్యూసర్ పత్రం తన బ్యానర్‌లోనే సినిమా చెయ్యాలని పట్టుబడుతున్నాడు.

ఎన్నో సినిమాలకు ఆయన పని కల్పించాడని సాయిలు కూడా ఓకే చెప్పేశాడు. "పని నేర్చుకొని డైరెక్టర్ కావయ్యా. నేనే నీతో సినిమా చేస్తా. అప్పటివరకు నీకు ఖర్చులకు మాత్రమే డబ్బులు ఇస్తా" అన్న ప్రకారమే ఆ ప్రొడ్యూసర్ మాట నిలబెట్టుకుంటున్నాడని ఆనందం అనిపించింది.

తన ఊరిని వెతుక్కుంటూ వచ్చి యాభై లక్షల చెక్కు అడ్వాన్స్ కింద సాయిలు చేతిలో పెట్టి వెళ్లాడు. "అసిస్టెంట్ డైరెక్టర్ల కష్టాన్ని గుర్తించని ఆయనేనా ఇన్ని పైసలు తనకు ఇస్తున్నది?" అనుకుని చాలా సేపటివరకు నమ్మలేకపోయాడు సాయిలు.

ఇక తన జీవితం మలుపు తిరిగింది, తిరుగు లేదనే భరోసా గుండెల నిండా. అమ్మను, అన్నను చాలా బాగా చూసుకోవచ్చు అనుకున్నాడు. నెల అన్నవాడు కాస్తా మూడు నెలల తర్వాత హైదరాబాద్ వస్తానన్నాడు.

* * *

కొత్తిల్లు కట్టడానికి సిద్ధం అయ్యాడు. తమను ఎంతో అవమానించిన వారి ముందు మేమూ మీలాంటి మనుషులమే.. మాకూ టైమొస్తది. ఆ టైం వచ్చినప్పుడు మనుషులుగానే స్పందించాలని నిరూపించాలనుకున్నాడు. ఇంట్లో నాలుగు క్వింటాళ్ల సన్నబియ్యం సంచులు వేయించాడు. ఆ సన్నబియ్యాన్ని చేతిలోకి ఇంకో చేతిలో పోస్తోంది. అవి నిలువు ముత్యాల్లా గుప్పిటలో జారిపడుతుంటే

> **అన్న ఆరాటం చూసి అమ్మను విడివడి అన్న దగ్గరికి వెళ్లిపోయాడు. నోట్లోంచి సొల్లు కారుతుంటే.. తన జేబులోంచి కర్చీఫ్ తీసి తుడిచి, అన్నను ఆప్యాయంగా గుండెలకు హత్తుకున్నాడు. తన బ్యాగులోంచి అన్నకు తెచ్చిన కొత్త డ్రెస్ ఉన్న కవర్ ఇచ్చాడు. వాటిని సరిగ్గా పట్టుకోలేని రాజు ముఖంలో ఆనందం మరింత పెరిగింది. అమ్మకు కూడా కొత్త చీర ఉన్న కవర్ అందించాడు. ఆ తర్వాత తనకు వచ్చిన అవార్డు, ప్రశంసా పత్రం చూపించాడు.**

ఆమెలో రెట్టించిన ఆనందం. అది చూసి సాయిలు ఉబ్బితబ్బిబ్బవుతున్నాడు.

ఆరోజు నుంచి వాళ్లింట్లో సన్నబియ్యమే ఉడుకుతున్నాయి. సాయిలుకి అప్పుడే ఏదో సాధించాను అనే విశ్వాసం కలుగుతోంది. గొంతులో సర్రున జారుతున్న ఆ అన్నం రుచి ఇంటిల్లాదు లందరికీ కొత్త అనుభూతినిస్తోంది. అయితే వారం తర్వాత భూమవ్వ ఆరోజు ఎందుకో కోపిన్ బియ్యమే వండింది. సచ్చువ చేపల పులుసు పెట్టింది. గిన్నెలో వేడివేడిగా పొగలు గక్కుతున్న ఆ అన్నాన్ని చూసి అమ్మవైపు చూశాడు ప్రశ్నార్థకంగా?

కొడుకు ఏం అడుగుతాడో పసిగట్టింది భూమవ్వ. "ఏమోరయ్య సన్నబియ్యం అన్నగనీ.. దినాం అదే బువ్వ అయేసరికి నోటికేం సైస్తలేదు. ఎంత తిన్నా కడుపు నిండుతలేదు.

కోపిన్ బియ్యంతోని చేసిన బువ్వ ఒక్కపారి తింటే మల్ల పొద్దీకటి దాక ఆకలి గాకపోవు. ఈ సన్నబియ్యం బువ్వ

**కొత్తిల్లు కట్టడానికి సిద్ధం అయ్యాడు. తమను ఎంతో అవమానించిన వారి ముందు మేమూ మీలాంటి మనుషులమే.. మాకూ టైమస్తది. ఆ టైం వచ్చినప్పుడు మనుషులుగానే స్పందించాలని నిరూపించాలనుకున్నాడు. ఇంట్లో నాలుగు క్వింటాళ్ల సన్నబియ్యం సంచులు వేయించాడు.**

తిన్నసంది బువ్వ తిన్నట్టు తుర్తి అనిపిస్తలేదు, కడుపు నిండినట్టు అనిపిస్తలేదు. ఊకూకె ఆకలి అయితు న్నది. ఇగో పెద్దోడు గూడ సరింగ తింటలేడు ఆ బువ్వ" అంటూ ముద్ద కలిపి రాజు నోట్లో పెట్టింది. రాజు అలవాటున్న అన్నం కావడంతో ఆసక్తిగా తింటున్నాడు.

అమ్మను చూస్తూ సాయిలు చిన్నగా నవ్వుకున్నాడు. "అమ్మకు ఏది ఇష్టం అయితే అదే జెయ్యాలె. అవీ బియ్యమే.. ఇవీ బియ్యమే. సన్నయి, దొడ్డుయి గంతే ఫరక్ గదా? మనుషుల్ల కులమతాల లెక్క బియ్యంల గూడ గా ఫీలింగ్ సూపిస్తున్నరు.

సర్కార్ గూడ కోపిన్ల దొడ్డుబియ్యం గాకుంట సన్నబియ్యం సప్లై జేశిన్నాడే.. మనుషులంతా సమానమనే ఫీలింగ్‌తోని అమ్మ సన్నబియ్యం బువ్వ తింటుండచ్చు. ఎంత ఎదిగినా మన మూలాలను మరవద్దని అమ్మ చెప్పకనే చెప్తున్నది. అమ్మకోసం పొలం కొని అన్న సురేఖయి దొడ్డ అడ్లు ఏశి అమ్మకు మాంచి ఇంటి బువ్వ తినిపియ్యాలె" అనుకొని ఆ కోపిన్ బియ్యం బువ్వను ఆప్యాయంగా చూస్తూ ముద్ద తీసుకుని నములుతున్నాడు.

అన్నం నములుతున్న నోటినిండా సంతృప్తిగా భోజనం చేస్తున్న ఫీలింగ్ అతనిలోనూ.

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్తు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

# బాలల కథాంబరంలో 'కూర చిదంబరం'

చిట్టి కథలలో చిదంబరం...



డా॥ పత్తిపాక మోహన్
99662 29548

జాగృహిత్వం మహాదేవ,
జాగృహిత్వం వృషధ్వజ।
జాగృహిత్వం ఉమానాథ, జగతాం
మంగళం కురు॥

ఇది వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని మేలుకొలిపేందుకు 'మధురకవి' శ్రీ మామిడిపల్లి సాంబకవి రాసిన సుప్రభాతంలోనిది. కవి, కథా రచయిత, వ్యాసకర్త, సహృదయులు శ్రీ కూర చిదంబరం పుట్టి పెరిగింది ఈ వేములవాడలోనే. ఏముడాల రాజన్న గుడి మీద జరిగే భజనలు, హరికథలు, ఇతర సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఆయన తన బాల్యం నుండి ప్రత్యక్షంగా చూస్తూ, అందులో పాల్గొంటూ ఎదిగిన వారే! వృత్తిరీత్యా చార్టెడ్ అకౌంటెంట్ అయిన శ్రీ చిదంబరం ఆ వృత్తిలో మా ప్రాంతం నుండి ఎదిగిన మొట్ట మొదటి సి.ఎ.

> **'కష్టేఫలి' వంటి కథలు మనం మన పిల్లలకు తప్పక చెప్పాల్సినవాటిలో ఒకటి. బాల్యం నుండి పిల్లలను అనుకరించడం మనం చూస్తాం. మనం అంటే పెద్దవాళ్ళగా మనం మన పిల్లల కళ్ళ ముందు చేసే ప్రతి పనిని వాళ్ళు శ్రద్ధగా గమనిస్తారు. అనేకసార్లు దానిని ఆదర్శంగా తీసుకుని ఆచరిస్తారు, అది మంచైనా... చెడైనా. అటువంటి కథే ఇది. ఇందులోని పాపలక్ష్మి తన తల్లితండ్రుల్లాగే విత్తనాలు నాటి, ఆ నాటిన విత్తనాలు మొక్కలుగా ఎదగడానికి చేసే పనిని ఇందులో రచయిత చెప్పాడు.**



నేను పుట్టక ముందే సిరిసిల్ల ప్రాంతం నుండి హైదరాబాద్ చేరుకుని అటు వృత్తిలోనూ, ఇటు ప్రవృత్తి అయిన రచనా రంగంలోనూ తనదైన స్థానాన్ని సుస్థిర పరచుకున్న వీరు కథకులుగా తెలుగు పాఠకులందరికీ సుపరిచితులు. విమర్శతో పాటు తన ఆత్మకథాత్మక నేపథ్యాన్ని వ్యాసాలుగా, గ్రంథంగా ప్రచురించారు. అనేక గౌరవ సత్కారాలతో 'పాటు 'ఆవోసా' మరియు ఇతర వైశ్య సంస్థల్లో వృద్ధాశ్రమ నిర్వహణలో భాగస్వామ్యం అవడమే కాక అనేక సామాజిక, సేవా సత్కార్యాలు సైతం ఆయన చేశారు. ఆర్యవైశ్య సంస్థల ద్వారా నిర్వహించిన పలు పత్రికలకు సంపాదకత్వం వహించారు.

వివిధ పత్రికల్లో వారి కథలు చదివి, అప్పుడప్పుడు మాట్లాడేవాణ్ణి. మా ప్రాంతం నుండి వచ్చిన రచయితగా మరింత ఎక్కువగా వారిని చదివేవాణ్ణి. ఉద్యోగ రీత్యా ఢిల్లీ నుండి నాకు హైదరాబాద్ తబాదలా అయ్యాక అనేక కార్యక్రమాల్లో తరచూ కలుసుకునేవాళ్ళం. అనేక కార్యక్రమాలకు శ్రీ చిదంబరం దంపతులు హాజరయ్యేవారు. ఏ సమావేశానికైనా ఆయనను ఒక్కరుగా ఎప్పుడూ చూడలేదు. 'మంచి మిత్రులు' లాగా ఇప్పటికీ ఈ దంపతులు ప్రతీ కార్యక్రమానికి వస్తారు. వృత్తిరీత్యా అనేక అందలాలు ఎక్కి, వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతో కలిసి పనిచేసి ఇటీవలె సి.ఎ. వృత్తిలో యాభైయేండ్లు పూర్తిచేసుకున్నారు. వృత్తిలో ఎన్ని అందలాలు ఎక్కారో ప్రవృత్తి అయిన రచనారంగం లోనూ అంతే. 'ఉషస్సు', 'వేకువ', 'నీటి నీడ' వీరి కథా సంపుటాలు,

వ్యాసం

కథలతో పాటు కవిగా కూడా వీరు పరిచితులు. 'జీవన చిత్రాలు' చిదంబరం కవితా సంపుటి. తన జీవన నేపథ్యాన్ని, వేములవాడ జీవితాన్ని 'అనుభవాలు-పాఠాలు' వ్యాస సంపుటిగా అందించారు. ఇవే కాక అనేక అంశాలపై రాసిన వ్యాసాలు, 'ఆలోచనా సులోచనాలు'గా వచ్చింది.

ఇలా వృత్తిలో నిరంతరం నిమగ్నుడై ఉండి కూడా తనకు నచ్చిన రచనా రంగంలో రాణించిన శ్రీ చిదంబరం గారిది ఏడున్నర పదుల జీవనానుభవం. నిన్నటిదాకా తన అనుభవాలను, ఆలోచనలను కథలు, వ్యాసాలుగా అందించి, ఇవ్వాళ్ళ తండ్రిగా, తాతగా, పెద్దగా తన అనుభవాన్ని, అనుభవాల్ని, అనుభూతులని తన మనవలు, ముని మనవల లాంటి పిల్లల కోసం తాయిలంగా 'నానమ్మ చెప్పిన కథలు'గా చెబుతున్నారు. నిజంగా ఇది శుభపరిణామం. తొలితరం రచయితలంతా తమ రచనలతోపాటు పిల్లల కోసం కూడా విధిగా రాశారు. కందుకూరి నుండి సినారె గారి దాకా మనం చూడొచ్చు. అటు తరువాత వచ్చిన వారిలో కొందరు పిల్లల కోసం రాశారు, ఎందుకో అందరు రాయలేకపోయారు. కానీ ఇటీవల బాల సాహిత్యం పట్ల కలిగిన 'సోయి'తో, పుస్తకాలకు, గ్రామాలకు, అమ్మలు, తాతలకు దూరమై పెరుగుతున్న పిల్లలకు తమవంతుగా మంచి సాహిత్యాన్ని అందించాలన్న సంకల్పంతో అనేక మంది రచయితలు రాస్తున్నారు. ఇంకా రాయాల్సిన అవసరం కూడా ఉంది. ఆ సందర్భంలోనే పెద్దలు కూర చిదంబరం చెప్పిన ఈ కథలు వస్తున్నాయి.

పిల్లలకు అనేక అంశాలను, జంతువులను, మనుషులను, మనస్తత్వాలను తెలిపే కథలు ఈ 'నానమ్మ చెప్పిన కథలు'. రచయిత ఒక్కో కథలో ఒక్కో విషయాన్ని లేదా అంశాన్ని పిల్లలకు తెలిసేలా చెబుతాడు. నిజానికి ఇవి నీతికథల్లా కనిపిస్తాయి. కానీ, ప్రతి కథ నీతితో పాటు ఆచరణ, ఆలోచనను తెలిపేందుకు పిల్లలకు తోడ్పడుతాయి. మొదటికథ 'మోసం చేయవద్దు' అనే కథ మనకు ఒక పిసినారికి సంబంధించిన గుణపాఠం లాగా కనిపించొచ్చు. కానీ కొందరు వ్యక్తులు అన్నీ ఉన్నా లోభత్వాన్ని ఎలా ప్రదర్శిస్తారు, తద్వార ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కుంటారో తెలుపుతుంది. మిగతా కథలన్నీ కూడా ఇలాగే ఏదో ఒక అంశాన్ని ప్రధానంగా తీసుకుని చెప్పినవే.

'కష్టేఫలి' వంటి కథలు మనం మన పిల్లలకు తప్పక చెప్పాల్సినవాటిలో ఒకటి. బాల్యం నుండి పిల్లలను అనుకరించడం మనం చూస్తాం. మనం అంటే పెద్దవాళ్ళగా మనం మన పిల్లల కళ్ళ ముందు చేసే ప్రతి పనిని వాళ్ళు శ్రద్ధగా గమనిస్తారు. అనేకసార్లు దానిని ఆదర్శంగా తీసుకుని ఆచరిస్తారు, అది మంచైనా... చెడైనా. అటువంటి కథే ఇది. ఇందులోని పాపలక్ష్మి తన తల్లితండ్రుల్లాగే విత్తనాలు నాటి, ఆ నాటిన విత్తనాలు మొక్కలుగా ఎదగడానికి చేసే పనిని ఇందులో రచయిత చెప్పాడు. ఇది సాధారణ విషయంలాగే కనిపించొచ్చు కానీ రేపటి తరానికి గొప్ప స్ఫూర్తినిచ్చే అంశం ఇందులో ఉంది. ఇటువంటి విషయాన్ని అవగాహన పరిచే మరోకథ 'కష్టపడితేనే ఫలితం'. ఇది కూడా పిల్లలకు కేవలం నీతిని బోధించి, ఏదో చెప్పి ఊరుకోకుండా వ్యవసాయ జీవితం లేదా నాట్ల నుండి బియ్యం వరకు చక్కని అవగాహనను అందిస్తుంది.

కొన్నిసార్లు చెడ్డవారి సహవాసం వల్ల మనం ఎలా నష్టపోతాం అనే దానిని పిల్లలకు సులభంగా అర్థమయ్యేట్టు చెప్పిన కథ 'దుష్టులతో స్నేహం'. మోసకారి అయిన కుక్కను నమ్మి చివరకు తమ ఆశ్రయాన్ని కూడా కోల్పోయిన పిల్లి, కోడి కథ ఇది. కథలున్నాయి. 'చెడ్డవారి స్నేహం' కూడా ఇటువంటి కథే. ఇలా చిన్నచిన్న విషయాలు, పిల్లలకు అందాలి. తెలియాలి అనుకున్న అనేక అంశాలను తనదైన శైలిలో శ్రీ చిదంబరం కథలుగా మలిచారు. ఇందులో పిల్లలకు నచ్చే 'పోరు నష్టం' వంటి కథతో పాటు 'ఐకమత్యం',

**కొన్నిసార్లు చెడ్డవారి సహవాసం వల్ల మనం ఎలా నష్టపోతాం అనే దానిని పిల్లలకు సులభంగా అర్థమయ్యేట్టు చెప్పిన కథ 'దుష్టులతో స్నేహం'. మోసకారి అయిన కుక్కను నమ్మి చివరకు తమ ఆశ్రయాన్ని కూడా కోల్పోయిన పిల్లి, కోడి కథ ఇది. కథలున్నాయి. 'చెడ్డవారి స్నేహం' కూడా ఇటువంటి కథే. ఇలా చిన్నచిన్న విషయాలు, పిల్లలకు అందాలి. తెలియాలి అనుకున్న అనేక అంశాలను తనదైన శైలిలో శ్రీ చిదంబరం కథలుగా మలిచారు.**

'ఓపిక', 'రక్షణ', 'ఉపాయం' వంటి చక్కని కథలున్నాయి. అసత్యం వంటివి పిల్లలు పలకకూడదని పెద్దగా చెప్పిన కథ 'అబద్ధం ఆడరాదు' కథ. మీరే చదవండి, రచయిత ఎం చెప్పాడో తెలుస్తుంది. 'సామర్థ్యం' కూడా మంచి కథ. ఒకరిపై ఆధారపడి ఉండడం కంటే కష్టపడి పనిచేయడం ఎంత గొప్పో తెలుపుతుంది. ఇలా ఒక్కో కథ గురించి చెప్పుకుంటే బహుశః పిల్లలకు ఇంకా ఏమీ మిగలకపోవచ్చు..

అందులోనూ నన్ను మిక్కిలి ప్రేమించే చిదంబరంగారి రచనలు కావడం వల్ల నేను ప్రతి కథ గురించి చెబుతూ వెళ్తే అది ఔచిత్యం కాదు కదా! పిల్లల కోసం కథల తాయిలాన్ని మూలవాగు, పెద్దవాగు, మానేరుల నేపథ్యంగా తెస్తున్న డెభ్భైయేండ్ల కథల తాతయ్య చెప్పిన 'నానమ్మ చెప్పిన కథలు' పుస్తకాన్ని చిదంబరం గారు పుట్టిపెరిగిన నేల మానేరు తీరపు రచయితల సంస్థ 'మానేరు రచయితలు సంఘం' పక్షాన స్వాగతం పలుకుతున్నాను. మరిన్ని మంచి బాలల కథలతో త్వరలో మరో సంపుటి తేవాలని కోరుకుంటున్నాను. జయహో బాల సాహిత్యం..

సాహితీ శిఖరం

# ఫాసిస్ట్ వ్యతిరేక రచయిత...
# బిష్ణు డే



1971 జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత

జూలై 18, 1909న జన్మించిన బిష్ణు డే బెంగాలీ కవి, రచయిత, అనువాదకులు, విద్యావేత్త, కళావిమర్శకుడు. ఆయన ఆధునిక భావాలు కలిగిన వ్యక్తి. బెంగాలీ సాహిత్యంలో "కొత్త కవితలు" రావడాన్ని గుర్తించిన బుద్ధదేవ్ బసు, సమర్ సేన్ వంటి టాగోర్ అనంతర తరం బెంగాలీ కవులను తయారుచేయడంలో విష్ణు కీలక పాత్ర వహించాడు. విష్ణు డే కలకత్తాలోని మిత్రా ఇనిస్టిట్యూషన్, కలకత్తాలోని సంస్కృత కాలేజియేట్ పాఠశాలలో చదువుకున్నాడు. 1927లో మెట్రిక్యులేషన్ చేసిన తరువాత కలకత్తాలోని బంగబాషి కాలేజీలో చదువుకున్నాడు. కలకత్తాలోని సెయింట్ పాల్స్ కేథడ్రల్ మిషన్ కాలేజీ నుండి ఇంగ్లీషులో బిఏ



(హనర్స్), కలకత్తా విశ్వవిద్యాలయం నుండి ఇంగ్లీషులో ఎం.ఏ. పూర్తి చేశాడు. మార్క్సిస్ట్ భావజాలం ద్వారా అతను ఒక పత్రికను ప్రచురించాడు. అందులో అతను సామాజిక స్పృహతో కూడిన రచనలను ప్రోత్సహించాడు. అతని స్వీయ రచనలు కవియొక్క ఏకాంత పోరాటం, మానవ గౌరవం కోసం తపనలను చాటి చెబుతాయి. ఆయన రిపోన్ కాలేజ్, ప్రెసిడెన్సీ కాలేజ్ (1944-1947), మౌలానా ఆజాద్ కాలేజ్ (1947-1969), కృష్ణానగర్ కాలేజీ వంటి వివిధ సంస్థలలో ఆంగ్ల సాహిత్యాన్ని బోధించాడు. అతని అతి ముఖ్యమైన రచన "స్మృతి సత్తా భవిష్యత్" (జ్ఞాపకశక్తి, జీవి, భవిష్యత్తు) (1955-61), బెంగాలీ కవిత్వానికి కొత్త ఉదాహరణగా నిలిచింది. తరువాత అతనికి 1965లో బెంగాలీలో సాహిత్య అకాడమీ అవార్డుతో పాటు 1971లో భారతదేశపు అత్యున్నత సాహిత్య పురస్కారం జ్ఞానపిఠ్ అవార్డు వరించింది. 40వ దశకంలో బెంగాల్ తీవ్ర సంక్షోభంలో ఉన్నప్పుడు బిష్ణు డే ఆధునిక కవిగా ఉద్భవించాడు. అతను భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి, రెండవ ప్రపంచ యుద్ధం యొక్క విధ్వంసాలకు, వినాశకరమైన బెంగాల్ కరువు మరియు విభజన యొక్క కష్టాలకు సాక్షిగా ఉన్నాడు. ఈ చీకటి కాలాలు అతని కవితలలో ప్రతిబింబిస్తాయి మరియు బిష్ణు డే తరచుగా ప్రపంచాన్ని నరక్ లేదా హెల్ అని వర్ణించారు. డే సామాజిక స్పృహతో కూడిన రచనలను ప్రోత్సహించారు మరియు అదే ప్రయోజనం కోసం కవిత్వ పత్రికను ప్రచురించారు. కవి సోవియట్ ఫ్రెండ్‌షిప్ అసోసియేషన్, కలకత్తా గ్రూప్ సెంటర్, ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా), ప్రగతి లేఖక్ శిల్పి సంఘాలతో లోతైన అనుబంధాన్ని కలిగి ఉన్నాడు. జామినీ రాయ్‌తో అతని సన్నిహిత అనుబంధం ఆర్ట్ ఆఫ్ జామినీ రాయ్ (1988), ది పెయింటింగ్స్ ఆఫ్ రవీంద్రనాథ్ ఠాగూర్ (1958), మరియు ఇండియా అండ్ మోడరన్ ఆర్ట్ (1959) వంటి కళా విమర్శలపై అతని రచనలను వ్రాయడానికి ప్రేరేపించింది. బిష్ణు డే నేషనల్ లిటరేచర్ అకాడమీ అవార్డు (1966), నెహ్రూ మెమోరియల్ అవార్డు (1967) మరియు రాష్ట్రీయ జ్ఞానపీఠ్ అవార్డు మరియు సోవియట్ ల్యాండ్ అవార్డులను కూడా అందుకున్నారు. డే, సుభాష్ ముఖోపాధ్యాయ వంటి కవులతో పాటు ఫాసిస్ట్ వ్యతిరేక రచయితగా పేరుపొందారు.

సాహిత్య శిఖరం

1972 సాహిత్య నోబెల్ విజేత....

# యుద్ధం నిరర్థకతను చాటిన

# హెన్రిచ్ బోల్





సాహిత్యంలో నోబెల్ బహుమతి 1972 హెన్రిచ్ బోల్‌కు అందించబడింది.డిసెంబర్ 21, 1917న కొలోన్, రైన్ నదీతీరంలో, శిల్పి మరియు క్యాబినెట్-మేకర్, విక్టర్ బాల్ మరియు అతని భార్య, మారియా నీ హెర్మన్స్‌ల కుమారుడిగా హెన్రిచ్ బోల్ జర్మనీలోని కొలోన్‌లో జన్మించాడు. అతని రచన నైపుణ్యం జర్మన్ సాహిత్యం యొక్క పునరుద్ధరణకు దోహదపడింది''. 1924 మరియు 1928 మధ్య ఆయన కోల్న్ రాడెర్తాల్‌లోని ప్రాథమిక పాఠశాలలో మరియు 1928 నుండి 1937 వరకు కొలోన్‌లోని ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే కైజర్-విల్‌హెల్మ్ క్లాసికల్ సెకండరీ పాఠశాలలో చదివాడు. అతను బాన్‌లో అప్రెంటిస్ పుస్తక విక్రేతగా పని చేయడం ప్రారంభించాడు. హెన్రిచ్ బోల్ ఒక అమెరికన్ యుద్ధ ఖైదీగా పట్టుబడే వరకు అనేక యుద్ధాల్లో పాల్గొన్నాడు. యుద్ధం ముగిసిన 1938లో అప్రెంటిస్‌షిప్‌ను విడిచిపెట్టాడు. ఆయన రచనారంగంలో మొదటి ప్రయత్నాలను ప్రారంభించాడు. ఆ సమయంలో ప్రైవేట్ పాఠాలు చెప్పాడు. సమయం దొరికినపుడు అధ్యయనం గొప్పగా చేశాడు. 1938లో ఆయన జాతీయ కార్మిక సేవలో చేరాడు. ఆరు నెలల నిర్బంధ సేవను పూర్తి చేసిన తర్వాత 1939లో బయటకు వచ్చాడు.. లేబర్ సర్వీస్ పూర్తి చేయడం విశ్వవిద్యాలయంలో చదువుకోవడానికి అనుమతి కోసం ఒక ముందస్తు షరతుగా ఉండేది. ఆరోజుల్లో . ఆయన 1939 వేసవి కాలంలో జర్మనీ మరియు క్లాసికల్ ఫిలాలజీకి సంబంధించిన నా అధ్యయనాలను ప్రారంభించాడు. అతను కొలోన్‌కు తిరిగి వచ్చి కల్పనలు రాయడం ప్రారంభించాడు. 1950లలో అతను త్వరితగతిన వరుస రచనలను ప్రచురించాడు. 1970లలో హెన్రిచ్ బోల్ రాజకీయ సమస్యలపై దృష్టి సారించాడు. ఇతర విషయాలతోపాటు, అతను సోవియట్ యూనియన్ నుండి బహిష్కరించబడినప్పుడు అలెగ్జాండర్ సోల్జెనిట్సిన్‌కు సహాయం చేశాడు. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో హెన్రిచ్ బోల్ యొక్క అనుభవాలు అతని రచనలో నిర్ణయాత్మక పాత్ర పోషించాయి. అతను యుద్ధం యొక్క నిరర్థకతను మరియు అది తెచ్చే బాధలను చిన్న కథల సంకలనం "వాండరర్''. అతని ప్రారంభ నవల డెర్ జుగ్ వార్ పంక్ట్‌లిచ్ ( 1949) (రైలు సమయానికి వచ్చింది).'' గ్రుపెన్‌బిల్డ్ మిట్ డేమ్'' (1971) (గ్రూప్ పోర్ట్రెయిట్ విత్ ఎ లేడీ)తో సహా యుద్ధానంతర పశ్చిమ జర్మన్ సమాజాన్ని విమర్శించే అనేక నవలలను బాల్ రాశాడు. అతని అత్యంత ప్రసిద్ధ రచనలలో "ది లాస్ట్ హానర్ ఆఫ్ కాథరినా బ్లమ్'' ( 1974) ప్రసిద్ధమైనది. ఆయన 1950 మరియు 1951 మధ్య నేను కొలోన్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్‌లో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేశాడు. 1951 వేసవి నుండి నేను కొలోన్‌లో స్థిర పోస్టల్ చిరునామాతో ఒక ఫ్రీలాన్స్ రచయితగా జీవించాడు. 1946 నుండి 1949 వరకు ఆయన చిన్న కథలను ప్రచురించాడు. 1949లో అయన మొదటి పుస్తకం, డెర్ జుగ్ వార్ పంక్ట్‌లిచ్ అనే నవల ప్రచురించబడింది. ఆయన 1951లో "గ్రూప్పే 47'' సమావేశానికి మొదటి ఆహ్వానం సందర్భంగా చాలా మంది జర్మన్ యుద్ధానంతర రచయితలను కలిశాడు. బోల్ చాలా విజయవంతమయ్యాడు మరియు అనేక సందర్భాల్లో ప్రశంసలు అందుకున్నాడు. 1953లో అతనికి సదరన్ జర్మన్ రేడియో ప్రైజ్ మరియు జర్మన్ క్రిటిక్స్ ప్రైజ్ లభించాయి. 1954లో అతను ట్రిబ్యూన్ డి పారిస్ బహుమతిని అందుకున్నాడు. 1955లో అతనికి ఉత్తమ విదేశీ నవలగా ఫ్రెంచ్ బహుమతి లభించింది. 1959లో అతను నార్త్-రైన్-వెస్ట్‌ఫాలియా స్టేట్ యొక్క గ్రేట్ ఆర్ట్ ప్రైజ్ అందుకున్నాడు. 1960లో అతను బవేరియన్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో సభ్యుడు అయ్యాడు మరియు చార్లెస్ వీల్లాన్ బహుమతిని పొందాడు. 1967లో అతనికి జార్జ్ బుచ్నర్ ప్రైజ్ ఇవ్వబడింది.1972లో అతను సాహిత్యానికి నోబెల్ బహుమతిని అందుకున్నాడు. 1971 నుండి 1973 వరకు ప్రపంచవ్యాప్త రచయితల సంఘం అయిన PEN ఇంటర్నేషనల్‌కు అధ్యక్షుడిగా ఉన్నారు. బాల్ 1983లో అమెరికన్ ఫిలాసఫికల్ సొసైటీకి మరియు 1984లో అమెరికన్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్‌కు ఎన్నికయ్యారు.

వ్యాసం

# ఆదర్శ వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి...

**భారతీయ మహిళ వీరత్వస్ఫూర్తి...**



పింగళి భాగ్యలక్ష్మి
97047 25609

ఝాన్సీ లక్ష్మీబాయి ఈ పేరు వింటేనే యావత్ ప్రజల మనసులు ఆనందంతో సముద్రంలా ఉప్పొంగుతాయి. ఆమె గురించిన భావాలు సముద్ర కెరటాల్లా ఎగిసి పడుతుంటాయి. ఆమె పేరు వినబడితే చాలు వీర వనిత అని కోయిలలు కుహూ రాగంలో చెప్తాయి. చిలకలు కూడా భారతమాత ముద్దుబిడ్డ అని తమ చిలకపలుకులతో చెప్తాయి. ప్రకృతిమాత సైతం పిల్ల గాలుల్ని ప్రసరింపజేస్తుంది. అందుకే ఆమె చైతన్య మూర్తీభవించిన వీరనారి. పరిపూర్ణ నారీ తత్వం, అమర దేశభక్తి, బుద్ధి కుశలత, సౌర్య సాహసాలు, కార్య కుశలత వీటన్నింటి కలయికే మణిరత్నం ఝాన్సీకి రాణి లక్ష్మీబాయి. ఈమె అలుపెరుగని పోరాట యోధురాలు. ఈ పోరాటంలో తనను తాను రక్షించుకోవడమే కాదు తనపై ఆధారపడిన వారికి కూడా రక్షణ కల్పించి వారిలో ఉన్న మనోధైర్యాన్ని వెలికితీసి వారిలో కూడా తనలోని అద్భుతమైన శక్తుల్ని ప్రసరింపజేసి ఆడదంటే అబల కాదు సబల అని నిరూపించిన గుణవతి, రూపవతి అన్నింటినీ మించి భారతమాత ముద్దుబిడ్డ. ఈ భారతమాత ముద్దుబిడ్డ ఝాన్సీకి రాణి లక్ష్మీబాయి మహారాష్ట్రలో వారణాసి పట్టణంలోని సతారాలో 1828 నవంబర్, 19న మోరోపంత్ తంబి, భగీరథి బాయి పుణ్యదంపతుల ఇంట వరాల పుత్రికగా జన్మించింది.

ఈమె అసలు పేరు "మణికర్ణిక". తండ్రి ముద్దుగా 'మను' అని పిలుచుకునేవారు. మను నాలుగేళ్ళ ప్రాయంలోనే తల్లి చనిపోయింది. ఇంతటి క్లిష్ట సమయంలో బాజీరావు పిష్వా అనే దూరపు బంధువు బిరూర్ కు మోరోపంత్ ను పిలిపించుకొని ఆశ్రయమిచ్చి ఆదుకున్నాడు. బాజీరావుకు నానాసాహెబ్ అనే దత్తపుత్రుడు ఉన్నాడు. నానా సాహెబ్ పినతండ్రి కుమారుడు కూడా ఇక్కడే ఉండేవారు. ఇద్దరూ కూడా మణికర్ణికను తన సొంత చెల్లెలులాగా ఆదరించేవారు. అందరూ కలిసి బిరూర్ లో విద్యాభ్యాసం చేశారు. ముగ్గురు కలిసి కత్తిసాము, గుర్రపుస్వారీ, తుపాకీ పేల్చడం లాంటివి నేర్చుకున్నారు. ఖడ్గం ధరించి కళ్లెం బిగించి గాలి విసురుకు ఉవ్వెత్తున ఎగిరే కురులతో గుర్రపు స్వారీ అద్భుతంగా చేసేది మణికర్ణిక.

మణికర్ణిక 13 సంవత్సరాల వయసులో అంటే 1842లో ఝాన్సీ రాజ్యానికి రాజైన గంగాధరరావు నవల్కర్ తో వివాహం జరిగింది. వివాహానంతరం ఆమె ఝాన్సీ పట్టణానికి మహారాణి అయినప్పటికీ వారి ఆచారం ప్రకారం మణికర్ణిక పేరు లక్ష్మీబాయిగా మారింది. 1951 లక్ష్మీబాయికి ఒక కుమారుడు పుట్టి చనిపోయాడు. రాజు అనారోగ్యం పాలయ్యారు. దీంతో మంత్రి వర్గం సలహాతో రాజు తన దూరపు బంధువైన వాసుదేవరావు నవల్కర్ కుమారుడైన దామోదర్ రావును దత్తత తీసుకున్నారు. కాని దత్తత తీసుకున్న మరుసటి రోజే మహారాజు గంగాధరరావు మరణించాడు. దీంతో కొడుకు రాజయ్యే అర్హత ఉన్నా బ్రిటిష్ ప్రభుత్వం అందుకు ఒప్పుకోలేదు. ఈ విషయంపై లక్ష్మీబాయి లండన్ కోర్టులో దావా వేసింది. అక్కడ కోర్టు కూడా కేసును కొట్టివేసింది. లక్ష్మీ బాయి కోర్టుకు వెళ్లిందనే కక్షతో రాజాభరణాల ఖజానాలో రాజు రుణపడి ఉన్న డబ్బును కూడా ఆమె పెన్షన్ నుండి తీసుకొని వెంటనే ఝాన్సీ పట్టణం వెళ్ళమని హుకుం జారీ చేశారు. కానీ లక్ష్మీబాయి తాను ఝాన్సీ పట్టణాన్ని వదిలేది లేదని ప్రతిజ్ఞ చేసి గడగడలాడించింది. ఝాన్సీ పట్టణాన్ని ఆంగ్లేయులకు ఇవ్వకూడదని గట్టిగా నిర్ణయించుకున్న రాణి తన సైన్యాన్ని మరింత బలపరిచే దిశగా స్వచ్ఛందంగా వచ్చిన వాళ్లందరికీ తానే సొంతంగా చక్కని శిక్షణ ఇచ్చి మంచి సైన్యాన్ని తయారు చేసింది. మహిళకి కూడా ప్రత్యేక యుద్ధ శిక్షణ నిచ్చి మహిళా దళాలను తయారుచేసింది. గులాందాసు లాంటి ఆరితేరిన యుద్ధవీరులంతా బలగంలో ఉన్నారు.

వ్యాసం

తాంతియా తోపే లాంటి ప్రముఖులు కూడా ఆమెకు మద్దతునిచ్చారు. లక్ష్మీబాయి సమర శంఖం పూరించడానికి సిద్ధపడింది. నా రాజ్యంలోకి రావడానికి ఎవరూ సాహసిస్తారో చూస్తాను అంటూ ఆమె సింహంలా గర్జించింది. కోట గోడల్ని పటిష్టం చేసి బురుజులపై ఫిరంగులను నిలిపింది. శిక్షణ ఇచ్చిన వ్యక్తులను బురుజులపై ఉంచింది.

ఝాన్సీ లక్ష్మీబాయి సమరాంగణ రాణియై ఈస్టిండియా కంపెనీని తుదముట్టించడానికి సమరశంఖం పూరించడంతో బ్రిటిష్ వాళ్ళు సమరాన్ని అణచివేసే దిశగా ప్రయత్నాలు చేస్తుంటే, సర్ హ్యూగ్ రోజ్ తన సైన్యంతో వచ్చి రాయగడ్, సాగర్, బాణాపూర్ చందేరి ప్రాంతాలను స్వాధీనం చేసు కుంటూ ఝాన్సీకి 15 మైళ్ల దూరంలో ఆగారు. సర్ హ్యూగ్ రోజ్ ఝాన్సీపై ఆక్రమణ జరిపాడు. ఝాన్సీ సేనాని గులాబ్ దాస్ ఆంగ్లేయులను తరిమికొట్టారు. రాజును ఝాన్సీరాణి బంగారు కడియంతో సన్మానించింది. సర్ హ్యూగ్ రోజ్ మళ్ళీ వచ్చి 1858 జనవరి 6 నుండి మార్చి 31 వరకు కోటలోకి ప్రవేశించలేకపోయారు. ఈ సమయంలో ఝాన్సీ ఎంతో ఉత్సాహంగా చురుకుగా చాకచక్యంగా ఉండి నగర రక్షణను తానే స్వయంగా పరిశీలించింది. ఆమె తన బలగాలను అప్రమత్తం చేసి బ్రిటిష్ వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తు అపరకాళిగా వారితో తలపడుతూనే ఉంది. అప్పటికి బ్రిటిష్ వారి దగ్గర 1500మంది సిపాయిలు మాత్రమే వున్నారూ. ఇలా పోరాడుతూనే ఆమె కాల్పియాలో ఉన్న తాంతియా తోపేకు కబురు పెట్టింది. ఆయన వెంటనే తన వద్దనున్న 24 ఫిరంగులు 20 వేల మంది సైన్యంతో వచ్చి బ్రిటిష్ సైన్యం వెనకకు వెళ్లి ముట్టడి చేయాలని పథకం వేశాడు ఝాన్సీలక్ష్మీ బాయితో కలిసి. కానీ హ్యూగ్ రాజ్ ఈ విషయం పసిగట్టి తాంతియాను, లక్ష్మీబాయిని అడ్డుకున్నాడు. మిగిలిన సైన్యంతో ముట్టడి తీవ్రతరం చేశాడు. ప్రధాన ద్వారం వద్ద భీకర పోరాటం జరిగింది.

కానీ ఊహించని విధంగా పరిస్థితి తారుమారైంది. ఓ దేశద్రోహి ద్వారాన్ని బ్రిటిష్ వారి పరం చేశాడు. దాంతో ఆంగ్లేయులు రెట్టించిన ఉత్సాహంతో కోట నుంచి రాణి ఝాన్సీ మందిరం వైపు వచ్చేశారు. లక్ష్మీబాయి తన భర్తని, పిల్లవాడిని దూరం చేసుకొని కూడా దేశం కోసం, ప్రజల కోసం తన దుఃఖాన్ని దిగమింగుకొని ఈ స్వాతంత్ర సంగ్రామంలో చాలా సాహసంతో పరిస్థితులకు ఎదురొడ్డి అపరకాళిగా విజృంభించింది. రెప్పపాటులో ఖడ్గాన్ని తీసుకొని ఆంగ్లేయుల పై దాడి మొదలు పెట్టింది. దీంతో ఆంగ్లేయులు కోటను అగ్నికి ఆహుతి చేసేశారు. రాణి సైన్యాన్ని

**ఝాన్సీ** ఎంతో ఉత్సాహంగా చురుకుగా చాకచక్యంగా ఉండి నగర రక్షణను తానే స్వయంగా పరిశీలించింది. ఆమె తన బలగాలను అప్రమత్తం చేసి బ్రిటిష్ వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తు అపరకాళిగా వారితో తలపడుతూనే ఉంది. అప్పటికి బ్రిటిష్ వారి దగ్గర 1500 మంది సిపాయిలు మాత్రమే వున్నారూ.

అప్రమత్తం చేసి గ్వాలియర్ కు రమ్మని చెప్పింది. తన కుమారుడు దామోదరరావు వీపుకు కట్టుకొని ఒక చేత్తో కత్తి, మరొక చేతిలో గుర్రపు కళ్ళెం పట్టుకొంది. ఆమె తన గుర్రాన్ని గ్వాలియర్ వైపు పరుగు పెట్టించింది. గ్వాలియర్ రాజా సింధియా ఆమెకు సహాయం చేయడానికి నిరాకరించాడు. కానీ నగర ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ వీరనారి సిందియాను ఓడించి గ్వాలియర్ ను స్వాధీనం చేసుకుంది.

మళ్ళీ బ్రిటిష్ సైన్యం బ్రిటిష్ వచ్చి గ్వాలియార్ ను ముట్టడించారు. ఆమె మళ్లీ యుద్ధాన్ని ప్రారంభించింది. శత్రువుల మధ్య అపర కాళియై విజృంభించింది. ఈ వీరాంగన ధాటికి తట్టుకోలేక హ్యూగ్ రోజ్ వెనుకడుగు వేశాడు. కాని ఆమె అక్కడ ఉన్న నదిని దాటాలనుకొంది. ఆకస్మాత్తుగా ఆమె గుర్రం ఒరిగిపోయింది. ఇంతలో వెనుకనుంచి ఓ ఆంగ్ల సైనికుడు ఆమె డొక్కలో పొడిచాడు. రాణి వెనుతిరిగి ఒక్క వేటుతో వాడి తలను నరికి వేసింది. అప్పటికే ఆమె రక్తంతో తడిసిపోయింది. ఇలా ఈ వీరవనిత 17 జూన్, 1858 న యుద్ధంలో వీరమరణం పొందింది. ఇలా అతి చిన్న వయసులోనే తన బుద్ధి కుశలతతో, తన సాహసంతో ఆంగ్లేయుల పాలిట సింహస్వప్నమై జాతికి వన్నె తెచ్చిన పవిత్రమూర్తి భారతరత్నం ఝాన్సీకి రాణి లక్ష్మీబాయికి ఘన నివాళి.



పుస్తక పరిచయం

# సామాజిక దర్పణం 'కైరవ శతకం'

త్రికాలదర్శినియైన కవిత్వ పరమార్శ...

కందాళై రాఘవాచార్య
87905 9363

"తాత మాటలు కైరవా! తరగని నిధి" మకుటంతో మనవడిని సంబోధిస్తూ వెరసి సమాజాన్నీ ఉద్దేశిస్తూ రచించిన వేణుశ్రీ శతకమిది. శతకం రాసిన కవి శతవిధాలా వ్యవస్థ మారాలని నూరు నూరు కవితల తమ జీవితానుభవాన్ని రంగరించి రాత్రీ పగలని ఎరుగక జాగరణగా రాసారు.

"కోరిన నాయకులను కొత్త దేవుళ్లుగా" నేటి నాయకులే ప్రజలకు దేవుళ్ళు అవుతున్నారని పథకాలే వరాలుగా ప్రజలను ఆకర్షిస్తారని పాలాభిషేకాలూ దేవుడికి జరిగినట్లే జరుగుతాయనీ కవి వర్తమాన దుస్థితికి ఈ పద్యంలోవాపోయారు.

"బట్టతలలున్నచో భాగ్యవంతుల నియు... దువ్వెనవసరము లేదు" ఈ పద్యంలో బట్టతలగలవారి బాధను నామోషితనానికి ఊరటనిచ్చు వారికి తల నూనె అవసరం రాదని దువ్వెన చేత ధరించ అవసరమే రాదని-ఇక తలకు రంగు తంటానే ఉండదని కవి చమత్కరించారు!

కులవృత్తులు నడవక ఎలా బాధామయులౌతున్నారో ఈ పద్యంలో "చేనేత వస్త్రాలు చేతనేయుట లేదు మిల్లులు వచ్చియు మింటకెగిసె" ఆధునిక విజ్ఞానం అభివృద్ధి చెందాక చేతితో చేసే గొంగడి, గానుగ నూనె, కంచరి మొదలైన పొట్టకూటి పరంపర కుల వృత్తులు మూలపడ్డాయని కొత్త కొలువుల నియామకం లేక ఎండమావు లేనని ఆకలి ఏలిక అయిందని వ్యవస్థ అవస్థ ఈ పద్యసేద్యంలో ఆర్ద్రమైంది.

"సిన్ననాడాడిన సిర్రగోనాటలు... చిన్న నాటి గుర్తులు నింక చెరగకుండె!" ఈ పద్యంలో ఆనాటి మన బాల్యంలోని ఆటలు. రేగ్గాయలు. చింతకాయలు. కోనేటి యీతలు. ఒట్టుపెట్టుకునే ఈ సరదాలన్నీ ఈనాటి తరాల మధ్య లేవని ఆ స్మృతులను మనకందించారు. ఆ కాలం నాటి బాల్యానందం బహుదూరం అయిందని కవిగారి మన కలవరింత.

"తాగకు తాగుతే తూగకు తూగుతే ఊగకు" అంటూ ఈ పద్యం చమత్కారంగా సాగింది. మద్యం తాగితే ఇంటికి ఏ రకంగా చేరుతాడో ఇల్లాలు ఏ విధంగా వేగిస్తుందో దృశ్యమానం చేసారు. మన చుట్టుపక్కల ఇలాంటి పెద్ద మనుషులెందరో! "మందమతికి పలుమార్లు చెప్పిన గాని తిరిగి అడిగినచో తికమక పడు" ఈ పద్యం విద్యార్థుల మానసికస్థితి గురించి మనకు తేటతెల్లం.

**"తాగకు తాగుతే తూగకు తూగుతే ఊగకు" అంటూ ఈ పద్యం చమత్కారంగా సాగింది. మద్యం తాగితే ఇంటికి ఏ రకంగా చేరుతాడో ఇల్లాలు ఏ విధంగా వేగిస్తుందో దృశ్యమానం చేసారు. మన చుట్టుపక్కల ఇలాంటి పెద్ద మనుషులెందరో! "మందమతికి పలుమార్లు చెప్పిన గాని తిరిగి అడిగినచో తికమక పడు" ఈ పద్యం విద్యార్థుల మానసికస్థితి గురించి మనకు తేటతెల్లం.**

అందరూ ఏకసంథాగ్రాహులుండరని అట్టి వారు వృత్తివిద్యలలో రాణించగలని మార్గదర్శకంగా ఈ పద్యం దిక్సూచియే.

"మా తెలంగాణ మాగాణ మట్టిబిడ్డ సింగిరెడ్డింటి బిడ్డడు నింగికెగసె" మహాకవి జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత మన సి. నారాయణరెడ్డి అస్తమించినవేళ కవి గారు వారిని స్మరిస్తూ రచించిన పద్యంతో అంజలి ఘటిస్తారు. సినారె విశ్వంభర చిత్రసీమల వారి అపురూప పాండిత్యం ఉస్మానియా యూనివర్శిటీలో వారి ఆచార్యత్వం ఈ పద్యంలో పలవరింతగా సాగింది. కవిగారికి వారిపై గల ఆరాధనా భావం ఈ పద్య సంస్పందన.

వేణుశ్రీ ఈ కైరవ శతకం 121 పద్యాలతో అనేకానేక సంఘటనల అనుభవాల దేశకాలాల కవిసమయాల జీవధార. వర్తమాన భూత భవిష్యత్తుకూ కాలదర్శిని.

## పురస్కార విజేతలను ప్రకటించిన పీచర సునీతారావు మెమోరియల్ కమిటి



పీచర సునీతారావు సాహిత్య పురస్కారాలు 2021-22, 2021-22 సంవత్సరానికి పురస్కార విజేతలను పీచర సునీతారావు మెమోరియల్ కమిటీ ప్రకటించింది. ఈ పురస్కారాలకు కవితా సంపుటుల ఎంపికకు ప్రముఖ కవులు శిలాలోలిత బాణాల శ్రీనివాస్ వ్యవహరించారు. అదే విధంగా కథా సంపుటాలకు ప్రముఖ కథా రచయితలు ఆడెపు లక్ష్మీపతి, ఎస్. రఘు వ్యవహరించారు. విమర్శ ప్రక్రియకు ప్రముఖ విమర్శకులు కెపి అశోక్ కుమార్ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఈ పోటీకి కవితా సంపుటాలు 98, కథా సంపుటాలు 65, వ్యాస సంపుటాలు 34, వివిధ రచయితల నుండి అందుకోవడం జరిగింది. వచ్చిన ఆయా విభాగాలకు చెందిన రచనలన్నింటిని న్యాయ నిర్ణేతలు కూలంకషంగా పరిశీలించి తమ నిర్ణయాన్ని ప్రకటించారు. కవితా సంపుటాలలో వెల్దండి శ్రీధర్ రచించిన ఆసు, కథా సంపుటాలలో పెద్దింటి అశోక్ కుమార్ రచించిన గుండెలో వాన, విమర్శలో వెల్దండ నిత్యానందరావు రచించిన అనుభూతి అన్వేషణ, వ్యాస సంపుటి ఎంపికయ్యాయి. పీచర సునీతా రావు మెమోరియల్ ట్రస్ట్ మరియు న్యాయనిర్ణేతల కమిటీ విజేతలను మన: పూర్వకంగా అభినందిస్తోంది. త్వరలో విజేతలకు ఒక్కొక్కరికి 15 వేల నగదు మరియు మెమొంటో శాలువాలతో ప్రముఖ సాహితీవేత్తలతో రవీంద్ర భారతి మినీ హాలులో సత్కరిస్తామని పి విజయేందర్ రావు ట్రస్టు పక్షాన తెలియజేశారు.

- కాంచనపల్లి గోవర్దన్ రాజు,
కన్వీనర్ పీచర సునీత రావు అవార్డు కమిటీ



## తెలంగాణ సాహితీ లిటరరీ ఫెస్ట్‌ను జయప్రదం చేయండి

తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో నిర్వహించే లిటరరీ ఫెస్ట్-2022 బ్రోచర్ ఆవిష్కరణ MVN భవన్ నల్లగొండలో సృజన సాహితీ ఆధ్వర్యంలో నవంబర్ 10, 2022న జరిగింది. నవంబర్ 20, 21, 22 తేదీలలో హైదరాబాదులోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన భవనంలో తెలంగాణ సాహితి వారిచే లిటరరీ ఫెస్ట్ నిర్వహించడం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ వాగ్గేయకారులతో పాటు నవ యువ రచయితలు గాయకులు పాల్గొంటారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో పాటకు పట్టం కడుతూ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రముఖుల సందేశాలు, సినీ గీతాల సాహిత్య విశ్లేషణ, వ్యాస సంకలనం విడుదల, పరిశోధక పత్రాల సమర్పణ, సినీ వాగ్గేయకారుల పరిచయం, సన్మానాలు ఉంటాయి. చివరి రోజున కవి సమ్మేళనం నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో అత్యధికంగా కళాకారులు, కవులు పాల్గొనవలసిందిగా నల్లగొండ సృజన సాహితి అధ్యక్ష, కార్యదర్శులు పెరుమాళ్ళ ఆనంద్, సాగర్ల సత్తయ్య ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ బ్రోచర్‌ను నాగార్జున ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య విడుదల చేశారు. కవులు సిలివేరు లింగమూర్తి, ఉనికి సామాజిక సాంస్కృతిక వేదిక అధ్యక్షులు బండారు శంకర్, ప్రముఖవాగ్గేయకారులు శ్రీకళారామ్మూర్తి, ఎన్వి రఘువీర్ ప్రతాప్, పెరిక మధు, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## బహుజన స్ఫూర్తి ప్రదాతలు అంశంపై రెండు రోజులు జాతీయ సదస్సు...

తేదీ నవంబర్ 17, 18లలో బహుజన స్ఫూర్తి ప్రదాతలు అంశంపై గజ్వేల్ డిగ్రీ కళాశాలలో రెండు రోజులు జాతీయ సదస్సు జరుగుతుందని జాతీయ సదస్సు కమిటీ తెలియజేసింది, నిర్వాహకుడు వెల్దండి శ్రీధర్‌తో పాటు ఈ సదస్సులో అనేకమంది ప్రముఖ బహుజన సాహితీవేత్తల మీద వివిధ పత్ర సమర్పణ ఉంటుందని అన్నారు. రామసింహ కవి వీరభద్ర శర్మ, భాగ్యరెడ్డి వర్మ, కొండా లక్ష్మణ్ బాపూజీ, బోయి భీమన్న, గద్దెపల్లి సత్యనారాయణ, రాజు, అంది నారాయణస్వామి, తిరునగరి రామాంజ నేయులు, మెర మల్లేశం వంటి అనేకమంది స్ఫూర్తి ప్రదాతలపైన పత్ర సమర్పణ, చర్చ ఉంటుంది. పత్ర సమర్పకులుగా కె.వి నరేందర్, ఆర్ సంగీత, భూక్య కాశీరాం, భీంపల్లి శ్రీకాంత్, ఎం దేవేంద్ర, తనికెళ్ల భరణి, కాత్యాయని, విద్మహే, డా॥ అటెం దత్తయ్య, డాక్టర్ కాంచనపల్లి, ఉదారి నారాయణ వంటి ప్రముఖ రచయితలు, విమర్శకులు పాల్గొంటారని ఆయన ఒక ప్రకటనలో తెలియజేశారు

## వరదాచారి కన్నుమూత...



ప్రముఖ పాత్రికేయులు సాహిత్య అభిలాషి జి.ఎస్. వరదాచారి 3-11-22 రోజున స్వర్గస్తులయ్యారు. వారి వయస్సు 92 ఏళ్లు. పాత్రికేయులుగా వరదాచారి ఎన్నో విజయాలు సాధించారు. వరదాచారి మృతికి తంగేడు ప్రగాఢ సంతాపం ప్రకటిస్తోంది వాళ్ల కుటుంబ సభ్యులందరికీ తంగేడు తన సానుభూతిని తెలియజేస్తోంది.

స్వీకారం




## జీవనయానం

డా॥ ప్యారక కృష్ణమాచార్య
హైదరాబాద్
76750 42763

వెల : రూ.100/-




## తెలంగాణ బిసి వాద సాహిత్యం

అట్టెం దత్తయ్య
హైదరాబాద్
సెల్ : 94947 15445

వెల : రూ. 230/-




## జీవుడు - దేవుడు

డా॥ కపిలవాయి లింగమూర్తి

కపిలవాయి అశోక్‌బాబు
సెల్ : 87907 27772
వెల : రూ.200/-




## నానమ్మ చెప్పిన కథలు

కూర చిదంబరం
సెల్ : 86393 38675

వెల : రూ. 100/-




## మనసు పొరలలో...

డా॥ ప్యారక కృష్ణమాచార్య
హైదరాబాద్
76750 42763

వెల : రూ.150/-




## కల్లం - సాహిత్య వ్యాసరాశి

అట్టెం దత్తయ్య
హైదరాబాద్
సెల్ : 94947 15445

వెల : రూ. 150/-




## సారాంశం - సంపుటి 2

అట్టెం దత్తయ్య
హైదరాబాద్
సెల్ : 94947 15445

వెల : రూ. 360/-




## సారాంశం - సంపుటి 1

అట్టెం దత్తయ్య
హైదరాబాద్
సెల్ : 94947 15445

వెల : రూ. 360/-




## ప్రతాపరుద్ర విజయము సర్వజ్ఞ సింగభూపాలీయము

డా॥ సంగనభట్ల నరసయ్య
సెల్ : 94400 73123,

పాలపిట్ట బుక్స్
వెల : రూ. 120/-



తెలంగాణ మొదటి నవలా రచయిత్రి...

# బొమ్మ హేమాదేవి

14 సెప్టెంబర్ 1931 - 26 నవంబర్ 1996